Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 02 Vol.No : 02 | సంచిక : 201 Issue No : 201 | మంగళవారం Tuesday | మే 26, 2026 26 MAY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## ద్రవ్యోల్బణపు సూత్రధారి మోడీ మళ్లీ విజృంభించారు

» కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : కేవలం పది రోజుల్లోనే నాలుగుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలు రూ.8 మేర పెరిగాయి. ఈ ధరల పెంపుపై కాంగ్రెస్ ఎంపి, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సోమవారం మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం పౌరుల జేబుల్ని రహస్యంగా దోచుకుంటుంది అని రాహుల్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ధరల్ని అదుపులో ఉంచి.. అనంతరం విడతల వారీగా పెంచుతున్నారని ఆయన ఎత్తిచూపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీని ద్రవ్యోల్బణపు సూత్రధారిగా రాహుల్ అభివర్ణించారు. రాబోయే ఆర్థిక సంక్షోభం గురించి తాను హెచ్చరించానని, అయితే ఆ సమయంలో ప్రధాని ఎన్నికల ప్రచారంపైనే దృష్టి పెట్టారని రాహుల్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

- మిగతా 2లో..

## ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

సైనింగ్- గ్రౌండింగ్- ఓపెనింగ్ విధానాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం

- ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి అవకాశాలు
- 38 ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించిన సీఎం
- జెన్ -జీ కలల సాకారానికి కార్యాచరణ
- ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదిక ప్రారంభించిన ముఖ్యమంత్రి
- మెటా, అమెజాన్ సహా వివిధ సంస్థలతో సీఎం సమక్షంలో ఒప్పందాలు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటైన ఎంఎస్ఎంఈల ద్వారా తయారైన ఉత్పత్తులు ప్రపంచ విపణికి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపిరిగా ఎంఎస్ఎంఈ రంగం ఉందని... భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తీసుకువస్తే.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు లక్షల మందికి జీవనోపాధిని కలిగిస్తాయని అన్నారు.

2 లో



## ఇంధన ధరల పెంపు..

ట్యాక్స్ తగ్గిస్తే రూ.1 లక్ష కోట్ల నష్టం : నిర్మలా సీతారామన్

» పన్నులు తగ్గిస్తే లక్ష కోట్ల నష్టమన్న నిర్మల » '3-ఎఫ్' అంశాలపై కేంద్రం ప్రత్యేక నిఘా » దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న మంత్రి

» భయాందోళనలు సృష్టించొద్దంటూ రాహుల్ గాంధీకి పరోక్ష కౌంటర్

న్యూఢిల్లీ : దేశంలో ఇంధన ధరలు మరోసారి పెరగడంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం స్పందించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గిస్తే ప్రభుత్వం దాదాపు రూ.లక్ష కోట్ల ఆదాయం నష్టపోతుందని వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందన్నారు. కొందరు పనిగట్టుకొని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని, అలాంటి వాటికి తావులేదని స్పష్టం చేశారు.

**రాహుల్‌కు పరోక్ష కౌంటర్ :** స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) 37వ వార్షికోత్సవంలో మాట్లాడిన మంత్రి ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. పశ్చిమాసియా సంక్షోభం ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా ఉందని స్పష్టం చేశారు. కానీ కొంతమంది అంతా మునిగిపోతోందనేలా భయాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభం ఎదుర్కోబోతోందని హెచ్చరించిన విషయం తెలిసిందే.

**'3-ఎఫ్' ఫార్ములా :** పశ్చిమాసియా సంక్షోభం మొదలై మూడు నెలలు కావస్తున్న తరుణంలో ప్రభుత్వం '3-ఎఫ్' (ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫారెక్స్ - ఇంధనం, ఎరువులు, విదేశీ మారకం)పై ప్రత్యేక దృష్టి

2 పేజీలో..



## మనాలిలో ఆయిల్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

చెన్నై : చెన్నైలోని మనాలిలో ఆయిల్ గోడౌన్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. విచూర్‌లోని లక్ష్మీ నగర్‌లోని ఓ ప్రయివేటు ఆయిల్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ గోడౌన్ నుంచి సుమారు 11.30 గంటలకు దట్టమైన పొగ వెలువడి మంటలు చుట్టుపక్కలకు ఆవరించాయి.


- మిగతా 2లో..

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

» తమిళనాడులో కీలక తీర్పు వెలువరించిన పోక్సో కోర్టు

» విద్యార్థినిపై అత్యాచారం, అతి దారుణంగా హత్య

» అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు



తమిళనాడు : తమిళనాడులో 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో దోషికి రెండు మరణశిక్షలను విధిస్తూ పోక్సో కోర్టు కీలక తీర్పును వెలువరించింది. విలాతికుళం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థినిపై ధర్మ మునీశ్వరన్ అనే వ్యక్తి అత్యాచారం చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడటమే కాకుండా అతి దారుణంగా ప్రవర్తించినందుకు గానూ ఈ శిక్షలు విధిస్తున్నట్లు తెలిపింది. దీనిని అరుదైన కేసుగా పేర్కొన్న పోక్సో కోర్టు, గతంలోనూ పలు నేరాల్లో అతడికి ప్రమేయం ఉన్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపింది.

- మిగతా 2లో..



## పాకిస్తాన్‌తో విడదీయరాని బంధం ఉంది

» జిన్‌పింగ్

బీజింగ్ : పాకిస్తాన్‌తో తమకు విడదీయరాని బంధం ఉందని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. పాకిస్తాన్ ప్రధాని చైనా పర్యటనలో భాగంగా సోమవారం బీజింగ్‌లో ఆ దేశాధ్యక్షుడితో భేటి అయ్యారు. చైనా పరిగణించే ప్రత్యేక దేశాల సమూహంలో పాకిస్తాన్ ఒకటి.

- మిగతా 2లో..

## సముద్ర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ

» తీరప్రాంతం కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు » సముద్రతీర అభివృద్ధిపై నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావత : ఆంధ్రప్రదేశ్‌లోని సముద్ర తీరం అభివృద్ధికి సమగ్ర విజన్ ప్లాన్ తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా కోస్తాంధ్ర తీరం మారేలా ఈ ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సముద్ర తీర అభివృద్ధికి సంబంధించి నిపుణులు, అధికారులతో సీఎం సమావేశం అయ్యారు. ఏపీలో ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంలో అభివృద్ధి ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మత్స్యకారులకు కలిగే ప్రయోజనాలపై పూర్తి స్థాయి అధ్యయనం నిర్వహించాలని సీఎం స్పష్టం చేశారు.

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా బ్లూ ఎకానమీలో భాగంగా సముద్ర ఆర్థిక వ్యవస్థ గురించే చర్చ జరుగుతోందని.. అపారమైన వనరుల్ని వెలికి తీస్తే విస్తృత ప్రయోజనాలు దక్కే అవకాశం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీలో ఆక్వా కల్చర్ అభివృద్ధి చేశామని.. రొయ్యలు, చేపల సాగు, ఎగుమతుల్లో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. ఆక్వా కల్చర్ లో వాల్యూ అడిషన్ జరగాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

2 పేజీలో..



## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు

- మంత్రి అచ్చెన్నాయుడు
- కమీషన్ల కోసం జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధించిందన్న అచ్చెన్నాయుడు
- నాకెంత.. నీకెంత అంటూ దోచుకున్నారని విమర్శ
- కూటమి ప్రభుత్వంలో రూ. 23 లక్షల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

- మిగతా 2లో..

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి



» గోదావరి పుష్కరాలపై రాజమండ్రిలో పవన్ సమీక్ష

రూ. 8,600 కోట్ల పనులకు డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం

వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో ముఖ్యమంత్రికి వివరించాలని ఆదేశం

ప్రజాభూమి ప్రతినిధి, రాజమండ్రి : రాజమండ్రి కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 2027 గోదావరి పుష్కరాల సన్నద్ధత సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకకు ఇప్పటివరకు సరైన సన్నద్ధత కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.8,600 కోట్ల వ్యయంతో చేపట్టాల్సిన పనులకు ఇప్పటికీ డీపీఆర్‌లు సిద్ధం కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాగితాలపై ప్రణాళికలు కాకుండా క్షేత్ర స్థాయిలో పనులు కనిపించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయో సీఎం చంద్రబాబుకు వివరించాలని అధికారులను ఆదేశించారు. సరైన ప్రణాళిక లేకుండా ఒకే ఏడాదిలో 7 వేల పనులు హడావుడిగా చేస్తే నాణ్యత దెబ్బతింటుందని పవన్ హెచ్చరించారు.

2 పేజీలో..

## ఉక్రెయిన్ పై క్షిపణి దాడి..

'ఒరెష్నిక్'ని ప్రయోగించిన రష్యా



కీవ్ : ఉక్రెయిన్‌పై ఆదివారం రష్యా భారీ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. ముఖ్యంగా రాజధాని కీవ్ రీజియన్‌పై వీటితో రష్యా విరుచుకుపడింది. ఈ దాడుల్లో శక్తిమంతమైన హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణులను రష్యా ప్రయోగిస్తోందని ఉక్రెయిన్ ఆరోపించింది. బిలా సెర్క్వా నగరంపై ఆదివారం ఉదయం రష్యా

- మిగతా 2లో..

# ప్రపంచ విపణికి ఎంఎస్ఎంఈ ఉత్పత్తులు

విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026కు ముఖ్యమంత్రి హాజరయ్యారు.
అంతకుముందు 4.4 ఎకరాల్లో 1.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన అంబేద్కర్ కళావేదికను ముఖ్యమంత్రి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఒకేసారి 1500 మంది హాజరై కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెషన్ సెంటర్ నిర్మించటం సంతోషమన్నారు. అమరావతిలోనూ ఈ తరహా కన్వెన్షన్ సెంటర్లను నిర్మించనున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలో మరో ఐదు కన్వెన్షన్ సెంటర్లు నిర్మించనున్నట్టు సీఎం తెలిపారు. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ సందర్భంగా రాష్ట్రంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వం ఇస్తున్న వెసులుబాట్లను... చేయూతను ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉంది. యువత కలలకు, మహిళ ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా ఉన్న ఈ రంగం వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తోంది. ఏపీలో వనరులకు, అవకాశాలకు కొదవలేదు. వీటిని వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అవకాశాలు కల్పిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, రైల్వే లాంటి లాజిస్టిక్స్ కూడా ఏపీలో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ, ఎంట్రప్రెన్యూర్ డెవలప్మెంట్ పాలసీ, ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తెచ్చి ఈ రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ సమ్మిట్ కొత్త ఆవిష్కరణలకు వేదిక కావాలి. కొత్త పరిశ్రమలకు శ్రీకారం చుట్టాలి. పారిశ్రామిక యూనిట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంలోనూ 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 100 పార్కులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవాళ మరో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఈ 138 పారిశ్రామిక పార్కులు సిద్ధం అవుతాయి. మిగిలిన వాటిని జూలై నాటికి శంకుస్థాపనలు చేసి అన్ని మౌలిక వసతులూ కల్పిస్తాం. ఈ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు."అని ముఖ్యమంత్రి అన్నారు.

**APCMEPకు రూ. 300 కోట్లు**

"ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పారిశ్రామిక సంస్థలు, నిపుణులు, బ్యాంకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, లబ్దిదారులు ఒకే వేదికపైకి వచ్చారు. వన్ ఫ్యామిలీ - వన్ ఎంట్రప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు కావాలి. రాష్ట్రంలో 20.77 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.558 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. పీఎంఈజీపీ, క్రెడిట్ గ్యారంటీ స్కీమ్, పీఎం విశ్వకర్మ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను సమన్వయం చేస్తూ ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్ కింద రూ.300 కోట్లను కేటాయిస్తున్నాం. రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం. ఏపీఐఐసీలో ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించే ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకూ 2953 ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. వీటి ద్వారా రూ.4.68 లక్షల కోట్ల పెట్టుబడులు సమకూరాయి. ప్రైవేటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తాం. ప్రైవేటు రంగంలో శ్రీసిటీ ఓ విజయవంతమైన పారిశ్రామిక పార్కు." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు లక్ష్యం**

"రాష్ట్రంలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దుతామని ... మహిళా సంఘాల వద్ద ప్రస్తుతం రూ.28 వేల కోట్ల కార్పస్ ఉంది. ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఏపీని ఇన్నోవేషన్ డ్రివెన్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది ప్రభుత్వ నినాదం. గ్రామీణ ప్రాంతాలకు టెక్నాలజీ తీసుకువెళ్లాలనే లక్ష్యంతో స్మార్ట్ విలేజ్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. ఓ పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుంది. సర్క్యులర్ ఎకానమీపై ఎంఎస్ఎంఈలు దృష్టి పెట్టాలి. ఎంఎస్ఎంఈలు ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలన్న లక్ష్యంతో మెటా, అమెజాన్, జోహో లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నాం."అని ముఖ్యమంత్రి తెలిపారు.

**జెన్ జీ వర్గం యువత కలల్ని సాకారం చేస్తాం**

"మెటా, అమెజాన్ లాంటి సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలు యువత భవిష్యత్తుకు ఉపాధికి, నైపుణ్యాలకు కొత్త దారుల్ని సృష్టిస్తాయి. మారుతున్న టెక్నాలజీ... ఉద్యోగాల స్వరూపాన్ని మారుస్తోంది. అందుకే టెక్నాలజీ స్కిల్ బిజినెస్ ఇంటిగ్రేషన్ మోడల్ ను అనుసరిస్తున్నాం. పరిశ్రమలకు అనువైన స్కిల్ డెవలప్మెంట్ పై దృష్టి పెట్టాం. ఆధునిక టెక్నాలజీ ఎకోసిస్టమ్ ద్వారా రాష్ట్ర యువతకు గ్లోబల్ స్థాయిలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఏఐ, మెటలర్జీ, లాజిస్టిక్స్, క్లీన్ ఎనర్జీ ఏవియేషన్ లాంటి ఫంక్షనల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నాం... పరిశ్రమలకు నైపుణ్యాలు అందించే కేంద్రాలుగా ఇవి మారబోతున్నాయి. జెన్- జీ, జెన్- ఆల్ఫా, టీనేజర్లకు మేలు కలిగేలా... వారి భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా కీలకమైన అంశం. యువశక్తి, టెక్నాలజీ, పరిశ్రమల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ రీజియన్లతో ఏపీ అభివృద్ధి చేస్తున్నాం. ప్రతీ రంగంలోనూ ఎంఎస్ఎంఈలు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్కారం ఉంది. ప్రధాని మోదీ ఇచ్చిన చిప్ టు షిప్ అన్న నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై దృష్టి పెట్టాం. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ అన్నది ప్రభుత్వ విధానం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా సీఎం సమక్షంలో మెటా, అమెజాన్, జోహో సహ వివిధ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఒప్పందం కుదుర్చుకుంది. డీప్ టెక్ స్టార్టప్ కంపెనీలకు రూ.20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఒప్పందం చేసుకుంది. ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్లో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలోని స్టార్టప్ కంపెనీలు తయారు చేసిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్ ఇతర ఐటీ, టెక్ ఉత్పత్తులు, డిఫెన్స్ ఉత్పత్తులు, దీఎజూ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులు, ప్రైవేట్ సంస్థలు రూపొందించిన డ్రోన్ బోట్లు, వివిధ రకాల గిరిజన ఉత్పత్తులను సీఎం తిలకించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## సంపాదకీయం

### కాంగ్రెస్, ఆప్ ఎజెండాతో కాక్రోచ్ పార్టీ

భారత రాజకీయాల్లో యువత ప్రవేశించాలి. నేతల అక్రమాలను ప్రశ్నించాలి. అక్రమాలను నిలదీయాలి. అక్రమార్కులను ఎండగట్టాలి. పాచిపోయిన విధానాలను తూర్పారా పట్టాలి. ఈ దేశానికి ఏది అవసరమో దానిని ఎజెండగా ముందుకు తీసుకుని రావాలి. కానీ యువత ఎందుకనో అచేతనంగా ఉంటోంది. ఓటు వేయడానికే బద్ధకిస్తోంది. జెన్ జి అంటూ వార్తలు వస్తున్నా..గట్టిగా నిలబడి రాజకీయ అవినీతిని నిలదీయడం లేదు. రాజకీయ అక్రమాలను నిలదీయడం లేదు. కానీ కాక్రోచ్ జనతా పార్టీ పేరుతో ఆన్లైన్ వేదికగా పుట్టుకు వచ్చిన ఓ పార్టీకి కోట్లల్లో లైక్‌లు కొడుతూ..వస్తున్నారు. నిజంగానే ఈ పార్టీ పెట్టిన వారు..దీని లక్ష్యం గురించి ఆలోచిస్తే..అసలు విషయం బయటపడుతుంది. పక్కాగా కాంగ్రెస్, ఆప్ పార్టీల ఎజెండాతో ఇది అవతరించింది. ఇందులో ప్రధాన ఎజెండాలో ఉన్న ఐదు హామీలు కాంగ్రెస్, ఆప్‌లవే అని చెప్పాలి. ఈ రెండు పార్టీల సూత్రధారులుగా అభిజిత్ అన్న వ్యక్తి అమెరికా నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రకటించిన ఈ పార్టీ కేవలం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత యువతను బొద్దింకలతో, పరాన్నజీవులతో పోల్చడం వల్లే జెన్‌జీ గొంతెత్తిందని ప్రచారం చేస్తున్నారు. అయితే ఇక్కడ జస్టిస్ సూర్యకాంత ఏ సమయంలో ఎవరిని ఉద్దేశించి, ఎందుకు బొద్దింకలు, పరాన్న జీవులు అన్నాడో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లుగా బొద్దింకల పార్టీ అంటూ ప్రకటించడం, దానికి గొర్రెల్లాగా మద్దతు తెలపడం దారుణం. ఇది ఓ రకంగా కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో లాయర్లుగా, ఆర్టిఐ కార్యకర్తల్లాగా సమాజం మీద పడి పోతున్నారన్న సందర్భంగా జస్టిస్ట్ సూర్యకాంత బొద్దింకలు పదాన్ని వాడారు. నిజంగానే జెన్‌జీ పోరాటం చేయాల్సిన సామాజిక రుగ్మతలు ఉన్నాయి. పాలకుల దుష్ట పన్నాగాలను దునుమాడాలి. మన విద్యావ్య వస్థను భ్రష్టు పట్టిస్తున్నందుకు గొంతెత్తాలి. మన వైద్యారోగ్య రంగాన్ని ప్రైవేటుకు తాకట్టు పెట్టినందుకు నిలదీయాలి. స్వాతంత్రోద్యమ కాలంలోనూ, ఆ తరవాత కూడా యువత దేశంలో కీలక భూమిక పోషించింది. అసోంలో విదేశీ చొరబాట్లకు వ్యతిరేకంగా అస్సాగణ పరిషత్ చేసిన పోరాటం అనన్యసామాన్యం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తెలంగాణ తొలిదశ, మలిదశలోనూ యువతే కీలక భూమిక పోషించింది. అయితే ఇవన్నీ పక్కన పెట్టి కేవలం కాంగ్రెస్, ఆప్ గేమ్ ప్లాన్‌లో యువత పడిపోవడం దౌర్భాగ్యం. నిజానికి చట్టసభల్లో అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీల్లోనూ కొన్ని కుటుంబాలే ఏళ్లుగా పట్టుకుని వేళ్లాడుతున్నాయి. ఆప్ చరిత్ర ఎవరికీ తెలియనిది కాదు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని హైజాక్ చేసుకుని వచ్చిన అరవింద్ కేజ్రీవాల్ అవినీతిలో కూరుకుపోయారు. ప్రజల్లో కల్పించిన ఆశలను వమ్ముచేశారు.
అన్నా హజరానేనే మోసం చేసి మనముందు ఇప్పుడు నిలబడ్డాడు. ఇకపోతే గబ్బిలాల్లాగా చట్టసభల్లో తరతరాలుగా కొందరే పట్టుకుని వేలాడుతున్నారు. ఒకే కుటుంబం నుంచి కొందరే పార్లమెంట్ లేదా, అసెంబ్లీల్లో ఉంటున్నారు. పార్లమెంటులో సోనియా, రాహుల్, ప్రియాంక ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి వీరు ముగ్గురూ ఎందుకు ఉండాలి. అమిత్ షా కొడుకు ఏం అర్హత ఉందని బిసిసి అధ్యక్షుడయ్యారు. ఇలాంటివి ప్రశ్నించాలి. చంద్రబాబు కుటుంబంలో చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణ, శ్రీభరత్, పురందేశ్వరిలు మాత్రమే ఎందుకు ఉండాలి. తెలంగాణలో వెంకటస్వామి ఇద్దరు కొడుకులు వివేక్, వినోద్‌లు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వివేక కొడుకు వంశీ ఎంపిగా ఉన్నారు. వీరంతా ఎస్సీ రిజర్వ్ కేటగిరీలో ఎంపికయ్యారు. మల్లు భట్టివిక్రమార్క బ్రదర్స్, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆయన భార్య పద్మవతిలు కూడా ఒకే ఇంటినుంచి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. వీరే నాయకులా..ఇక వేరే వారు లేరా. తెలంగాణ ఉద్యమంలో యువత బలిదానాలు చేస్తే...కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, ఇంకా కొందరు బంధువులు తెలంగాణను భ్రష్టు పట్టించి దోచుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లుగా ఉన్నాయి. జెన్‌జీ అని చెప్పకుంటున్న యువత వీటిని నిలదీయాలి. కొందరే ఎల్లకాలం ప్రజాప్రతినిధులుగా ఎందుకు ఉండాలో అడగాలి. ప్రస్తుత డిజిటల్ యుగంలో రాజకీయాలను విశ్లేషించే విధానం పూర్తిగా మారిపోయింది. గతంలో తీవ్రమైన చర్చలు, వీధిపోరాటాల ద్వారా సాగిన రాజకీయ నిరసన నేడు సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్నది. మీమ్స్, పొలిటికల్ సెటైర్ల రూపంలో సాగుతున్నది. ఈ క్రమంలో జెన్-జీ యువత సృష్టించిన సరికొత్త వ్యంగ్యాస్త్రమే 'కాక్రోచ్ జనతా పార్టీ'. ఇది నిజమైన రాజకీయ పార్టీ కాకపోయినా ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని లోపాలను, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టే విధంగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నది. అయితే ముందే చెప్పినట్లు దీని ఎజెండా కేవలం కాంగ్రెస్, ఆప్ ఎజెండగా నిలవడమే పెద్ద లోపభూ యిష్టంగా ఉంది. అసలు సమస్యలు వదిలి రిటైర్డ్ జడ్జిలని ఎంపిలుగా తీసుకో, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నిలదీస్తాం వంటివన్నీ కాంగ్రెస్ ఎజెండా. సుమారు 145 కోట్ల ఈ దేశ జనాభా లో 65శాతానికి పైగా జనాభా 35ఏండ్ల లోపు ఉన్నవారే. అంటే ప్రపంచంలోనే అత్యధిక యువతను కలిగిన దేశమిది. ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించాల్సింది వీరే. వీరే ముందుండి నడపాల్సిన అసవరం ఉంది. అపారమైన శక్తి కలిగిన ఈ దేశ యువతను తప్పదోవ పట్టించేలా అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమాల వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ముందుకు రావడం, యువతను ఆకట్టుకోవడం చేశాడు. అంతవరకు మంచిదే అయినా, ఆయన గతమంతా ఆప్‌లో పనిచేసిన అనుభవాన్ని మరువ రాదు. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌లకంటే కూడా 1.6 కోట్ల ఫాలోవర్స్‌తో దేశంలోనే అతిపెద్ద ఫాలోయింగ్ ఉన్నట్లుగా తేలింది. దేశంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, ఏ సిద్ధాంతం గెలిచినా.. కొందరు నాయకులు మాత్రం తమ పదవులను, ఉనికిని కాపాడుకోవటానికి రాత్రికి రాత్రే అధికార పార్టీలోకి మారిపోతుంటారు. సిద్ధాంతాలు, విలువలతో సంబంధం లేకుండా ఎల్లప్పడూ అధికారంలో కొనసాగే అవకాశవాద, ఫిరాయింపు నాయకులను ఈ బొద్దింకల పార్టీ నిలదీయగలిగితే మంచిదే. మన దేశ యువతరం ఆలోచనలు ఎంత ఉన్నతంగా ఆలోచనాత్మకంగా ఉన్నాయనేదానికి వారి కార్యాచరణ ముఖ్యం. సమాజంలో పెరుగు తున్న అవినీతిని, రాజకీయ అస్థిరతను సంస్కరించేందుకు యువత నడుం బిగించాలి. ప్రజాస్వామ్యంలో పాలకులను ప్రశ్నించటానికి, విమర్శించటానికి ఆరోగ్యకర మైన వేదిక అవసరం ఉంది. దేశంలో నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్న పాలకులను ఎంతమాత్రం క్షమించ రాదు. వారు ఏ పార్టీ వారైనా నిలదీయల్సిందే. ప్రజల ముందు దోషులగా నిలబెట్టాల్సిందే. నీట్ పరీక్షా పత్రం లీకేజీపై కూడా నిలదీయాల్సిందే. నేర చరిత్రలేని నాయకులు చట్టసభల్లో ఉండాలి. దేశం కోసం పాటుపడేవారంతా ప్రశ్నించటం నేర్చుకున్నప్పడే భారత ప్రజాస్వామ్యం బలపడుతుంది. ప్రశ్నించడం మంచిదే అయితే, అనేక అంశాలను ప్రశ్నించడం ఎజెండాగా చేసుకుంటే మంచిది. అంతే తప్ప మరో రాజకీయ పార్టీ సృష్టించిన వేదిక ద్వారా చేయడం మాత్రం సరికాదు.

## ద్రవ్యోల్బణపు సూత్రధారి మోడీ మళ్లీ విజృంభించారు

'ఎన్నికల ఫలితాల తర్వాత 'ద్రవ్యోల్బణపు సూత్రధారి మోడీ మళ్లీ విజృంభించారు. వారు పెట్రోల్, డీజిల్ ధరల్ని విడతలవారీగా పెంచుతూ మీ జేబుల్ని రహస్యంగా దోచుకుంటున్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలు రూ. 8 పెంచారు. ఈ పెరుగుదల ఇలాగే కొనసాగుతూ ఉంటుంది. ద్రవ్యోల్బణపు సూత్రధారి మోడీ చేసే ఏకైక పని ఆయన ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం.. మిగతా సమయంతా ప్రజల జేబులపై దాడి చేయడమే అని రాహుల్ ఎక్స్ పోస్టులో మోడీపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు.
కాగా, పెట్రోల్, డీజిల్ ధరలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్న?జన ఖర్గే కూడా కేంద్రంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతి ఇంధన ధరల పెంపు గృహ బడ్జెట్‌లపై మరో పెద్ద దెబ్బ. ఇది ఆర్థిక వ్యవస్థలోని ప్రతి అంశంపై గొలుసుకట్టులా ప్రభావం చూపుతుంది. రైతుల నుండి ఎంఎస్ఎంఇల వరకు.. ఇలా సమాజంలోని ప్రతి వర్గం బిజెపి దోపిడీ భారాన్ని మోస్తోంది అని ఖర్గే ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## ఉక్రెయిన్ పై క్షిపణి దాడి..



జరిపిన దాడిలో ఇద్దరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.
దాడి కారణంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస సముదాయాలు, పాఠశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా దాడులను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. సాధారణ పౌరులే లక్ష్యంగా రష్యా భారీ డ్రోన్, క్షిపణి దాడులకు తెగబడిందని విమర్శించారు. గడిచిన నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో హైపర్ సోనిక్ 'ఒరెష్నిక్' క్షిపణుల ప్రయోగించడం ఇది మూడోసారి మాత్రమే కావడం గమనార్హం. అయితే, ఉక్రెయిన్ ఆరోపణలపై రష్యా ఇప్పటి వరకు స్పందించలేదు.

## గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు



**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

## పాకిస్తాన్‌తో విడదీయరాని బంధం ఉంది : జిన్‌పింగ్



పాక్ సన్నిహిత ఆర్థిక, వాణిజ్య, భద్రతా సహకారంతో కూడిన సంబంధాలతో, అన్ని కాలాలకు అనువైన వ్యూహాత్మక భాగస్వామి అని జిన్‌పింగ్ అన్నారు. కాగా, గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో పాక్ ప్రధాని షరీఫ్‌కు చైనా అధ్యక్షుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ షరీఫ్‌ని ఓల్డ్ ఫ్రెండ్ అని పిలిచారు. పాక్ -- చైనా ఇరు దేశాలు దశాబ్దాలుగా ఒకదానికొకటి అర్థం చేసుకుని, విశ్వసించి, మద్దతు ఇచ్చుకుంటూ, విడదీయరాని సాంప్రదాయ స్నేహాన్ని ఏర్పరచుకున్నాయని జిన్‌పింగ్ అన్నారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా.. చైనా ఎల్లప్పుడూ చైనా -- పాకిస్తాన్‌ల అభివృద్ధికి, దౌత్య సంబంధాలకే ప్రాధాన్యతనిస్తుందని ఆయన అన్నారు. ఉమ్మడి భవిష్యత్తుతో మరింత ఐక్యతతో చైనా-పాకిస్తాన్ సమాజాన్ని నిర్మించడానికి ఇస్లామాబాద్‌తో కలిసి పనిచేయడానికి బీజింగ్ సిద్ధంగా ఉంది అని జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా షరీఫ్ పాక్- చైనాలు సాటిలేని సంబంధం కలిగిన రెండు ఉక్కు సోదర దేశాలుగా అభివర్ణించారు.

## సముద్ర సంపద అందిపుచ్చుకునేలా కార్యాచరణ

దీంతో పాటు ఆక్వా వ్యర్థాలు కాలుష్య కారకంగా మారి పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ సవాళ్లను పరిష్కరించేలా పూర్తి స్థాయి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే మెరైన్ బయోడైవర్సిటీని కాపాడేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సముద్రాలతో పాటు తీరప్రాంతాల్లో దొరికే రేర్ ఎర్త్ మినరల్స్ పై కూడా ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని.. ఆ వనరుల్ని అందిపుచ్చుకోవాలన్నారు. తీరప్రాంత రక్షణ పైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. తుపాన్ల లాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా సముద్ర తీరాల్లో మడ అడవులు, తాటి చెట్లు లాంటి మూడంచెల సహజ రక్షణ కవచం ఏర్పాటు చేసేలా చూడాలని స్పష్టం చేశారు. పర్యావరణ అనుకూల విధానాలతో పాటు పర్యాటకం, ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా సముద్ర తీరప్రాంతాలు తయారు కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అలాగే సీ వీడ్ అభివృద్ధి, మార్కెటింగ్ లాంటి అంశాలపై కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ నాయక్, రైతు సాధికార సంస్థ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, మెరైన్ డైవర్సిటీ సంస్థ వోయసీ సంస్థ ప్రతినిధి ఫిలిప్ తదితరులు హాజరయ్యారు.

## ఇంధన ధరల పెంపు..

సారించిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల ఎరువుల ధరలు ఊహించని స్థాయికి చేరాయని, బంగారం ధరలు పెరగడం కూడా సవాలుగా మారిందని చెప్పారు. బయటి సంక్షోభాలను తట్టుకునేలా మోదీ నేతృత్వంలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.
**భయాందోళనలు వద్దు :** ప్రస్తుత సవాళ్లు అన్నీ అంతర్జాతీయ పరిస్థితుల వల్ల వచ్చినవేనని, దేశీయంగా ఆర్థిక పరిస్థితి సానుకూలంగానే ఉందని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు సాధిస్తున్న విజయాలను మరిచిపోయి, కేవలం నెగటివిటీని ప్రచారం చేయడం సరికాదన్నారు. మన దేశం ఇలాంటి భయానక ప్రచారాలను భరించలేదని, మన మాటలు, చేతల ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని, ధైర్యాన్ని నింపాల్సిన అవసరం ఉందని హితవు పలికారు.





## మనాలిలో ఆయిల్ గోడౌన్‌లో భారీ అగ్నిప్రమాదం

గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి చమురు బ్యారెళ్లు ఒకదాని తర్వాత ఒకటి పేలిపోయాయి. ఫైర్, రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే మంటలను ఆర్పడానికి నీటి ట్యాంకులతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల్ని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పోక్సో కేసులో దోషికి రెండు మరణశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు

విలాతికుళం సమీపంలోని వేదనాథం గ్రామానికి చెందిన పన్నెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మార్చి 10వ తేదీ సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు వేదనాథం అటవీ ప్రాంతంలో తీవ్ర గాయాలతో విగతజీవిగా కనిపించింది. తాము ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి ఉన్నతాధికారులు స్థానిక ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మార్చి 19న నిందితుడిని అరెస్టు చేశారు. అతడు గతంలోనూ ఓ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినిపై హత్యాచారం జరిగిన సమయంలో అతడు బెయిల్‌పై బయట ఉన్నాడు

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పవన్ కల్యాణ్ అసంతృప్తి

"పాడైపోయిన సిమెంట్‌తో పనులు చేసి ప్రమాదాలు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది, స్పష్టమైన డేటా లేకుండా అడిగితే కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వదు" అని స్పష్టం చేశారు. గత పుష్కరాల తొక్కిసలాట ఘటనలు పునరావృతం కాకుండా, ఆరు జిల్లాల్లోని 274 పంచాయతీల వరకు ఏర్పాట్లు విస్తరించాలని, గోదావరి కాలుష్య నివారణకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ అంశాన్ని త్వరలోనే కేబినెట్‌లో చర్చిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, పుష్కరాల నిధుల సమీకరణలో పవన్ కల్యాణ్ ఆశాకిరణంలా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ మచిలీపట్నం సాకారం

**కోనేరు సెంటర్లో చీపురు పట్టిన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజి**

**నగరంలోని 50 డివిజన్లలో ఘనంగా ప్రారంభమైన ఆపరేషన్ క్లీన్ స్వీప్**

**రాజస్థాన్ జైపూర్ మోడల్ తో బందరు రూపురేఖలు మారుస్తాం మంత్రి రవీంద్ర**





మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ప్రజల చురుకైన భాగస్వామ్యంతోనే మచిలీపట్నం నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దగలమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నగరంలోని చారిత్రాత్మక కోనేరు సెంటర్‌లో ప్రతిష్ఠాత్మక 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ఆయన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో ఈ పారిశుధ్య యజ్ఞం ఒకేసారి మొదలైంది.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మరియు కలెక్టర్ డీకే బాలాజి స్వయంగా చీపుర్లు పట్టి, కోనేరు సెంటర్ నుండి బస్టాండ్ వైపు వెళ్లే ప్రధాన రహదారులను శుభ్రం చేశారు. రోడ్లపై, డివైడర్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పారిశుధ్య సిబ్బందికి అండగా నిలిచారు.

**జైపూర్ మోడల్‌తో శాశ్వత పరిష్కారం:** మంత్రి కొల్లు రవీంద్ర సమావేశంలో మంత్రి రవీంద్ర మాట్లా డుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఈ డ్రైవ్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని చెప్పారు."ఇది కేవలం ఒక రోజు రోడ్లు ఊడ్చే కార్యక్రమం కాదు. చెత్త పేరుకుపోయే ప్రాంతాలు (బ్లాక్ స్పాట్స్), మురుగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే దీని లక్ష్యం. రాజస్థాన్‌లోని 'జైపూర్ మోడల్' ఆధారంగా ఈ ప్రణాళికను అమలు చేస్తు న్నాం. అని ఆయన వివరించారు. పారిశు ధ్య పర్యవేక్షణ కోసం వార్డు సచివాలయాల వారీగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశాం.దత్తత తీసుకుంటే మీ పేరే: స్థానిక పార్కుల అభివృద్ధి, చెట్ల పెంపకానికి ముందుకు వచ్చే దాతలు లేదా స్వచ్ఛంద సంస్థలకు, ఆ పార్కులకు వారి పేర్లు పెట్టుకునే అవకాశం కల్పిస్తాం.

**రూ.1 కోటితో స్మశానవాటిక అభివృద్ధి:** బైపాస్ రోడ్డులోని ప్రధాన స్మశానవాటికను దాదాపు కోటి రూపాయల వ్యయంతో ఆధునీకరించేందుకు 'ఫినెక్స్' సంస్థ ముందుకు వచ్చింది.

**నా వంతుగా గంట సమయం:** నేను పట్టణంలో ఉన్న ప్రతిరోజూ కనీసం ఒక గంట సమయాన్ని ఈ క్లీన్ స్వీప్ కార్యక్రమానికి కేటాయించి, స్వయంగా పాల్గొంటాను.నెల రోజుల్లో బందరులో సమూల మార్పు: కలెక్టర్ డీకే బాలాజి 2047 నాటికి 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నెల రోజుల ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. సుప్రీంకోర్టు సూచించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఘన వ్యర్థాల నిర్వహణ) నిబంధనలను కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

కలెక్టర్ కఠిన మార్గదర్శకాలు:

**డస్ట్‌బిన్లు తప్పనిసరి:** ప్రతి దుకాణదారుడు సొంతంగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలి. చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలి. ఇకపై ఉదయాన్నే రోడ్లపై చెత్త వేస్తే ఊరుకునేది లేదు.లిట్టర్ పికింగ్: మొదటి దశలో రోడ్లపై పడే ప్లాస్టిక్, పేపర్ వ్యర్థాలను ఏరి మున్సిపాలిటీకి అప్పగించేలా ప్రజలను చైతన్యపరుస్తున్నాం.స్థలాల కేటాయింపు: ప్రజలు తమ ప్రాంతాలను బాధ్యతగా చూసుకునేందుకు ముందుకు వస్తే, ఆయా వార్డుల్లోని ఖాళీ స్థలాల నిర్వహ ణను వారికే అప్పగిస్తాం.తరలివచ్చిన ప్రముఖులుఈ పారిశుద్ధ్య మహోత్సవంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణి కుమార్, ప్రత్యేక అధికారులు ఫణి ధూర్జటి, సాయిబాబు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, కే సుశీల, సుధాకర్ మరియు పెద్ద సంఖ్యలో మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

**బక్రీద్ పండుగ వేళ నిబంధనలు కట్టుదిట్టం చేయాలి**

**గోవధ నిషేధ గోడ పత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని గోవధ నిషేధాన్ని అత్యంత కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని 'మీకోసం' సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోవధ నిషేధ అవగాహన గోడ పత్రాలను (పోస్టర్లను) కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. ఆయన పేర్కొన్న ముఖ్య విషయాలు:చట్టరీత్యా నేరం: జంతు సంరక్షణ చట్టం 1977 ప్రకారం గోవులను వధించడం చట్టరీత్యా నేరం.సహాయపడినా శిక్షార్హులే: గోవధకు నేరుగా పాల్పడిన వారే కాకుండా, అందుకు ఏ రకంగానైనా సహకరించిన వారు కూడా చట్టప్రకారం కఠిన శిక్షకు అర్హులవుతారు.ప్రజలకు విజ్ఞప్తి: జిల్లాలోని ప్రజలందరూ చట్టాన్ని గౌరవించి, నిబంధనలను అనుసరించాలని.. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డీఆర్ఓ చంద్రశేఖర రావు, మీకోసం నోడల్ అధికారి పోతురాజు, డీఎస్పీ శ్రీనివాసరావు మరియు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు

**పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి యు.వి. సుబ్బారావు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా**



**సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశం**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుండి ప్రారంభమైన ఎస్.ఎస్.సి (SSC) అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు మే-2026లో భాగంగా మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, కంపోజిట్ తెలుగు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) యు.వి. సుబ్బారావు మచిలీపట్నం మండల పరిధిలోని పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ముందుగా మచిలీపట్నంలోని కే.కే.ఆర్ గౌతమ్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన ఎస్.ఎస్.సి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షా కేంద్రాన్ని, అలాగే అక్కడ జరుగుతున్న ఏపీఓఎస్ఎస్ (APOSS) ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆయన నిశితంగా తనిఖీ చేశారు.అనంతరం సి.పి.ఎమ్ హైస్కూల్ లో నిర్వహించబడుతున్న ఎస్.ఎస్.సి సప్లమెంటరీ పరీక్షా కేంద్రాన్ని, మరియు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ లో జరుగుతున్న ఓపెన్ స్కూల్ ఏపీఓఎస్ఎస్ ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కూడా జిల్లా విద్యాశాఖ అధికారి సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరుపై అక్కడి అధికారులతో సమీక్షించారు.జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు:పరీక్షలను అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి. పరీక్ష రాసే విద్యార్థులకు తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు వంటి అన్ని రకాల కనీస సౌకర్యాలు కల్పించాలి. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.అని సంబంధిత కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు, అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

## కృష్ణాజిల్లా జనతా వారధి ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం

ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ డిమాండ్

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లాలో నెలకొన్న పలు అపరిష్కృత ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి స్థానిక, సాగునీటి, మరియు రైతు సమస్యలపై సమగ్రమైన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులను, ముఖ్యంగా కౌలు రైతుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారంలో యంత్రాంగం వేగంగా స్పందించాలని ఈ సందర్భంగా బీజేపీ నాయకులు కోరారు.కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:ఈ 'జనతా వారధి' వినతిపత్రం సమర్పణ కార్యక్రమంలో బీజేపీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, పదాధికారులు పాల్గొన్నారు. పాల్గొన్న వారి వివరాలు:గాజువాక సిద్ధార్థ కుమార్ – కృష్ణాజిల్లా జనతా వారధి కన్వీనర్‌ఘంటా సతీష్ కుమార్ – కృష్ణాజిల్లా జనతా వారధి కో-కన్వీనర్‌పంతం గజేంద్ర – రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులునగరాయలు – కౌలు రైతుల విభాగం రాష్ట్ర కన్వీనర్‌కోగంటి వెంకటేశ్వరావు – కౌలు రైతుల విభాగం కో-కన్వీనర్‌బండారు సోమేశ్వరరావు – కృష్ణాజిల్లా ఎస్సీ మోర్చా సెక్రటరీజిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని, బాధితులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా ప్రతినిధి బృందం పేర్కొంది.






## నిబంధనలు ఉల్లంఘిస్తే స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రులపై కఠిన చర్యలు

**ఆర్డీవో కె. సాంబశివరావు**

**మచిలీపట్నం డివిజన్ పరిధిలో త్వరలో ఆకస్మిక తనిఖీలు**

**పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కచ్చితంగా అమలు కావాలి**

**సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ సమావేశం**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) కె. సాంబశివరావు హెచ్చరిం చారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన 'సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ' సమావేశం నిర్వహించారు.దరఖాస్తుల పరిశీలనఈ సమావేశంలో పలు ఆస్పత్రులు, ల్యాబ్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్, పునరుద్ధరణ దరఖాస్తులను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి చర్చించింది.

కొత్త రిజిస్ట్రేషన్ దరఖాస్తు ఆధ్యా ఫీటల్ కేర్ హాస్పిటల్ (మచిలీపట్నం).పునరుద్ధరణ (రెన్యూవల్) దరఖాస్తులు: కీర్తి హాస్పిటల్స్ (చల్లపల్లి), ఉత్తమ్ స్కాన్ సెంటర్ (మచిలీపట్నం), సుధాకర్ ఇమేజింగ్ అండ్ డయాగ్నస్టిక్ సెంటర్ (చల్లపల్లి).ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాంఈ సందర్భంగా ఆర్డీవో సాంబశివరావు మాట్లాడుతూ.. ఇకపై డివిజన్ పరిధిలోని అన్ని ప్రైవేట్ వైద్య సంస్థలు, డయాగ్నస్టిక్ సెంటర్లలో తరచుగా ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ముఖ్యంగా పిసిపిఎన్డిటి (PCPNDT) యాక్ట్ నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిని గుర్తించి, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవో కె. సాంబశివరావుతో పాటు డివిజన్ స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పాల్గొన్న వారి వివరాలుడాక్టర్ ప్రేమ్చంద్ (డీఐవో) డాక్టర్ సిహెచ్. రోజా (గైనకాలజిస్ట్)డాక్టర్ ఎం. హారిక (పీడియాట్రీషియన్)టి. సత్యనారాయణ (ఏపీపీ మెంబర్)షేక్ అబ్దుల్ నబీ (డీఎస్పీ)ఎం. ధర్మ తేజ, పి. వెంకటేశ్వరరావు (ఎన్జీవో సభ్యులు).

## విద్యను అందించడంలోనే కాదు ప్రజాసేవలోనూ ముందుంటాం

ప్రజల దాహార్తి తీర్చిన ప్రతిభ హై స్కూల్ యాజమాన్యం

ప్రజాభూమి నందిగామ :




నందిగామ పట్టణ పరిధి లో డి ఏస్ పి ఆఫీస్ ఎదురుగ వున్నా ప్రతిభ హై స్కూల్ వద్ద పాఠశాల వారు వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని చలివేంద్రం, మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేశారు. వీరు విద్యార్థులకు విద్యను అందించడంలోనే కాదు ప్రజాసేవలోనూ మేము ముందు ఉంటాం అంటున్న ప్రతిభా హై స్కూల్ యాజమాన్యం. వాహ నదారులు, ప్రయాణికులు,స్థానిక ప్రజలు, ఈ చలివేంద్రాన్ని, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వినియోగించుకొని కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ హైవే పై వెళుతున్న వాహనాలను ఆపిమరి మజ్జిగ పంపిణీ చేశారు.బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులకు గత కొన్ని సంవత్సరాలుగా తక్కువ ఫీజులతో,ఫీజు విషయం లో ఒత్తిడి పెట్టకుండా విద్యను అందిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ పేద విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసించవచ్చు అని చాటి చెప్పారు. ఈ పాఠశాలలో ఎందరో పేద విద్యార్థులు చదువుకొని ఉన్నత శిఖరాలను అందుకున్నారు. ప్రతిభ స్కూల్ సోదరులు ఐకమత్యంగా ఉండి పట్టుదలతో,స్వయంకృషితో ఒకే బాటలో నడుస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య శిక్షణ భద్రత అందిస్తూ విద్యార్థులకు తల్లిదండ్రులకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్నారు.ఎన్నో సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆదరణలు అభిమా నాలు పొందుతున్న సంస్థ ప్రతిభ సంస్థ.ప్రతిభ సోదరులు మునుముందు మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది ముందుకు సాగాలని స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేశారు. ప్రతిభ సంస్థ సేవలు ఎనలేనివి ప్రతిభ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి "ప్రతిభ ఆణిముత్యం" లాగా సమాజంలో గౌరవ మర్యాదలతో పలుచోట్ల స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నారు.ఈ సందర్భంగా ప్రతిభ సోదరులు మాట్లాడుతూ..సమాజంలో ఇటువంటి సేవ కార్యక్రమాలు చేయడానికి అందరూ ముందుండాలి అని తెలియజేశారు.



## మచిలీపట్నంలో ఆధార్ కష్టాలకు చెక్

**నూతన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర**

**డిసిఎమ్ఎస్ చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవం**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో ప్రజల ఆధార్ కష్టాలకు తెరపడింది. స్థానిక ప్రజలకు ఆధార్ సేవలను మరింత చెంతకు చేరుస్తూ సరికొత్త ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. సోమవారం ఉదయం కొజ్జిలిపేట కెనెడీ రోడ్డులో, చలపల్లి రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయం పక్కన యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (UIDAI) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (DCMS) చైర్మన్ బండి రామకృష్ణతో కలిసి ఘనంగా ప్రారంభించారు.ఆధార్ లేనిదే అడుగడుగునా కష్టమే మంత్రి కొల్లు రవీంద్రఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న సమాజంలో పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ఆధార్ అనేది అత్యంత కీలకమైన గుర్తింపు కార్డు గా మారిందని పేర్కొన్నారు.బ్యాంక్ ఖాతాలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు.. ఇలా ప్రతి చిన్న మరియు పెద్ద సేవకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అయింది. అయితే, ఆధార్‌లో మార్పులు చేసుకోవాలన్నా, కొత్త కార్డులు పొందాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించింది. ఆ కష్టాలను తీర్చడానికే ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశాం.- కొల్లు రవీంద్ర, రాష్ట్ర మంత్రివిజయవాడ, వైజాగ్, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదుగతంలో ఇటువంటి కార్పొరేట్ స్థాయి ఆధార్ సేవలు కేవలం విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు ఆ స్థాయి సేవలను నేరుగా బందరు నడిబొడ్డున అందుబాటులోకి తీసుకురావడం కృష్ణా జిల్లా ప్రజలకు దక్కిన గొప్ప సువర్ణావకాశమని, జిల్లా ప్రజలంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ నూతన కేంద్రంలో లభించే సేవలు ఇవేకొత్తగా ప్రారంభమైన ఈ ఆధార్ సేవా కేంద్రంలో ప్రజలకు ఒకే చోట అన్ని రకాల ఆధార్ సేవలు లభిస్తాయని అధికారులు తెలిపారు.నూతన ఆధార్ నమోదు కొత్తగా ఆధార్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడం.బయోమెట్రిక్ అప్‌డేట్: ఫోటో మార్పులు, వేలిముద్రలు ఐరిస్ (కంటి గుర్తులు) నవీకరణ.డెమోగ్రాఫిక్ సవరణలు: పేరు, పుట్టిన తేదీ, చిరునామా (అడ్రస్), మొబైల్ నంబర్ మరియు ఈ-మెయిల్ ఐడీలలో తప్పుల సవరణ.ముఖ్య అతిథుల సమక్షంలో...ఈ ప్రతిష్టాత్మక ప్రారంభోత్సవ కార్యక్రమంలో యూఐడీఏఐ డైరెక్టర్ కె.ఎం. భారతి, అసిస్టెంట్ మేనేజర్ వరప్రసాద్, బి.ఎల్.ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ మనీష్ జవాల్కర్, రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ హరినాథ్ కృష్ణాజిల్లా ఆధార్ కేంద్రం ఆపరేటింగ్ మేనేజర్ ఎస్ లలిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గోమాత ను గౌరవిద్దాం సామరస్యాన్ని కాపాడదాం

**సీనియర్ జర్నలిస్ట్ ఖుద్ధుస్ ఖాన్**

**బక్రీద్ రోజు ఆవుల కుర్బానీ వద్దు, మేకలు-గొర్రెలతోనే త్యాగం చేద్దాం. ముస్లిం సోదరులకు విజ్ఞప్తి**



ప్రజా భూమి నందిగామ:

ఈ నెల 28న జరుపుకోనున్న పవిత్ర బక్రీద్ పండుగ సందర్భంగా నందిగామ డివిజన్ సీనియర్ జర్నలిస్టు ఖుద్ధుస్ ఖాన్ ముస్లిం సోదరులకు సోషల్ మీడియా ద్వారా బహిరంగ విజ్ఞప్తి చేశారు. ఖుర్బానీ కోసం దయచేసి ఆవులను కొనవద్దు. మేకలు, గొర్రెలు, పొట్టేళ్లను కొని ఖుర్బానీ ఇవ్వండి. మన హిందూ సోదరులు ఆవులను తల్లిగా, గోమాతగా పూజిస్తారు. వారి మనోభావాలను మనం గౌరవించి మత సామరస్యానికి పాటుపడదాం అని ఆయన కోరారు.త్యాగానికి అసలైన అర్థం:బక్రీద్ అంటేనే త్యాగానికి ప్రతీక.

ఆ త్యాగం జంతువును వధించడంలోనే కాదు, మన సాటి సోదరుల మనోభావాలను గౌరవించడంలోనూ ఉంది. మనం హిందూ సోదరులను గౌరవించడమే అసలైన త్యాగం అని అన్నారు_ ఒక మతం వారు పవిత్రంగా భావించే దాన్ని మరో మతం వారు గౌరవిస్తేనే దేశంలో ఐకమత్యం ఉంటుంది. ఇస్లాం కూడా ఇతర మతాలను, వారి ఆచారాలను గౌరవించమనే బోధిస్తుంది. దేశంలో శాంతి, సామరస్యం నెలకొనేందుకు అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం అని ఆయన పిలుపునిచ్చారు.

## టిడ్కో ఇళ్ల పనులు తుదిదశలో: ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఏలూరులోని కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న టిడ్కో ఇళ్ల పనులు తుదిదశకు చేరుకున్నాయని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. సోమవారం ఆయన అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, 50 వేల లీటర్ల సామర్థ్యం గల మంచినీటి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదలకు ఇళ్లు అందించాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యానికి టిడ్కో ఇళ్లు నిదర్శనమన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించి, రూ.13.75 కోట్ల నిధులతో 288 ప్లాట్లు, 6 టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. త్వరలోనే ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కర్రి శ్రీనివాస్, కార్పొరేటర్ యర్రంశెట్టి నాగబాబు నాయకులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ కనీస పెన్షన్ రూ.7,500కు పెంచాలి: ఇఫ్టూ ధర్నా




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచాలని డిమాండ్ చేస్తూ ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో సోమవారం ఏలూరులోని బీఎస్ఎన్ఎల్ భవనంలోని ఈపీఎఫ్ఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కార్మికులు సంవత్సరాలుగా ఈపీఎఫ్ఓకు చందాలు చెల్లిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పెంపుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సూచనల మేరకు కనీస పెన్షన్‌ను రూ.7,500కు పెంచడంతో పాటు డీఏ లింక్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఈపీఎఫ్ఓ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ ఎం.ఎ.వి. ప్రసన్నకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, నగర అధ్యక్షుడు బి.సోమయ్యతో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో వడదెబ్బకు కౌలు రైతు మృతి.


ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ఏలూరు జిల్లా నూజివీడు మండలం సీతారామ పురంలో విషాద ఘటన చోటుచేసు కుంది. సీతా రామపురం గ్రామానికి చెందిన బొద్దు కళ్ల జయరాజ్ (57) అనే కౌలు రైతు వడదెబ్బకు గురై మృతి చెందారు. పొలం పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లిన జయరాజ్ తీవ్ర ఎండల కార ణంగా అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## వేసవి విద్యుత్ డిమాండ్‌కు ప్రత్యేక కార్యాచరణ: ఏపీఈపీడీసీఎల్

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



పెరుగుతున్న వేసవి విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమ లు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ ఏలూరు పర్యవేక్షక ఇంజనీర్ పి. సాల్మన్ రాజు తెలిపారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు 41 నుంచి 50 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేస్తున్నారని చెప్పారు. అధిక లోడ్ ఉన్న ప్రాం తాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు పాత ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచినట్లు వెల్లడించారు. 19 మండలాల్లో ప్రత్యేక అత్యవసర బృందాలు ఏర్పాటు చేసి విద్యుత్ అంతరాయాలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచామని, ఏలూరు మరియు జంగారెడ్డిగూడెంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే వినియోగ దారులు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల సందడి




ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

కృష్ణా జిల్లా అగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పఠనం, చిత్రలేఖనం కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు వార్తాపత్రికలు, పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు చిత్రలేఖనంలో తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు కొనసాగుతున్న ఈ శిబిరంలో ప్రతిరోజూ కథలు, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి కుమార్ తెలిపారు

# రొయ్యల ధరలు తగ్గించికొంటే వివరాలు తెలియజేయాలి

### జై భారత్ క్షీరరామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గాంధీ భగవాన్ రాజు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రాసెసింగ్ ప్లాంట్ యాజమాన్యం ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండకుండా రొయ్యల ధరలు తగ్గించి కొనుగోలు చేస్తే ఆ వివరాలు తమ దృష్టికి తీసుకురావాలని జై భారత్ క్షీరా రామ అక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఆక్వా రైతులను కోరారు. ఆక్వా రైతు సంఘ ప్రతి నిధులు తో కలిసి సోమవారం స్థానిక విలేకరులతో గాంధీ భగవాన్ రాజు మాట్లాడారు. రొయ్యల 100 కౌంట్ ధర కిలో రూ. 230కి కొనుగోలు చేస్తామని ప్రాసెసింగ్ ప్లాంట్ యజమానులు హామీ ఇచ్చి కూడా రూ. 10 తగ్గించి కొనుగోలు చేయడం ఆక్వా రైతులను మోసగించడమేనని విమర్శించారు. అలా తగ్గించి కొన్నవారు ఉంటే వారి వివరాలు వెంటనే తెలియజేయాలని, ఒకవేళ ఏజెంట్లు ఉన్న వారి వివరాలు కూడా తెలియజేస్తే ఆ బిల్లులను బట్టి ప్రభుత్వానికి తెలియజేసి తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని గాంధీ భగవాన్ రాజు తెలిపారు. కైకలూరు లో జరిగే ఆక్వా రైతు సదస్సుకు అధిక సంఖ్యలో తరలి వెళ్లాలని ఆయన కోరారు. రాష్ట్రం నలుమూలల ఆక్వా రైతు సంఘాలు ఆందోళనలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ నెల 29న అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఆక్వా రైతు సంఘ కన్వీనర్ల సమావేశానికి అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. బాగున్న చెరువుల ఎట్టి పరిస్థితుల్లోనూ తొందరపడి తక్కువ రేటుకి పట్టుబడి చేయవద్దు అని భగవాన్ రాజు రైతులకు విజ్ఞప్తి చేశారు. విలేకరులతో మాట్లాడిన వారిలో సంఘ ప్రతినిధులు మేడిది జాన్ డేవిడ్ రాజు, పెన్ మెచ్చ సత్య నారాయణ రాజు, మేక ఫణీంద్ర ప్రసాద్, ఎన్ సోమేస్వరరాజు, బాపిరాజు, చిన్న, ఈశ్వర్ రాజు తదితరులు వున్నారు.



## ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం, గుర్తింపు పెంచడం అభినందనీయం

### ఎంపీపీ వీరా మల్లిబాబు

ప్రజాభూమి ప్రతినిధి-సఖినేటిపల్లి



ప్రభుత్వపాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం, గుర్తింపు పెంపొందించడం అభినంద నీయం అని ఎంపీపీ వీరా మల్లిబాబు అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు డి. కిషోర్ కుమార్ మరియు యం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను ఎంపీపీ వీరా మల్లిబాబు చేతుల మీదుగా ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వీరా మల్లిబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల ల ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో విశ్వాసం మరియు గుర్తింపు పెరుగుతుందని తెలిపారు. అలాగే, దీనివల్ల ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అనేక పథకాలు, సౌకర్యాలు మరియు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వడదెబ్బలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బల నుంచి జాగ్రత్తగా ఉండాలని ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్ సూచించారు. ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే బయట పనులకు వెళ్లాలని, తరచూ మంచినీరు, ద్రవాహారం తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, చెప్పులు ఉపయోగించాలని సూచించారు. మైకం, వాంతులు, తల నొప్పి, అధిక దాహం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని పేర్కొన్నారు. వడగాల్పుల ప్రభావం దృష్ట్యా ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు వచ్చే రోగులు, సిబ్బందికి ఈ నెల 22 నుంచి 30 వరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## బయోగ్యాస్ పరిశ్రమతో వెయ్యి మందికి ఉపాధి

### మండల అభివృద్ధికి దోహదం చేస్తుంది: స్థానిక నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో సుమారు 45 ఎకరాల్లో నిర్మించనున్న బయోగ్యాస్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు వేణు, స్థానిక నాయకుడు ఆరేపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబానికి చెందిన నితిన్ సాయి నిర్మాణ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుందని చెప్పారు. తడి చెత్త, పశువుల పేడ, పచ్చిగడ్డి, చెట్ల ఆకులు వంటి వ్యర్థ పదార్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసి వంటగ్యాస్, విద్యుత్, వాహన ఇంధనంగా వినియోగించవచ్చన్నారు. ప్లాంట్ నుంచి వచ్చే అవశేషాలు సేంద్రియ ఎరువులుగా రైతులకు ఉపయోగపడతాయని తెలిపారు. రోజుకు సుమారు రెండు టన్నుల గ్యాస్ ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేసే ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 500 మంది, పరోక్షంగా మరో 500 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. దీంతో మండల ఆర్థికాభివృద్ధి వేగవంతమై యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. రాజమండ్రి సమీపంలోని పెద్దాపురం, పరిటాల ప్రాంతాల్లో ఉన్న బయోగ్యాస్ ప్లాంట్లను పరిశీలించి వాటి పనితీరుపై అవగాహన పొందినట్లు నాయకులు తెలిపారు. పర్యావరణానికి హాని లేకుండా మండల అభివృద్ధికి ఈ పరిశ్రమ దోహదపడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

## మహానాడు పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న క్లస్టర్ మహానాడును విజయవంతం చేయాలని పిలుపు.**




ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న తెలుగు దేశం పార్టీ క్లస్టర్ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. మహానాడుకు సంబంధించిన పోస్టర్ ను సోమవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో యువ నాయకులు బండారు సంజీవతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. క్లస్టర్ల వారీగా బలోపేతానికి ఈ మహానాడు ఉపయోగపడుతుందన్నారు.

## పాఠశాల అభివృద్ధికి వితరణ

### అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం మరువలేనిదని గ్రామస్తులు కొనియాడారు. మండలం లోని అన్నదేవరపేట అల్లూరి సూరన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించనున్న భోజనశాల (డైనింగ్ హాల్) నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం అల్లూరి విక్రమాదిత్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో ఈ భోజనశాలను నిర్మించనున్నారు. ఈ నిర్మాణానికి గ్రామస్తులు మరియు దాతలు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందించారు. పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో, ఆధునిక వసతులతో కూడిన భోజనశాలను నిర్మించాలని విక్రమాదిత్య మరియు గ్రామ ప్రముఖులు నిర్ణయించారు. ఈ సందర్భంగా విక్రమాదిత్య మాట్లాడుతూ, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారి విద్యాభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీ రామా చంద్ర మూర్తి, టి డి పి నాయకులు కోటారు వెంకట్రావు, జనసేన నాయకులు చెవ్వూరి బంగార్రాజు, బీజేపీ నాయకులు వెలుగుబంటి బాల కృష్ణ, స్కూల్ కమిటి చైర్మన్ ఉప్పె బంగారు బాబు, కవల రామాంజనేయులు, మానవత తాళ్లపూడి మండల అధ్యక్షులు వెలుగుబంటి శ్రీనివాస్, ఇంజరపు అబ్బులు, వెలుగుబంటి రఘు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు నళిని మేడం మరియు స్థానికులు పాల్గొన్నారు.

# దుర్గేష్ విజ్ఞప్తితో విజ్జేశ్వరంలో పవన్ కళ్యాణ్ క్షేత్రస్థాయి పర్యటన

- **గోదావరి బండ్ పరిశీలన**
- **2027 గోదావరి పుష్కరాల కోసం మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ప్రతిపాదన.. విజ్జేశ్వరం - సిద్ధాంతం ఏటిగట్టు అభివృద్ధికి చర్యలు తీసుకునే దిశగా కృషి చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడి!**
- **పెండ్యాల, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో ఏటిగట్టు పటిష్ట పరిచేందుకు నివేదికలు పంపించాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు..**



ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు

రాజమహేంద్రవరం పర్యటన ముగిసిన అనంతరం, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరంలో పర్యటించారు. రాబోయే ప్రతిష్టాత్మక గోదావరి పుష్కరాలు - 2027 ముందస్తు ఏర్పాట్లు మరియు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఒక కీలక ప్రతిపాదనను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జలవనరుల శాఖకు సంబంధించిన విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం మధ్య ఉన్న 'వశిష్ట రైట్ ఫ్లడ్ బ్యాంక్ కెనాల్' మీదుగా బీటీ రోడ్డు (ఏటిగట్టు) నిర్మించాలనే ప్రతిపాదనను పరిశీలించాల్సిందిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉప ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రి విజ్ఞప్తిపై తక్షణమే స్పందించిన డిప్యూటీ సీఎం, స్థానిక గోదావరి బండ్ తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. స్థానికంగా ఉన్న గోదావరి బండ్‌ను పర్యాటకంగా, రవాణా పరంగా డెవలప్ చేస్తే ఉభయ గోదావరి జిల్లాల అనుసంధానానికి సైతం ఎంతో మేలు జరుగుతుందన్న మంత్రి దుర్గేష్ వివరణపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. పుష్కరాల నాటికి ఈ రోడ్డు నిర్మాణాన్ని ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ తో పాటు స్థానిక ఇరిగేషన్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి క్షేత్రస్థాయి పరిస్థితులను, ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా పెండ్యాల, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల్లో ఏటిగట్టు పటిష్ట పరిచేందుకు నివేదికలు పంపించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**రూ. 66 కోట్లతో రవాణా ముఖచిత్రం మార్చే ప్రణాళిక**

స్థానికంగా ఉన్న గోదావరి బండ్‌ను డెవలప్ చేస్తే రోడ్డు మార్గం ఎంతగానో బాగుపడుతుందని మంత్రి దుర్గేష్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత పూర్తి స్థాయి నివేదికలు పరిశీలించిన అనంతరం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ "గోదావరి పుష్కరాల సమయంలో వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీని నియంత్రించడానికి, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడానికి ఈ ఏటిగట్టు రహదారి ఎంతో కీలకం. సుమారు రూ. 66 కోట్ల అంచనా వ్యయంతో, 33 కిలోమీటర్ల మేర ఉన్న విజ్జేశ్వరం- సిద్ధాంతం రోడ్డును అభివృద్ధి చేస్తే స్థానిక ప్రజానీకానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రత్యేకించి నిడదవోలు రూరల్, పెరవలి మండలాలు రవాణా పరంగా మరింత అభివృద్ధి చెందుతాయి" అని వివరించారు. ఈ పర్యటనలో పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
కాకినాడ, తూర్పుగోదావరి 5
మంగళవారం 26, మే 2026

దేవరపల్లిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి

# వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధికి నాంది.
- ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
- మహిళలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. సోమవారం రావులపాలెం మండలం దేవరపల్లిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు, ఆర్డీఓ జి.మమ్మి, జోనల్ మేనేజర్ రమణారెడ్డి, డి ఎల్ డి ఓ రాజేశ్వరరావు, ఇండస్ట్రియల్ జిఎమ్ అరుణ, ఏపీ ఇండస్ట్రీ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, యువ నాయకులు బండారు సంజీవ్ తో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు భూమి పూజ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో రావులపాలెం మండలం దేవరపల్లిలో 3 ఎకరాల 30 సెంట్ల స్థలంలో మంచి కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కోనసీమ లాంటి మారుమూల జిల్లాలో,





మారుమూల ప్రాంతంలో ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి, పారిశ్రామిక అభివృద్ధికి నాంది పలకడం జరుగుతుందన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఎమ్ఎస్ఎమ్ఈ పరిశ్రమల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచడం కోసం కృషి చేస్తున్నారన్నారు. త్వరితగతిన ఈ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. యువకులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత, మహిళా పారిశ్రామికవేత్తలు సొంతంగా తమ కాళ్ళ మీద తాము నిలబడేలా తయారీ పరిశ్రమలుగాని, సేవా రంగ పరిశ్రమలుగాని, స్టోరేజెస్ గాని, అసెంబ్లింగ్ యూనిట్లు, కొబ్బరి, అరటి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతీ సమస్యకు నాణ్యమయిన పరిష్కారం చూపాలి

కలెక్టర్ : ఆర్.మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం

ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టిపెట్టి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి సుమారుగా 250 అర్జీలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ప్రజల నుండి వచ్చే అర్జీలు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, వారికి న్యాయం చేయడమే జిల్లా యంత్రాంగం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సమయపాలనతో నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి. నాన్చుడు ధోరణి లేకుండా, నిర్దేశిత కాలపరిమితిలోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు .కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, అవసరమైన చోట అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య తీవ్రతను బట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటంలో అధికా రులు పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దూరప్రాంతాలనుండి ఎన్నో ఆశలతో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వస్తారని వారి నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగాని ర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని, ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాస్థాయి అధికారులు నిర్దేశ గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా



చూడాలని, అర్జీదారులకు సకాలంలో సమాచారం అందిస్తూ పారదర్శకత పాటించాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు ప్రజల ఫిర్యా దులను స్వయంగా పరిశీలించి సకాలంలో తగు పరిష్కార మార్గాలు నూటికి నూరు శాతం సంతృప్తికరంగా అందిం చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నైదియాదేవి అన్నారు.ప్రజా ఫిర్యాదు లను స్వయంగా శాఖాధిపతులు పరిశీ లించి, ప్రజలకు శాశ్వతమైన పరిష్కారాలు అందిం చాలన్నారు. ప్రజా ఫిర్యాదులు పౌర సేవల కోసం ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిం చాలని ఆదేశించారు. పరిష్కరిం చిన ప్రతి ఫిర్యాదులో నాణ్యమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని అన్నారు. శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి వచ్చిన ప్రతి ఫి ర్యాదును సమన్వయంతో పరిష్కరిం చాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందుతు న్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత కలిగి ఉండాలని తెలిపారు. అర్జీలను సమగ్రంగా పరిశీ లించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను త్వరిత గతిన అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల సమ స్యల పరిష్కారంలో పారదర్శకత, సమర్థత పాటించడం అత్యంత ముఖ్య మని పేర్కొన్నారు. ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్క రించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో డిఆర్వో వి సుబ్బారావు, డ్వామా పిడి రాంబాబు, స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామం నోడల్ అధికారి విజయలక్ష్మి డి ఎల్ డి వో వేణుగోపాల్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

# మహానాడును విజయవంతం చేయాలి

- కొత్తపేటలో క్లస్టర్–6 సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపు.
- ప్రజాభూమి ప్రతినిధిలిమహానాడును విజయవంతం చేయాలిలి
- కొత్తపేటలో క్లస్టర్–6 సమావేశంలో పార్టీ శ్రేణులకు పిలుపు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో పర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహానాడు–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన క్లస్టర్–6 సమావేశం క్లస్టర్ ఇంచార్జ్ కంఠంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే మహానాడు సమావేశాలకు పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారని తెలిపారు. బూత్ కన్వీనర్ల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరూ సమన్వయంతో పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని సూచించారు.



మహానాడులో చర్చించాల్సిన రాజకీయ, పార్టీ బలోపేతం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై నాయకులు వివరించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పని తీరు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బండారు సందీప్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాలు బాబ్జి, క్లస్టర్ కో–కన్వీనర్ బూసి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, సీనియర్ నాయకులు ధర్నాల రామకృష్ణ, చింతం విజయ్ కృష్ణమోహన్, ఎల్లమెల్లి జగన్మోహన్, మిద్దె ఆదినారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరావు, సిద్ధంశెట్టి సత్యనారాయణ, విల్ల మారుతి, చోడపనీడి భాస్కరరావు, కదలి భీమేశ్వరరావు, ఎలిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో పర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహానాడు–2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొత్తపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులకు నాయకులు పిలుపునిచ్చారు. కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన క్లస్టర్–6 సమావేశం క్లస్టర్ ఇంచార్జ్ కంఠంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజులపాటు జరిగే మహానాడు సమావేశాలకు పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొంటారని తెలిపారు. బూత్ కన్వీనర్ల నుంచి గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరూ సమన్వయంతో పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని సూచించారు. మహానాడులో చర్చించాల్సిన రాజకీయ, పార్టీ బలోపేతం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై నాయకులు వివరించారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పని తీరు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బండారు సందీప్, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాలు బాబ్జి, క్లస్టర్ కో–కన్వీనర్ బూసి భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, సీనియర్ నాయకులు ధర్నాల రామకృష్ణ, చింతం విజయ్ కృష్ణమోహన్, ఎల్లమెల్లి జగన్మోహన్, మిద్దె ఆదినారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, దేవపాటి వెంకటేశ్వరావు, సిద్ధంశెట్టి సత్యనారాయణ, విల్ల మారుతి, చోడపనీడి భాస్కరరావు, కదలి భీమేశ్వరరావు, ఎలిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కల నెరవేరింది పార్టీకి అంకితం అవుతా : జనసేన యువనేత నాగేంద్ర

- జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని కలిసిన డివిఎఫ్ అధినేత నాగేంద్ర.
- జనసేన ప్రముఖుల సమీక్షంలో పవన్ కళ్యాణ్ నాగేంద్రకు అభినందనలు.
- సభ్యత్వ నమోదులో అమలాపురం పార్లమెంట్లో ప్రథమ స్థానం సొంతం చేసుకున్న నాగేంద్ర.
- జీవితంలో మరుపురాని దృశ్యం: నాగేంద్ర.

ప్రజాభూమి ప్రతినిధి–కాజులూరు

తన ఊహ తెలిసిన నాటి నుండి పవన్ కళ్యాణ్ అభిమానిగా కొనసాగుతూ పవన్ కళ్యాణ్ ని నేరుగా కలిసే అవకాశం దక్కుతోందా అనేటు వంటి మీమాంసంలో ఉన్నటువంటి డివిఎఫ్ ఫౌండేషన్ అధినేత, జనసేన యువనేత, డివిఎఫ్ దేగల నాగేంద్ర అనూహ్యంగా పవన్ కళ్యాణ్ కు అత్యంత ఆప్తులుగా కొనసాగుతున్న పార్టీ నేతలు సమక్షంలో ఆయనను నేరుగా కలిసి షేక్ హ్యాండ్ తీసుకునే అవకాశం దక్కింది.దీంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పవన్ కళ్యాణ్ ని కలిసిన రోజు





మరుపురాని ఘట్టంగా మిగిలిపోతుందని నాగేంద్ర పేర్కొన్నారు. నాగేంద్ర చిన్నతనం నుండి పవన్ కళ్యాణ్ అబిమానిగా ఆయన వేసుకునే దుస్తులు నుంచి హెయిర్ స్టైల్ ను సైతం పాలో అవుతూ ఆయన పార్టీ పెట్టినప్పటి నుంచి మరింత అభిమానిగా కొనసాగుతూ పార్టీ విధివిధానాలు పాటిస్తూ రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీ ు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తూ ఉంటున్నారు గత సంవత్సరం నాగేంద్ర పార్టీ సభ్యత్వాలు నమోదులో నేనంటూ ఉన్నానంటూ సుమారు 500 పైబడి సభ్యత్వలను చేయించి ప్రస్తుతం 2026 సంవత్సరానికి 5,వేలం పైబడి ఉచితంగా సభ్యత్వలను చేయించి పార్టీ ప్రముఖుల దృష్టిని నాగేంద్ర ఆకర్షించారు. ఈ తరుణంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజమండ్రి పర్యటన సందర్భంగా ఆదివారం నాగేంద్ర కాకినాడ జనసేన పార్టీ ఎంపీ ఉదయ్ , రాష్ట్ర మంత్రి మనోహర్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన వీర మహిళా గంటా స్వరూప, వంటి ప్రముఖ నేతలు సమక్షంలో నాగేంద్ర పవన్ కళ్యాణ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.దీంతో స్థానిక ప్రముఖుల ద్వారా నాగేంద్ర పార్టీకి చేస్తున్న సేవలను తెలుసుకొని పవన్ కళ్యాణ్ నాగేంద్రను ప్రత్యేకంగా అభినందించారు.దీంతో నాగేంద్ర పవన్ కళ్యాణ్ చూపించిన అభిమానానికి ఫిదా అయిపోయి జీవితంలో తనకు ఈరోజు మరుపురాని దృశ్యంగా ఉందని కష్టమైనా నష్టమైనా లాభమైనా,తల్లి, తండ్రి , తరువాత పవన్ కళ్యాణ్ అని భాగోద్వేగంగా నాగేంద్ర తన మనసులో మాటను బయటపెట్టారు. అయితే పార్టీ ప్రముఖుల మధ్య నాగేంద్ర పవన్ కళ్యాణ్ను కలవడం తన గురించి అక్కడ ఉన్న పార్టీ ప్రముఖులే తాను పార్టీకి చేస్తున్న సేవలను ప్రత్యేకించి చెప్పడం తనకు గర్వంగా అనిపించిందని నాగేంద్ర పేర్కొన్నారు. దీంతో తమ అధినేత పవన్ కళ్యాణ్ సైతం సానుకూలంగా స్పందించి తనను మర్యాదపూర్వకంగా అభినందించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ తన కల నెరవేరిందని పార్టీ అభివృద్ధికి తన వంతు ప్రయత్నంగా అహర్నిశలు పాటుపడుతూ పార్టీకి అంకితమై పనిచేస్తానని సందర్భంగా నాగేంద్ర పేర్కొన్నారు. ఈమేరకు బందనపూడి గ్రామ మాజీ సర్పంచ్ దేగల తిరుమలవేణి సత్యనారాయణ తనయుడు, జనసేన యువనేత నాగేంద్ర కోనసీమ జిల్లా పార్లమెంటు స్థానంలోనే సుమారు 5000,జనసేన సభ్యత్వాలు ఉచితంగా అత్యధికంగా చేయించి పార్లమెంట్ స్థానంలో ఎకైక జనసేన పార్టీ అభిమానిగా తన సత్తా చాటుకున్నారు . అయితే జనసేన యువనేతగా ఆపద వస్తే నేనున్నానంటూ ఉదార స్వభావంతో రామచంద్రపురం నియోజకవర్గ ప్రజల్లో తనకంటూ ఒక ముద్ర వేసు కున్న నాగేంద్ర ,ఇటీవల మరింతగా ఒక అడు గు ముందుకు వేసి నాగేంద్ర స్వయంగా డివిఎస్ సంస్థను స్థాపించి వ్యవస్థాపకులుగా కొనసాగుతూ ప్రజలకు మరింతగా సేవలు చేయడం ప్రారంభించిన విషయం పాఠకులకు విదితమే.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇంటింటా ప్రచారం

–మెర్లపాలెం జిల్లా ఉన్నత పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన క్యాంపెయిన్.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట




విద్యార్థుల చేరికలను పెంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే లక్ష్యంతో మెర్లపాలెం జిల్లా ఉన్నత పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవగాహన క్యాంపెయిన్ నిర్వహిం చారు. ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి. సత్యనారాయణ నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్ద కొమ్మర రాఘవతో పాటు ఇతర గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అంది స్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ బోధన వంటి సౌకర్యాలను వారు వివరించారు. “ప్రతి చిన్నారికి విద్య హక్కు. సమీప ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ విద్య లభిస్తుంది” అని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఆర్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ, “విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించాలని, పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నాం” అని కోరారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పాఠశాల అభివృద్ధికి తమ తోడ్పాటు అందిస్తామన్నారు. క్యాంపెయిన్‌లో భాగంగా విద్యార్థులను వెంటనే పాఠశాలలో చేర్చుకునేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉపాధ్యాయుల చొరవను గ్రామ ప్రజలు అభినందించారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

## పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఎపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలి.

–జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి.



ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

కైకలూరు మండలం తామరకొల్లు గ్రామంలో సోమవారం శ్రీనివాస ఫెర్టిలైజర్స్ షాపును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. షాపులో ఉన్న యూరియా డిఏపి, పొటాషియం, కాంప్లెక్స్ ఎరువులు భౌతిక నిల్వలు, ఈపాసు నిల్వలు, అమ్మకాలు వివరాలు, స్టాకు రిజిస్టర్లు, రైతులకు ఇస్తున్న బిల్లులను పరిశీలించి, కొన్ని వివరాలను జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అన్ సీజన్లో పంటలు లేని సమయంలో ఎరువులు ముఖ్యంగా యూరియా, డిఎపి అమ్మకాలు నిలుపుదల చెయ్యాలని ఆదేశించారు. సదరు షాపులో నిలుపుదల చేసిన వివరాలు కూడా పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల మేరకు పంటకు అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరైన సమయంలో అనుగుణంగా అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉంచాలని రిటైల్ డీలర్లు మరియు సహకార సంఘాలు ద్వారా యూరియా, డిఎపి మరియు ఇతర ఎరువులు నిల్వలు ఉంచాలని తెలిపారు. రైతులకు అందాల్సిన ఎరువులు అక్రమంగా వ్యవసాయ యేతర అవసరాలకు వినియోగించడం బ్లాక్ మార్కెటు, అక్రమ నిల్వలు పారిశ్రామిక అవసరాలకు వినియోగించిన అటువంటి డీలర్లపై ఎరువులు చట్టం ప్రకారం కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ఎరువులు అందుబాటులో ఉంచుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, ఇంచార్జి ఏడిఏ కె.శ్రీనివాస కుమార్, మండల వ్యవసాయ అధికారి ఆర్.దివ్య, గ్రామ విఏఏలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న

## ఏపీ టీడీపీ అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు



ప్రజా భూమి ప్రతినిధి–పెదపాడు

ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పన వీడు గ్రామంలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పళ్ళ శ్రీనివాసరావు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన శ్రీనివాసరావుకి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దర్శనానంతరం అర్చకులు ఆయనకు శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏలూరు నగరంలో డివిజన్ల పునర్ వ్యవస్తీకరణ పూర్తి స్థాయిలో చేయాలి.

–సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏలూరు ఏరియా ముఖ్య నాయకుల సమావేశం ఆర్.ఆర్. పేట, స్ఫూర్తి భవన్ నందు కురెళ్ళ వరప్రసాద్ అధ్యక్షతన జరిగినది.ఈ సమావేశంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో 50 డివిజన్లు 62 డివిజన్లుగా మార్పు చేయుటకు ముసాయిదా సిద్ధం చేసిన మున్సి పల్ కార్పొరేషన్ వారు సక్రమమైన విధానంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.గతంలో డివి జన్ల పునర్ వ్యవస్తీకరణ సక్రమంగా చేయకుండా కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించడం వలన ప్రజలు,అభ్యర్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.ప్రస్తుతం అటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శులు కురెళ్ల వరప్రసాద్,అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల పునర్ వ్యవస్తీకరణ హడావిడిగా కాకుండా పూర్తి స్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏరియా సమితి కార్యవర్గ సభ్యులు కొల్లూరి సుధారాణి,మావూరి విజయ, గొర్లి స్వాతి, శాయన అభిలాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
మంగళవారం 26 మే 2026

# త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

- : స్వచ్ఛభారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వెంటనే మొదలు పెట్టాలి
- : కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లను లక్ష్యం మేరకు పూర్తి చేయాలి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం జిల్లా వాటర్, శానిటేషన్ మిషన్ (డిడబ్ల్యుఎస్ఎం) సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వేసవి అత్యవసర కార్యాచరణ ప్రణాళిక (సమ్మర్ కంటింజెన్సీ యాక్షన్ ప్లాన్) కింద రెండు మూడు రోజుల్లో ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో అత్యవసర త్రాగునీటి సరఫరాకు సంబంధించిన పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపించాలని, వాటికి మంజూరు తీసుకోవాలన్నారు. త్రాగునీటికి సంబంధించి 50 లక్షల రూపాయలు నిధులు విడుదల అయ్యాయి, వాటిని అత్యవసర పనులకు ఉపయోగించుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద 940 వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు కావడం జరగగా, అందులో 200 పూర్తి కాగా, 239 పురోగతిలో ఉన్నాయని, 501 నాట్ స్టార్టెడ్ లో ఉన్నాయని, అన్నింటిని వెంటనే మొదలు పెట్టాలన్నారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ కు సంబంధించి 2026 - 27లో 17.89 కోట్ల రూపాయలతో 649 మంజూరు కాగా, నాట్ రిక్వర్డ్ 12 ఉండగా, 637 అవసరం కాగా, అందులో 64 పూర్తి కావడం జరిగిందని, 489 పురోగతిలో ఉన్నాయని, 84 ఇంకా మొదలు కాలేదని, లక్ష్యం మేరకు డిసెంబర్ నాటికి అన్నింటిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో, హాస్టల్స్ లో, రెసిడెన్షియల్ స్కూల్స్ లలో మంజూరు చేసిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లకు సంబంధించి పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. దేవాలయాల్లో, తహసిల్దార్ కార్యాలయాల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో, బస్టాండ్, ఇతర అవసరమైన ప్రాంతాలు, మండల సమాఖ్యల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో జాగ్రత్తగా వాటర్ టెస్టింగ్లను చేపట్టాలని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, సోషల్ వెల్ఫేర్ బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ లో కూడా వాటర్ టెస్టింగ్ చేపట్టాలన్నారు. వేసవి సందర్భంగా వచ్చే జూలై వరకు త్రాగునీటి సరఫరాకి ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు తెలుపగా, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఉన్నా త్రాగునీటి ఎద్దడి ఏర్పడిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, జడ్పి సిఈఓ విజయలక్ష్మి, డిపిఓ నాగరాజునాయుడు, డ్వామా పిడి సలీమ్ భాష, డిఈ చంద్రశేఖర్, ఆర్డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా వన్నమ్మ తల్లి దీపోత్సవం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరు గ్రామదేవత వన్నమ్మ తల్లి దీపోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుండి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ వన్నమ్మ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ సామాగ్రి, ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన బియ్యం పిండి, బెల్లంతో తయారుచేసిన సెలిమిడిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించుకుని డప్పు వాయిద్యాలు నడుమ ఊరేగింపుగా దేవాలయానికి వచ్చి అమ్మవారికి హారతులు సమర్పించారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, బాలాజీలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వన్నమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాల ఉండాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు స్థానిక నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఎస్.డి.జి.ఎస్. కళాశాలలో మెగా జాబ్ మేళా

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.డి.జి.ఎస్. కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర కుమార్ తెలిపారు. నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 12 బహుళ జాతి కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18--35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000-- రూ.25,000 వరకు జీతం లభిస్తుందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు పెనుకొండ , హిందూపురం, పాలసముద్రం, అనంతపురం, బెంగళూరు ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావచ్చని తెలిపారు.

## విద్యార్థులకు అట్టల పంపిణీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పట్టణంలోని త్యాగరాజ నగర్ మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి బడుల విద్యార్థులకు సోమవారం అట్టలను పంపిణీ చేశారు. ఉచిత వేసవిబడి విద్యార్థులకు మెప్మా ఉద్యోగి కె.హెచ్.సాధిక బాను, ప్రభుత్వఉపాధ్యాయులు చాంద్ బాషా దంపతులు అట్టలను పంపిణీ చేసి విద్యార్థులకు అన్నదానం చేశారు. ఇందులో భాగంగా పాఠశాల యాజమాన్యం సాధికాబాను, చాంద్ బాషా దంపతులను సన్మానం చేశారు. ఫ్లవర్ మర్చంట్ కెసిఎస్ కరీమ్ కుటుంబ సభ్యులు హుస్సేన్ షావలి, నగినా, హాదియా హార్నెన్, హిదయతుల్లా, షబ్రిన్ తాజ్ ,యాసీరా ఫాతిమా, మాహీన్ ఫిర్దోస్ అట్టల పంపిణీ చేయడం పట్ల విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాంద్ బాషా, మాళప్ప, కె.సాయికళ, నగీనా, కుమారి, మమత, సాయి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సూచించినటువంటి పంచ సూత్రాలని ప్రజలు తప్పకుండా పాటించాలి



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం అనంతపురము జిల్లా భారతీయ జనతా పార్టీ జనతా వారధి కార్యక్రమంలో భాగంగా ప్రతి శుక్రవారం ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్పందిస్తూ పార్టీ వైపు నుంచి వినతి పత్రం అందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని అదేవిధంగా అన్ని జిల్లాలకు రాష్ట్ర పార్టీ ఇచ్చినటువంటి కంటెంట్ పొదుపు జాగ్రత్తలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించినటువంటి పంచ సూత్రాలని ప్రజలు తప్పకుండా పాటించాలని అని అన్నారు. బాధ్యతాయుత జీవన విధానంపై ప్రజా అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వం ద్వారా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ కి సోమవారం వినతి పత్రం అందించడం జరిగింది. జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ సానుకూలంగా స్పందించి అవేర్నెస్ క్యాంప్స్ నిర్వహిస్తామని తెలపడం జరిగింది. జనతా వారధి కార్యక్రమం ద్వారా ఇచ్చినటువంటి సమస్యలను పరిశీలించి కచ్చితంగా వాటి పరిష్కారం చేసేలా చూస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్, జనతా వారధి జిల్లా కన్వీనర్ ఎల్ నాగేంద్ర, సీనియర్ నాయకులు రత్నమయ్య, మల్లరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్, కోశాధికారి అయ్యన్న, యూవ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శివ తేజశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ రామాంజనేయ ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు దామోదర్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున, కార్యదర్శి నరేంద్ర, మీడియా కన్వీనర్ దిలీప్, మండల అధ్యక్షుడు ఓబులేసు, ఆనంద్, రాజేంద్ర, కాటమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జలధార జలహారతి పనులను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్ యోగానంద రెడ్డి.

ప్రజాభూమి ,పుట్లూరు.



పుట్లూరు మండలానికి సంబంధించి ఉదయం గ్రా.కొండాపురం గ్రామపంచాయతీ నందు జల ధార- జల హారతి కింద మంజూరైనటువంటి చెక్ డ్యామ్ నందు పూడిక తీసివేత 2 పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి జలధార జల హారతి స్పెషల్ ఆఫీసర్ యోగానంద రెడ్డి డి డి ఓ ఇం చార్జ్ అనంతపురం డివిజన్, శ్రచెన్నకేశవులు గారు ఏపీడి అనంతపూర్ డివిజన్ పాల్గొని కూలీల హాజరు మరియు పని నాణ్యత పరిశీలించడం జరిగింది అదేవిధంగా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో మండల ఏపీవో ఎం తులసి ప్రసాద్ ఈసీ అంజన్ కుమార్ క్షేత్ర సహాయకులు శివ హాజరుకావడమే జరిగింది. అదేవిధంగా అరకటి వేముల సూర్య పల్లి చెర్లోపల్లి గ్రామాల నందు జరుగుతున్న జల ధార జల హారతి పనులను ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుండి పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి సూర్యనారాయణ డి ఈ , షఫీ జేఈ హాజరు కావడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు ఆదినారాయణ కుళ్లాయప్ప,హరినాథ్ సాంకేతిక సహాయకులు ఆంజనేయ ఏపీఓ పాల్గొనడం జరిగింది.

## హత్యా రాజకీయాలకు పెట్టిన పేరు తెలుగుదేశం పార్టీ విలువలు విశ్వతనీయత గురించి మాట్లాడే నైతిక అర్హత నీకు లేదు కేశవ్ -మీడియా ముఖంగా ధ్వజమెత్తిన వై విశ్వేశ్వర్ రెడ్డి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



అనంతపురం జిల్లా కేంద్రంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఉరవకొండ నియోజకవర్గం ఇంచార్జ్ పిఏసి మెంబర్ ఉరవకొండ మాజీ శాసనసభ్యులు వై విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడడం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వానికి, ఈ తెలుగుదేశం పార్టీకి, రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని విమర్శించే స్థాయి గాని, జగన్ మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదు. అయ్యా చంద్రబాబు నువ్వు కుటుంబాల గురించి మాట్లాడతావు నువ్వు నీ సోదరులకి ఏమాత్రం న్యాయం చేశావు, నీ తల్లిదండ్రులను ఏమాత్రం గౌరవాన్ని ఇస్తున్నావో తెలుసుకో నీ సొంత బావమరిది హరికృష్ణను వారి కొడుకు జూనియర్ ఎన్టీఆర్కు ఏ విధమైన గౌరవం ఇస్తున్నారో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి తెలుసు అన్నారు. మీలాంటి వాళ్ళ మా వైయస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబాన్ని గురించి మాట్లాడడం సిగ్గుచేటు అని అన్నారు. ఇక్కడ ఉరవకొండ నియోజకవర్గంలో ఆర్థిక మంత్రి, దివంగత నేత రాజశేఖర్ రెడ్డిని వారి కొడుకును విమర్శిస్తారు. నీకు ఏమి నైతిక అర్హత ఉంది, నువ్వు కమిషన్లకు కక్కుర్తి పడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజారుస్తున్నావ్, హత్య రాజకీయాలకు మారుపేరు మీ కుటుంబం మా నాన్న, మా సోదరుల హత్యకు ప్రధాన సూత్రధారులు మీరు కాదా, రాజకీయంగా గ్రామాలలో ఎవడు అడొచ్చిన వారిని హతమార్చే నైజం మీది కాదా, దొంగసారాకు కల్తీ మద్యనికి, పేకాటస్థావరాలకు కేరాఫ్ అడ్రస్ మీ బ్రదర్స్ కదా, మీ పార్టీని బందిపోటు పార్టీ అనాలా లేదా ఏమని సంబోధించాలో మీరే చెప్పండి అని అన్నారు. అక్కడ ఉన్న సైకిల్ గుర్తు తీసేసి గద్ద గుర్తు పెట్టుకోండి ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గద్దల్ల పీక్కుతింటున్నారు. మీరు చేస్తున్న అరాచకాలకు దోపిడీలకు రాబోవు రోజుల్లో రాష్ట్రం కచ్చితంగా ఆర్థిక సంక్షేమం ఎదుర్కోవాల్సి వస్తుంది అని ఆయన మీడియా ముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ, ఉరవకొండ నియోజకవర్గ వైసిపి అధికార ప్రతినిధి సిపి వీరన్న, కూడేరు వైసిపి ఎంపీపీ నారాయణరెడ్డి, కూడేరు మండల ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం

-శిక్షణా తరగతుల కరపత్రాల విడుదల -రాష్ట్ర అధ్యక్షులు గండాల సంతోష్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా నిరుద్యోగ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గండాల సంతోష్ కుమార్ ఆరోపించారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి సంవత్సరం నాలుగు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం ఇవ్వలేకపోతే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం రోజురోజుకు పెరుగుతుండగా, ఉపాధి లేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తు చీకటిలోకి నెట్టబడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఓ వైపు ఉద్యోగాల కల్పనలో విఫలమై మరోవైపు “ముగ్గురు పిల్లలు కనండి రూ.30 వేలు, నలుగురు పిల్లలు కనండి రూ.40 వేలు” అంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగం తాండవం చేస్తుంటే దానిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రజల అసలు సమస్యలను పక్కనబెట్టి దారి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. యువతకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కోటప్పకొండలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. వివరించారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్యలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవాలంటే రాజకీయ అవగాహన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ శిక్షణా తరగతుల్లో రాజకీయ అవగాహన, పర్యావరణ రక్షణ, యువజన నాయకత్వ వికాసం, పోరాటాల చరిత్ర, సమకాలీన రాజకీయ విశ్లేషణ వంటి అంశాలపై ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్లు బోధన అందిస్తున్నారని తెలిపారు. అలాగే సినీ ప్రముఖులు, మేధావులు, లౌకికవాదులు హాజరై యువతకు సందేశం ఇస్తున్నారని చెప్పారు. రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 600 మందికి పైగా యువ నాయకత్వం ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని, యువత పెద్ద ఎత్తున హాజరై శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పుట్టపర్తి జిల్లా కార్యదర్శి సకాల రాజా, కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ కమల్ భాషా, మాజీ యువజన నాయకులు బాబు, చలపతి, యూనియన్ సమీవుల్లా, ఏఐవైఎఫ్ జిలాన్ భాష, ప్రసాద్ బాబు, కిషోర్ కుమార్, ఫిరోజ్ సుహేల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్య గ్లోరీ ఆసుపత్రి పై చర్యలు తీసుకోవాలి

-ప్రైవేటు వైద్యులు, సిబ్బంది ర్యాలీ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్న ధన్య గ్లోరీ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. ధన్య గ్లోరీ ఆసుపత్రి యాజమాన్య వైఖరి నిరసిస్తూ సోమవారం పట్టణంలో ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అనంతరం రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ధన్య గ్లోరీ కంటి ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని పోరాటం చేస్తున్న చిన్న పిల్లల వైద్యులు వెంకటరమణకు మద్దతుగా ప్రైవేట్ వైద్యులు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికి నకిలీ డాక్టర్ ఆగడాల అరికట్టాలని నినాదాలు చేశారు. ధన్య గ్లోరీ కంటి ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, డాక్టర్లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రి నుండి అంబేద్కర్ సర్కిల్, సద్భావనా సర్కిల్ మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.




అనంతరం చిన్న పిల్లల వైద్యులు వెంకటరమణ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా ఆర్.పి.జి.టి రోడ్ లో ఎలాంటి ప్రభుత్వా అనుమతి లేకుండా ధన్య గ్లోరీ కంటి ఆసుపత్రి ఉందని, అక్కడ అర్హత గల డాక్టర్లు లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు ఓసారి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. తనిఖీల అనంతరం ధన్య గ్లోరీ కంటి ఆసుపత్రిని ధన్య గ్లోరీ మల్టీస్పెషల్ ఆసుపత్రిగా మార్చడం జరిగిందన్నారు. ఆ ఆసుపత్రిలో వైద్యం తెలియని వ్యక్తులతో వైద్యం చేయించుకుంటే అనారోగ్యంతో పాటు ఆర్థికంగా దెబ్బతినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తారు. నకిలీ డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారని తనతో పాటు ఎంతోమంది ఆరోపిస్తున్నారని. ఈ నేపథ్యంలోనే గత నాలుగు రోజుల క్రితం తనపై కక్ష కక్ష పెట్టుకుని ధన్య గ్లోరీ కంటి వైద్య ఆసుపత్రికి సంబంధించిన ఓ వ్యక్తి తాను ఓపిలో పేషెంట్ ను పరీక్షిస్తుండగా తనను అసభ్యకరంగా దూషిస్తూ దాడి చేయడానికి ప్రయత్నిస్తూ తీవ్ర భయాందోళనకు గురి చేశాడని ఆరోపించారు. వారి వల్ల తనకు ప్రాణ రక్షణ కల్పించాలని ఇప్పటికే పోలీసులకు ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం జరిగిందన్నారు. ధన్య గ్లోరీ కంటి వైద్య ఆసుపత్రిని రద్దుచేసి ఆసుపత్రి యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ వైద్యులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కనుంపల్లిలో ఎంఎస్ఎంఈ పార్క్ కి భూమి పూజ

- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



విజయవాడలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని, పారిశ్రామిక పార్కులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద ఎంఎస్ఎంఈ పార్క్ కి భూమి పూజ చేసే కార్యక్రమం నిర్వహించగా, ఇందులో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, సింగనమల శాసనసభ్యులు బండారు శ్రావణి శ్రీ, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఈరోజు గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద ఏపీఐఐసి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రతి ఒక్క నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ పెట్టాలన్న ఉద్దేశంతో ఎంఎస్ఎంఈ పార్క్ కు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. గత నెల రోజుల సమయంలో ఎమ్మెల్యే, ఏడిసిసి చైర్మన్, ఇక్కడున్న రైతులు అందరి సహాయ సహకారాలతో సుమారు 55 ఎకరాల దాకా పరిశ్రమల శాఖకు ఇవ్వగలిగామని, ఇందులో కొంత భూమి తీసుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే నెలలోపు దీనిని ఖచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. మంత్రి నారా లోకేష్ తన పాదయాత్రలో ఈ ప్రాంతానికి ఖచ్చితంగా పలు పరిశ్రమలు తీసుకువస్తామని ఇచ్చినటువంటి హామీని కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లకే ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నేడు పెద్ద ఎత్తున 38 ఎంఎస్ఎంఈ పార్క్ లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. సింగనమల నియోజకవర్గంలో కనుంపల్లిలో దాదాపు 140 ఎకరాల్లో 110 ఎకరాలకు భూసేకరణ చేయడంజరిగిందని, అందులో 55 ఎకరాలకు అన్ని క్లియరెన్స్ చేసి రైతులకు సంపూర్ణంగా సుమారు 13 కోట్ల రూపాయల నష్టపరిహారం చెక్కులను అందించి పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలనే ముఖ్య ధ్యేయంతో ముఖ్యమంత్రి సంకల్పంతో ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు భాగంగా ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని, ఈ ప్రాంతంలో ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఎంఎస్ఎమ్ఈ పార్క్ ద్వారా కనుంపల్లి, గార్లదిన్నె మండలానికి చాలా ఉపయోగకరంగా పరిశ్రమలకు స్థాపించుటకు ఎంతో అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవ నాయుడు, జిఎండిఐసి శ్రీనివాస్ యాదవ్, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దేవకాంతమ్మ, ఏపీఐఐసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాధారిత వివరాలతో వినతులు సమర్పించాలి..!

## -డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పిలుపు

ప్రజాభూమి ప్రతినిధి,కడప : గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేస్తున్న "డెడికేటెడ్ కమిషన్"కు వాస్తవాధారిత సమాచారంతో కూడిన వినతులనే సమర్పించాలని ప్రజలు, కుల సంఘాలు, ప్రజాప్రతినిధులకు.. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా సూచించారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ సి.మల్లికార్జునతో కలసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించిన "గ్రామీణ పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు"పై అధ్యయనం మరియు వినతుల స్వీకరణ" కార్యక్రమంలో డెడికేటెడ్ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా పాల్గొని ప్రసంగించి.. అనంతరం విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.03, వెనుకబడిన తరగతుల



సంక్షేమ శాఖ ద్వారా సుప్రీంకోర్టు వివిధ తీర్పుల మేరకు ట్రిపుల్ టెస్ట్ నిబంధనలను అమలు చేయడానికి ఈ డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించేందుకు రాజ్యాంగబద్ధంగా, శాస్త్రీయంగా,అనుభవాధారితంగా అధ్యయనం చేయడం కమిషన్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబడిన స్థితిగతులు ఏ మేరకు ఉన్నాయో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వాటి ప్రభావాన్ని అంచనా వేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులు,మెమోరాండములు కమిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయని, అందులో పేర్కొనే ప్రతి అంశం వాస్తవాధారితంగా ఉండాలని స్పష్టం చేశారు. వినతిపత్రాలతో పాటు సంబంధిత పత్రాలు, ఆధారాలు,గణాంకాలు, నివేదికలు, ధృవీకరణ పత్రాలు కూడా సమర్పించాలని సూచించారు. తమ వద్ద లేని పత్రాలు ఎవరి నుంచి పొందవచ్చో వారి వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. కమిషన్ పరిశీలనలో పారదర్శకత, నిష్పాక్షికతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు.ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం కీలకమని,బీసీల స్థితిగతులపై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. కమిషన్ నిర్వహిస్తున్న అధ్యయనం బీసీ వర్గాల భవిష్యత్తు ప్రాతినిధ్యానికి కీలకమైందని పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే వినతులు సమగ్రంగా, స్పష్టంగా ఉండేలా అధికారులు మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈ ఓ సుబ్రమణ్యం, డిపిఓ వెంకట సుబ్బయ్య, సీపీఓ హాజరతయ్య, జిల్లా బిసి సంక్షేమ మరియు సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, మున్సిపల్ కమిషనర్లు,కడప, అన్నమయ్య జిల్లాల సంబంధిత శాఖల అధికారులు,కుల సంఘాల ప్రతినిధులు,ప్రజా ప్రతినిధులు,పౌర సమాజ సంస్థల సభ్యులు పాల్గొన్నారు

# వాయిదాల పద్ధతిలో ప్రజల సంపద దోపిడీ -- పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి

## తాజాగా సోమవారం 25-5-2026 బాదుడు పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 పెంపు

## -ఎన్.డి. విజయజ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు

ప్రజా భూమి, కడప సిటీ :

సోమవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై వాయిదాల పద్ధతిలో ఆర్థిక భారం మోపుతూ, ప్రజల సంపదను దోచుకుంటోందని వైఎస్సార్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి తీవ్రస్థాయిలో విమర్శించారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం, కడప నుండి విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, ప్రపంచంలోని అనేక దేశాలు పెరిగిన ఇంధనధరలభారాన్ని తగ్గిస్తూ ప్రజలకు ఉపశమనం కల్పిస్తున్నవేళ,భారతదేశంలో మాత్రంకేంద్రప్రభుత్వంనిరంతర ధరల పెంపులతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మే నెలలో ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్కంపెనీలువరుసగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం ప్రజలపై తీవ్రమైన భారం మోపిందన్నారు. మే 15, 2026న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకుసుమారు రూ.3చొప్పున పెంపుచేసినట్లునివేదికలు వెల్లడించాయి. మే 19న 90 పైసలు, అనంతరం మే 23న పెట్రోల్‌పై రూ.0.87, డీజిల్‌పై రూ.0.91 పెంచగా, మే 25న మళ్లీ పెట్రోల్‌పై రూ.2.61, డీజిల్‌పై రూ.2.71 చొప్పున ధరలు పెంచినట్లు సమాచారం వెలువడిందన్నారు. ఈ విధంగా కేవలం రెండు వారాల వ్యవధిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు సుమారు రూ.7.5 వరకు పెరగడం సామాన్య ప్రజల నడుం విరిచే చర్యగా అభివర్ణించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మారుతున్నాయని చెప్పుకుంటూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపుతుండగా, భారీ ఎక్సైజ్



సుంకాలు మరియు రాష్ట్రాలపై ఒత్తిడి ద్వారా పన్నుల వసూళ్లను కొనసాగిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం దేశంలోనే అత్యధిక ఇంధన ధరలు నమోదవుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా మారిందని, అధిక వ్యాట్ కారణంగా రవాణా చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్ ధరలు సగటున లీటరుకు రూ.113 దాటిన పరిస్థితి ఉందని, ఇది రైతులు, కార్మికులు, మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులపై తీవ్రమైన ప్రభావం చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్సైజ్ సుంకాలను తగ్గించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న వ్యాట్‌ను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్చేశారు. ప్రజలజేబులు ఖాళీ చేస్తూ ప్రభుత్వాలు ఖజానాలు నింపుకోవడం సిగ్గుచేటు. ఇంధన ధరల పెరుగుదల వల్ల అన్ని రంగాలపై ద్రవ్యోల్బణ ప్రభావం పడుతోంది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలి అని ఆమె స్పష్టం చేశారు.

# పారిశ్రామిక రంగానికి పెద్దపీట: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## కడప నగర సమగ్ర అభివృద్ధి కూటమితోనే సాధ్యం: ప్రభుత్వ విప్ - కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,వైఎస్ఆర్ : కడప నియోజకవర్గం లో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడానికి, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల కాన్సెప్ట్‌ను తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో ఎం ఎస్ ఎం ఈ గ్రోత్ సమ్మిట్ 2026 లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టు నకు శంకుస్థాపన చేయగా...కడప నగరంలోని ఇండస్టియల్ డెవలప్మెంట్ పార్క్ లో 2.07 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ ఎఫ్ సి) నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు సాధారణ అపార్ట్ మెంట్ ల వలె కాకుండా, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక డిజైన్లతోరూపొందుతున్నాయని స్పష్టం చేశారు. ఒక స్క్వేర్ మీటర్‌కు దాదాపు ఐదు టన్నుల బరువును మోయగల సామర్థ్యంతో, భారీ ఎక్విప్‌మెంట్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ప్రొడక్షన్ చేయడానికి వీలుగా వీటిని డిజైన్ చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, పై అంతస్తులకు ముడిసరుకును తరలించడానికి మరియు ఫినిష్డ్ ప్రొడక్ట్స్‌ను కిందికి తెచ్చేందుకు పారిశ్రామిక గ్రేడ్ లిఫ్ట్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు.ప్రస్తుతం నిర్మిస్తున్న ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లో సుమారుగా 25 యూనిట్లు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ తెలిపారు. పారిశ్రామికవేత్తల అవసరాలకు అనుగుణంగా ఇంటర్నల్ పార్టిషన్స్ మార్చుకునే వీలుందని, ఎవరికి ఎంత స్థలం కావాలో తెలుసుకోవడానికి వీలుగా తక్షణమే డిమాండ్ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రూ. 15 కోట్లతో 50,000 చాట్ విస్తీర్ణంలో ఫేజ్-1 పనులు జరుగుతుండగా,ఇది పూర్తి కాగానే ఇదే ప్రాంగణంలో మరో రూ. 15 కోట్లతో ఫేజ్-2 నిర్మించడానికి తగిన స్థలం అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు. దాదాపు 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న కడప ఇండస్ట్రియల్ పార్కులో ప్రస్తుతం 165కు పైగా పరిశ్రమలు విజయవంతంగా నడుస్తున్నాయని, ఇవి ఏటా రూ. 250 నుండి రూ. 300 కోట్ల టర్నోవర్‌తో నగర ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 4,000 మందికి నేరుగా ఉపాధి లభిస్తోందని పేర్కొన్నారు. కడప నగరంలో ప్రైవేట్ వ్యక్తులకు 2,000 స్క్వేర్ మీటర్ల పైబడి భూమి ఉంటే, వారు సొంతంగా లేదా ాృా××జతో జాయింట్ వెంచర్ ద్వారా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలను నిర్మించుకోవచ్చని తెలిపారు. వీటికి అవసరమైన రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను ప్రభుత్వం ప్రాధాన్యతపై కల్పిస్తుందని, గరిష్టంగా 60 శాతం వరకు సబ్సిడీ పొందే అవకాశం కూడా ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే మొట్టమొదటిసారిగా ఒక టైర్-



3 నగరంలో యువతను టార్గెట్‌గా చేసుకుని "స్టార్టప్ కడప"ను వచ్చే నెలలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని కలెక్టర్ ప్రకటించారు. పారిశ్రామికవేత్తలకు పెట్టుబడి సాయం, బ్యాంకింగ్ రుణాలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియను డిజిటల్ విధానంలో వేగవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల్లో ఈ ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ మరియు కడప శాసన సభ్యురాలు రెడ్డప్పగారి మాధవి రెడ్డి మాట్లాడుతూ... కడప నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాయలసీమను ఐటీ, పారిశ్రామిక రంగాలుగా తీర్చిదిద్ది, ఇక్కడి రైతుల బిడ్డలు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా స్థిరపడేలా చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడు గారిదేనని ఆమె కొనియాడారు. ఇప్పుడు 'పూర్వోదయ' పథకం ద్వారా రూ. 40,000 కోట్లతో రాయలసీమను ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. అలాగే, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ గారి చొరవతో కేవలం 30 నుండి 45 రోజుల్లోనే ప్రక్రియ పూర్తి చేసి, పొరుగు రాష్ట్రాల పోటీని తట్టుకుని అనంతపురం జిల్లా పుట్టపర్తి పరిధిలో ఫిఫ్త్ జనరేషన్ 'ఫైటర్ జెట్స్' పరిశ్రమకు భూమి పూజ చేయడం జరిగిందని, ఇది మన స్వదేశీ టెక్నాలజీతో రూపుదిద్దుకోనుందని ఆమె వెల్లడించారు. కడపలో సరికొత్త పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతూ, చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారస్తుల (కార్పెంటర్స్, సోఫాలు, మంచాలు, గార్మెంట్స్ తదితర రంగాలు) కోసం ఈ ఎంఎస్ఎంఈ పార్కులో రెంట్ లేదా కొనుగోలు పద్ధతిలో 25 గదులతో కూడిన ప్లగ్ అండ్ ప్లే మోడల్ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ పారిశ్రామిక పార్కులో 50 శాతం ఆక్యుపెన్సీ పూర్తి కాగానే రెండవ వెంచర్ కూడా ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ వెంచర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సైబర్ కేర్, ఏటీఎం, రా మెటీరియల్ స్టోరేజ్, విశాలమైన పార్కింగ్ మరియు సీసీ రోడ్ల వంటి అత్యాధునిక వసతులు కల్పించినట్లు చెప్పారు.దీనితో పాటు రాబోయే ఒకటి రెండు నెలల్లో యువత, ఐటీ నిపుణుల కోసం "స్టార్టప్ కడప"ను ప్రారంభించబోతున్నామని, దీని ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు లోన్లు, మెంటార్షిప్ సేవలు అందుతాయని ఆమె ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డిఓ మురళి, ఏపిఐఐసి జెడ్ ఎం శ్రీనివాస మూర్తి, ఇండస్ట్రీస్ జిఎం చాంద్ బాష సంబంధిత అధికారులు, ప్రోత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు

# ఘనంగా బడి పండుగ కార్యక్రమం

## - ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం, నాణ్యమైన విద్యపై మండల విద్యాధికారుల అవగాహన

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక తలిశెట్టి సుబ్రహ్మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన "బడి పండుగ" కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారులు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్ ఐజాక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమాజ అభివృద్ధికి పునాదులని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.



ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా శాస్త్రీయ విధానంలో విద్యాబోధన అందిస్తోందన్నారు. విద్యా కానుక, మధ్యాహ్న భోజనం, 'తల్లికి వందనం' వంటి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. అనంతరం స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ బడి పండుగ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ సామాజిక సేవా కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, డ్వాక్రా సంఘ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయాలి

## - టీటీడీ పాలకమండలి సభ్యుడికి వినతిపత్రం అందజేత

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

ప్రజాభూమి, వేంపల్లె

వేంపల్లి సమీపంలోని పాపాఘ్ని నది తీరాన ఎద్దులకొండపై వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు.



ఈ మేరకు తిరుపతిలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డితో కలిసి టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ దాదాపు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరడంతో కొందరు భక్తులు స్వచ్ఛందంగా తమ సొంత నిధులతో నిర్వహణ చేపడుతున్నారని తెలిపారు. ఏడుకొండలలో ఒకటిగా భావించే వృషభద్రి కొండపై ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని భానుప్రకాష్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, ఎద్దుల ప్రసాద్, కంతూరి కుమార్, నామా చంద్రశేఖర్, లింగారెడ్డి, శంకర్ రెడ్డి, పెద్దిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గాలివానకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

వంతాటిపల్లెలో గాలివాన బీభత్సం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వంతాటిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన ఉరుములు, మెరుపుల భారీ వర్షానికి పెను ప్రమాదం తప్పింది. గాలివాన బీభత్సానికి గ్రామానికి చెందిన రైతు బూసి వెంకటసుబ్బారెడ్డి ఇంటి పైకప్పు రేకులు గాల్లోకి లేచి దూరంగా పడిపోయాయి. బాధిత రైతు సోమవారం తన నివాసంలో మాట్లాడుతూ.. ఇటీవలే 75 వేల వ్యయంతో నూతనంగా నిర్మించుకున్న ఇంటి రేకులు ఎగిరిపోవడంతో పాటు, ఇంట్లో ఉన్న కూలర్, ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆయన కోరారు.ఈ విషయమై వీఆర్వో ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ.. నష్టాన్ని పరిశీలించి, వివరాలను మండల తహశీల్దార్ ఆకుల తిరుమల బాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. బాధిత రైతుకు నష్టపరిహారం అందించడం కోసం ఉన్నతాధికారులకు త్వరలోనే నివేదిక పంపుతామని ఆయన తెలిపారు.

# ఆత్మకూరు టీడీపీ పరిశీలకుడిగా శనివారపు మోహన్ రెడ్డి నియామకం



ప్రజాభూమి, సిద్దవటం: రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలం జ్యోతి గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డికి పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా నియమించింది. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు 2029 ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# డాక్టర్ బి సి రాయ్ గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ జి. శివకుమార్ ఎంపిక



ప్రజాభూమి, ఒంటిమిట్ట: డాక్టర్ బి సి రాయ్ గ్రామీణ వైద్యుల రాష్ట్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఒంటిమిట్టకు చెందిన డాక్టర్ జి. శివకుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎంపిక పట్ల రాష్ట్ర కల్లుగీత కార్మికుల సంఘం మాజీ డైరెక్టర్, టిడిపి సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు ప్రస్తుత నవ్యాంధ్రలోనూ గ్రామీణ వైద్యుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ శివకుమార్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ విశేష కృషి చేశారని కొమరా కొనియాడారు. వైద్య రంగంలో వచ్చే మార్పులను గ్రామీణ వైద్యులకు చేరవేయడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. ప్రజలకు ఏ వ్యాధికి ఎక్కడ మంచి వైద్యం లభిస్తుందో క్షుణ్ణంగా వివరిస్తూ, ఉచిత సలహాలు ఇస్తూ కడప జిల్లా గ్రామీణ వైద్యులలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. లాభాపేక్ష లేని సేవలు అందిస్తున్న డాక్టర్ శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే రోజుల్లో ఆయన సేవలు మరింత విస్తృతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గాలివానకు నష్టపోయిన బాధితుడికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

## సీఎంఆర్ఎఫ్ ద్వారా నష్టపరిహారం అందించాలని విపత్తుల నిర్వహణ సంస్థకు విజ్ఞప్తి

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని వంతాటిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ గాలివానకు సర్వస్వం కోల్పోయిన రైతు బూసి వెంకటసుబ్బారెడ్డి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా



ఆదుకుంటుందని బీజేపీ నాయకులు భరోసా ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆదేశాల మేరకు ఈరోజు పార్టీ సీనియర్ నాయకులు కాకర్ల భాస్కర్ రెడ్డి మరియు కార్యకర్తలతో కలిసి బాధిత రైతు ఇల్లును సందర్శించి, పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడు వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కేవలం రెండు నెలల క్రితమే రూ.75,000 ఖర్చు చేసి ఇంటి పైకప్పు ఏర్పాటు చేసుకున్నానని, నిన్నటి ప్రకృతి వైపరీత్యానికి అది పూర్తిగా కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర సామగ్రి పూర్తిగా ధ్వంసమై భారీ నష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరయ్యారు.ఈ ఘటనపై బీజేపీ నాయకులు తక్షణమే స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. నష్టపోయిన రైతుకు ఏపీ సీఎంఆర్ఎఫ్ కింద తగిన నష్టపరిహారం చెల్లించవలసిందిగా కోరారు. అలాగే స్థానిక రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులకు సమాచారం అందించి, తక్షణమే ఘటనా స్థలాన్ని సందర్శించి 'రెవెన్యూ లాస్ సర్టిఫికేట్' కోసం పంచనామా నిర్వహించి నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు. బాధితుడు మనోధైర్యంతో ఉండాలని, ప్రభుత్వ సహాయం అందేలా చూస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రజల అర్జీలను పరిష్కరించాలి

ప్రజాభూమి,పులివెందుల

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహశీల్దార్ నజీర్ రహ్మద్ వీఆర్వోలను ఆదేశించా రు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో ఆయన వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా



చూడాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ప్రజల ధ్రువపత్రాల జారీలో అలసత్వం తగదన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. వీఆర్వోలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకట్ రెడ్డి, ఆర్ఐ షేక్షావల్లి,వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

మంగళవారం 26 మే 2026

# ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో పలువురు సిబ్బంది డిప్యుటేషన్" లీలలు"

## -డిప్యూటేషన్ రద్దుకు ఎమ్మెల్యే,కలెక్టర్ సిఫార్సు కూడా అమలు కానీ వైనం




ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో పనిచేయాల్సిన పలువురు సిబ్బంది డిప్యుటేషన్ ఉత్తర్వులపై ఇతర ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు.దీంతో సిబ్బంది కొరత వల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులకు వైద్యం అందని పరిస్థితి ఎదురవుతోంది. ప్రధానంగా డిప్యుటేషన్ ఉత్తర్వులపై వేరే ప్రాంతాల్లో ఏళ్ల తరబడి కొనసాగుతూ అక్కడ సేవలు అందిస్తూ వేతనం మాత్రం ఇక్కడే తీసుకుంటున్నారు. ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో స్టాఫ్ నర్స్ గా పని చేయాల్సిన భారతి 2023 సెప్టెంబర్ 23 నుంచి డిప్యుటేషన్ ఉత్తర్వులపై శ్రీకాళహస్తి ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. అలాగే మరో స్టాఫ్ నర్స్ కవిత 2024 డిసెంబర్ 27 నుంచి నెల్లూరులో డిప్యూటేషన్ బదిలీపై పని చేస్తున్నారు.దీంతోపాటు జనరల్ డ్యూటీ లో పనిచేయాల్సిన లక్ష్మీనారాయణ 2024 జనవరి 12 నుంచి డిప్యూటేషన్పై శ్రీకాళహస్తిలో విధులు నిర్వర్తిస్తున్నారు.అలాగే జనరల్ డ్యూటీలో పని చేయాల్సిన శ్రీనివాసన్ 2024 జూన్ 20 నుంచి నగిరి ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్గా పని చేయాల్సిన శోభారాణి 2024 మే 16 నుంచి డిప్యుటేషన్పై పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు.అయితే ఆప్తాల్మిక్ అసిస్టెంట్ శోభారాణి సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ చేశారే తప్ప ఒక్కరోజు కూడా ఇక్కడ సేవలు అందించిన పాపాన పోలేదు.వీరందరూ కూడా వారి వారి రాజకీయ అండదండలతో డిప్యుటేషన్ ఉత్తర్వులు పొంది రెండు మూడు ఏళ్ల పాటు వేతనం ఇక్కడ తీసుకుంటూ సేవలు మాత్రం అక్కడ అందిస్తున్నారు. అయితే గత నెలలో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సలహా సొసైటీ సమావేశంలో డిప్యుటేషన్ లపై పనిచేస్తున్న సిబ్బంది దిని వెనక్కి రప్పించాలని చర్చ జరిగింది.ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. ఈ క్రమంలోనే దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా డిసిహెచ్ఎస్ ను కోరారు.దీంతో సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయాల్సిన అయిదుగురు సిబ్బంది డిప్యూటేషన్ ఉత్తర్వులు రద్దుచేసి వెనక్కి రప్పించాలని జిల్లా డిసిహెచ్ఎస్ ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ సిఫార్సులను చిత్తూరు డిసిహెచ్ఎస్కు గత నెల 29వ తేదీన నివేదించారు. అయితే దాదాపు నెల రోజులు పూర్తికావస్తున్న దీనిపై చిత్తూరు డిసిహెచ్ఎస్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పెండింగ్లో పడ్డాయి.అయితే డిప్యూటేషన్లపై సిబ్బంది పని చేయడం వల్ల ఇక్కడ ఆపోస్టులను ఖాళీగా చూపే అవకాశాలు స్థానిక వైద్యాధికారులకు లేదు. అందువల్ల ఇప్పటికైనా దీనిపై చిత్తూర్ డిసిహెచ్ఎస్ స్పందించి ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ సిఫార్సులు అనుగుణంగా సిబ్బంది డిప్యూటేషన్లను రద్దుచేసి వారు యధాస్థానానికి వచ్చేటట్టు చర్యలు తీసుకోవడంతోపాటు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## బి.ఎన్.కండ్రిగ మండలంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహణ




ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగ మండల కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను అధికారులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణఎంపీడీవో వెంకటరత్నమ్మ పాల్గొని ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, తాగునీరు, పింఛన్లు, రేషన్, ఉపాధి హామీ, వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. వ్యవసాయ అధికారి కె. షణ్ముగం రైతులకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని తగిన సూచనలు చేశారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎం మునయ్యతో పాటు మండలంలోని పలు శాఖల ఉన్నతాధికారులు హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు.

# సత్యవేడు టు ఊతుకోట రోడ్డు పనులకు మోక్షం ఎప్పుడో?

## -అరకొరగా పనులు ఆగిపోవడంతో పూర్తికాని వైనం.



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

సత్యవేడు టు ఊతుకోట ప్రధాన మార్గం రోడ్డు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా మారింది.ఈ మార్గంలో రోడ్డు పనులు ముందుకు కదలడం లేదు.ప్రధానంగా సత్యవేడు నుంచి ఆంధ్ర సరిహద్దు దాసుకుప్పం వరకు డబుల్‌హా రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో పలుచోట్ల కంకర తేలి గుంతలమైన మారింది. ఈ నేపథ్యంలో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారడంతో దీని బాగు చేయడానికి సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపడంతో దాదాపు నాలుగు కోట్ల 50 లక్షల రూపాయలను ఏడాది క్రితమే ప్రభుత్వం మంజూరు చేసింది. నగిరికి చెందిన గుత్తేదారుడు ఈ రోడ్డు పనులను దక్కించుకున్నారు.అయితే రోడ్డు పనులను ప్రారంభించడంలో గుత్తేదారుడు నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ వచ్చారు.ఈ నేపథ్యంలో దీనిపై నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి ఒత్తిడి తేవడంతో రోడ్డు పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగానే సత్యవేడు నుంచి వెంకట రాజుల కండ్రిగ వరకు దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు పనులను పూర్తి చేసి ఆపేశారు.ఇంకా 11 కిలోమీటర్ల వరకు గుంతలను కంకరతో పూడ్చి రెండు లేయర్స్ తారు రోడ్డు వేయాల్సి ఉంది.అయితే రోడ్డు పనులు ఆగి మూడు నెలలు పూర్తి కావొస్తుంది. ఇంతవరకు సంబంధిత గుత్తేదారుడు పనులు చేపట్టలేదు.దీనిపై రోడ్లు భవనాల శాఖ అధికారులు కూడా నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.రోడ్డు పనులు అరకొరగా నిలిపివేయడంపై వాహనదారులు పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంతకీ ఆర్ అండ్ బి అధికారులు ఉన్నట్టా లేనట్టా అని ప్రశ్నిస్తున్నారు.రోడ్డు పనులను సకాలంలో పూర్తి చేయించాలన్న ధ్యాస సంబంధిత రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులలోనూ లోపించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా దీనిపై రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు స్పందించి అరకొరగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయించడానికి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# జలధార -- జలహారతి పనులను పరిశీలించిన ఎంపీడీవో వెంకటరత్నమ్మ



ప్రజా భూమి ప్రతినిధి - బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి.ఎన్.కండ్రిగ మండలంలో చేపడుతున్న జలధార -- జలహారతి పనులను ఎంపీడీవో వెంకటరత్నమ్మ పరిశీలించారు. ముసలి ఎల్లమ్మ కాలువ నుంచి వీ.ఎస్.పురం ఫీడర్ కెనాల్ వరకు జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.

కాలువల శుభ్రత, నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా పనులు నాణ్యతతో పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. రైతులకు సాగునీరు సమయానికి అందే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరమని, భూగర్భ జలాల పెంపుతో పాటు వ్యవసాయానికి మేలు జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. అనంతరం ప్రస్తుతం మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరం లేకుండా మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ఎక్కువగా నీరు తాగుతూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కూలీలు, రైతులు ఎండలో పనిచేసే సమయంలో తల కప్పుకునే వస్త్రాలు ఉపయోగించాలని, ఇంటి దగ్గర ఉన్న చిన్నపిల్లలు వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి వాకాడు ఇరిగేషన్ చెరువులో అక్రమ సాగు

## ఆక్రమణలతో ఆయకట్టు రైతులు, పాడి రైతులకు తీవ్ర నష్టం -- హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని రైతుల హెచ్చరిక



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని వాకాడు ఇరిగేషన్ చెరువులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి కొంతమంది వ్యక్తులు చెరువు లోపల అక్రమ సాగు చేపడుతున్నారని స్థానిక రైతులు, పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు భూములను ఆక్రమించి సాగు చేయడం వల్ల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతుండటంతో పాటు పశువులకు మేత, తాగునీరు అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై వాకాడు గ్రామానికి చెందిన రైతులు, పాడి రైతులు సోమవారం వాకాడు తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు ఆక్రమణల వల్ల గ్రామంలోని భూగర్భ జలాల మట్టం పడిపోతుండగా, పశువులకు స్వచ్ఛమైన తాగునీరు అందక తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. రైతుల ఆరోపణల ప్రకారం, చెరువు భూముల ఆక్రమణ అంశంపై ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, వాకాడు తహసీల్దార్ మరియు ఇరిగేషన్ అధికారులకు చట్టపరమైన నోటీసులు కూడా పంపించినట్లు తెలిపారు. అయినప్పటికీ గత నాలుగు రోజులుగా ఆక్రమణదారులు చెరువులో సాగు కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వాకాడు తహసీల్దార్ మరియు ఇరిగేషన్ అధికారులు అవినీతికి పాల్పడి ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారని రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెరువు కబ్జాలకు గురవుతోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు వ్యవసాయం, పాడి పరిశ్రమలకు ప్రధాన జీవనాధారమని రైతులు పేర్కొన్నారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల పశువులకు అవసరమైన పచ్చగడ్డి, మేత లభిస్తుందని, అయితే ఆక్రమణల కారణంగా చెరువుల విస్తీర్ణం రోజురోజుకూ తగ్గిపోతోందని తెలిపారు. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోకపోతే వేసవి సెలవుల అనంతరం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్ ) దాఖలు చేయనున్నట్లు రైతులు వెల్లడించారు.

# భూ కబ్జాలను సహించేది లేదు

## -చట్టపరమైన చర్యలు తప్పవు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

భూ కబ్జాల విషయంలో రాజీ లేని చర్యలు తప్పవని, కబ్జాలను ప్రోత్సహించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు స్పష్టం చేశారు సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల వేదిక సందర్భంగా అర్జీదారులతో ఆయన మాట్లాడారు ప్రతి అర్జీకి న్యాయం జరుగుతుంది.. ఆమెరకు రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకునే విధంగా ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ నరసింహులు, ఇతర అధికారులు పాల్గొన్నారు ప్రజా ఫిర్యాదుల విభాగం నుంచి అందిన వినతులకు సత్వరం న్యాయం జరుగుతుంది., మీరేం అధైర్య పడకండి... అర్జులకు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు ఎండలు విపరీతంగా ఉండటం వల్ల ఫిర్యాదారులకు అవసరమైన మంచినీరు, ఇతర వసతులు అందుబాటులోకి తీసుకువచ్చారు.

# తిరుపతి జోనల్ కో-ఆర్డినేటర్ దామచర్ల సత్య ని మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ ముఖ్య నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా నాయకులు సమిష్టిగా అడుగులు వేస్తున్నారు. స్థానిక తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తిరుపతి జోనల్ కో-ఆర్డినేటర్ దామచర్ల సత్య ని,



తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి , తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి



దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా ప్రధాన కార్యదర్శి డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి. ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నూతన జోనల్ కో-ఆర్డినేటర్గా నియమితులైన దామచర్ల సత్య కి నాయకులందరూ బోకేలు,శాలువాలు అందించి తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించారు.

# కావమ్మ తిరునాళ్లకు పోలీసు బందోబస్తు కల్పించాలి

## నాగలాపురం ఎస్ఐ సునీల్‌ను ఆహ్వానించిన ఆలయ నిర్వాహకులు



ప్రజా భూమి ప్రతినిధి నాగలాపురం.

నాగలాపురం రెడ్డి వీధిలోని శ్రీ కావమ్మ సమేత మారయ్య దేవాలయంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న తిరునాళ్ల సందర్భంగా ఆలయ నిర్వాహకులు సోమవారం ఉదయం నాగలాపురం ఎస్ఐ సునీల్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా 29వ తేదీన కావమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమం జరగనున్నదని, ఊరేగింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయవలసిందిగా నిర్వాహకులు కోరారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసుల సహకారం అవసరమని తెలిపారు.

# వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు.



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్,ఇరుగుళం శ్రీఉమామహేశ్వరస్వామి దేవాలయ ధర్మకర్త సుశీల్ కుమార్ రెడ్డి మే 25( నేడు) జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియుజేస్తూ... భవిష్యత్తు ఆయురారోగ్యాలతో,అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ.. రాజకీయంగా మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించడానికి ఆదేవదేవుడు శ్రీవెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఎల్లవేళల ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాం...

# శ్రీ వాయు లింగేశ్వర స్వామి సేవలో కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కుటుంబ సభ్యులు




ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

దక్షిణ కాశీగా పేరు గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వాయు లింగేశ్వర స్వామి దేవస్థానానికి కింజరపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మాత్యులు కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసి యున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బికే వెంకటేశులు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయ దర్శనము, వేద ఆశీర్వచనం ఏర్పాటు చేయడమైనది. సదరు కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బీకే వెంకటేశులు, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, శ్రీకాళహస్తి శాసనసభ్యులు సతీమణి శ్రీమతి రిషితమ్మ, బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి, గోపీనాథ్, పగడాల మురళి, ఆలయ ఏ ఈ ఓ విద్యాసాగర్ రెడ్డి, ప్రోటోకాల్ ఏ ఈ ఓ మోహన్, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం, ఏపీపీఆర్ఓ రవి, రాజశేఖర్. ఆలయ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# ఆమాందూరు పంచాయతీ లో జనసేన నాయకుల పర్యటన



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండల అధ్యక్షులు కిరణ్ కుమార్ రామిశెట్టి.ఆదేశాల మేరకు ఏర్పేడు మండలం ఆమాందూరు పంచాయతీ బీసీ కాలనీలో జనసేన నాయకులు గ్రామ గ్రామానికి, పల్లి పల్లికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మరియు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకి అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడం జరిగింది అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ . చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలకు వివరించడం జరిగింది. అదేవిధంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది . అలాగే ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలబడేది కూటమి ప్రభుత్వం అని హామీ ఇవ్వడం జరిగింది . ప్రజల సంక్షేమం మరియు గ్రామాల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలపడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఏ. వెంకటసుబ్బయ్య. మరియు పి.జయరాం , సాయి , కె. శంకర్. తదితరులు జనసేన ముఖ్య నాయకులు ఇందులో పాల్గొనడం జరిగింది.

# నెల్లూరు జిల్లా అధ్యక్షులు మోచర్ల మధు ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారలు ప్రధానం



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి

శాలివాహన శంఖారావం సభలో 550 మార్కులు తెచ్చిన తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాల విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించడం జరిగింది. 2025-26 సంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమమైన మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కనీసం 30 మందికి పైగా మెమొంటోలు మెరిట్ సర్టిఫికెట్లు మరియు పారితోషకం ఈ కార్యక్రమంలో బహుకరిస్తున్నటువంటి దాతలు నెల్లూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ పెద్దలు మోచర్ల మధుగారు,నెల్లూరుజిల్లా అధ్యక్షులు, చల్లగిరి చిట్టిబాబుగారు,నెల్లూరు జిల్లా కోశాధికారి, చల్లగిరి ప్రసాద్,నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి, అద్దంకి రాజానెల్లూరు జిల్లా యాక్టివ్ కమిటీ మెంబర్ బెజవాడ హరిబాబు సన్ అఫ్ బెజవాడ అధిశేషయ్య -బ్యానర్స్ తయారీ వీరి ఆధ్వర్యంలో పిల్లకు ప్రతిభ పురస్కారాలు అందించిటం జరిగింది.తిరుపతి జిల్లా, రాష్ట్ర కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ద్వారా దాతలు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిజెయటం జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కమిటీ సభ్యులు అందరూ వచ్చి జయప్రద చేసినందుకు వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# పేద విద్యార్థులకు కొండంత అండ పి ఎస్ ఆర్ ట్రస్ట్

## - మాజీ స్వచ్ఛంధ్రా ఛైర్ పర్సన్, గూడూరు మున్సిపల్ ఛైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

:కన్నవారు లేక, కుటుంబ పరిస్థితులు అనుకూలించక ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు కొండంత అండగా నిలుస్తోంది . ప్రతిభ ఉండి పై చదువులు చదువుకునేందుకు అవస్థలు పడుతున్న యువతకు పొణకా శివకుమార్ రెడ్డి ట్రస్ట్ ట్రస్ట్ ఆపన్నహస్తం అందిస్తోంది . ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో జెవివి అద్వర్యంలో ప్రతి ఏడాది పీ.ఎస్.ఆర్ ట్రస్టు దాతృత్వం లో ప్రోత్సాహక బహుమతులు పోణకా దేవసేనమ్మ చేతుల మీదుగా అందించడం జరుగుతుంది. 2026 లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు టాపర్ గా నిలవడంతో జెవివి ఆధ్వర్యంలో పి ఎస్ ఆర్ ట్రస్ట్ దాతృత్వంలో చేతి గడియారాలు,జ్ఞాపికలు,జిప్ ఫైళ్ళు అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం జె వి వి గూడూరు శాఖ అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జె వివి బృందం వారు గూడూరు పట్టణంలోని కరణాలవీధిలోని పారిశ్రామిక వేత్త పొణకా శివకుమార్ రెడ్డి నివాసానికి చేరుకుని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె కు శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జె వి వి అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది జెవివి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పేద విద్యార్థులకు అండగా ఉంటున్న పి ఎస్ ఆర్ ట్రస్ట్ సేవలకు ఎల్లప్పుడూ రుణ పడి ఉంటామని తెలిపి పోణకా దంపతులు కు కృతజ్ఞతలు తెలిపారు.నిరుపేద విద్యార్థులకు చదువు కోసం ఆర్థిక సాయం చేయడం హర్షనీయమన్నారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్, మున్సిపల్ ఛైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ మాట్లాడుతూ..ప్రతి ఏడాది తప్పకుండా జెవివి అద్వర్యంలో విద్యార్దులకు చేతి గడియారాలు, జ్ఞాపికలు అందజేయడం జరుగుతుందని,ఇదొక మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. శివాలయంలో ధ్వజస్తంభం ఏర్పాటు చేసే అవకాశాన్ని దేవుడు కల్పించాడని, ఇది కూడా అంతేననిఆమె తెలిపారు. విద్యార్దులను ప్రోత్సహించడం తమ బాధ్యతగా భావిస్తామని చెప్పారు. ఆర్థిక లేమితో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థుల చదువులకు పి ఎస్ ఆర్ ట్రస్ట్ చేయూతని స్తుందన్నారు. ఈ చేయూతను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆదర్శ సమాజానికి ఉపాధ్యాయులే నిర్దేశకులని, తరగతి గదిలో బోధించే అంశాలతోనే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని, వారు నిబద్ధతతో బోధిస్తేనే ఇది సాధ్యమవుతుందన్నారు.ట్రస్ట్ ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటివరకు ఎంతోమంది నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించామని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు చెంచు నారాయణ,పురుషోత్తం రావు,రామ్మోహన్, ఆనంద్,ఇబ్రహీం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.





# వెంకటగిరి నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి శ్రీకారం

## డక్కిలి మండలం సంగనపల్లిలో ఎం ఎస్ ఎం ఈ పార్క్కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.

సంగనపల్లి గ్రామం, డక్కిలి మండలం, తిరుపతి జిల్లా. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “175 ఎం ఎస్ ఎం ఈ పార్కుల” కార్యక్రమంలో భాగంగా, డక్కిలి మండలం సంగనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతన ఎం ఎస్ ఎం ఈ పార్కు (సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల పార్కు) నిర్మాణానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ.మరియు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరన్ ముఖ్య అతిథిలుగా హాజరై శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. మాట్లాడుతూ పలు కీలక విషయాలను వెల్లడించారు: స్థానికులకే ఉద్యోగ అవకాశాలు: ఈ ఎం ఎస్ ఎం ఈ పార్కు ద్వారా సంగనపల్లి మరియు చుట్టుపక్కల గ్రామాల యువతకు 200 నుండి 400 వరకు నేరుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. స్థానికంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివిన వారికి ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి లక్ష్యం: రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించి, నిరుద్యోగ నిర్మూలన చేసి, పేదరికం లేని రాష్ట్రాన్ని నిర్మించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ముఖ్య ఉద్దేశమని ఆయన కొనియాడారు. నవోదయ స్కూల్ పై స్పష్టత: ఎం ఎస్ ఎం ఈ పార్కు వస్తే నవోదయ స్కూల్ రాదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న 37 ఎకరాల స్థలంలో, 15 ఎకరాలు పరిశ్రమలకు కేటాయించామని, మిగిలిన 20 ఎకరాల్లో ఖచ్చితంగా నవోదయ పాఠశాలను కూడా స్థాపిస్తామని హామీ ఇచ్చారు. విద్యా, ఉపాధి రెండూ ఈ ప్రాంతానికి అందుతాయని స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. చెరువుల అభివృద్ధి: నియోజకవర్గంలోని డక్కిలి, బాలయపల్లి, వేంకటగిరి మండలాల్లో ఉన్న చెరువుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించిందని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో, మండల అధికారులు, పలువురు ప్రభుత్వ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు, ఏ ఎం సి చైర్మన్, పి ఏ సి ఎస్ చైర్మన్లు, మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.








# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 423 అర్జీలు

## పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలి- :జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి,పిజిఆర్ఎస్ అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో డి.ఆర్.ఓ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్ మాండ్ లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ-246, సర్ఫ్ -- 21, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -17, పోలీస్ శాఖ -18, పంచాయతీ రాజ్ -24, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ -5, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ -2, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ -1, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ -16, మైనస్ అండ్ జియాలజీ -5, రూరల్ డెవలప్మెంట్ -6, ఎస్ జి ఎస్ డబ్ల్యూ -2, విద్యుత్ శాఖ -7, ఆర్ టి సి -1, పౌర సరఫరాల శాఖ -3, తుడా -1, గ్రౌండ్ వాటర్ -1, స్కూల్ ఎడ్యుకేషన్ -9, ఏ పి రెసిడెన్షియల్ స్కూల్స్ -9, నీటి వనరులు -9, ఆర్ అండ్ బి -1, ఎక్సైజ్ -1, ఉద్యాన శాఖ -2, ఎల్ డి ఎం -1, అటవీ శాఖ -3, వికలాంగుల శాఖ -1, కుటుంబ సంక్షేమం -2, జాతీయ రహదారులు -1, ఉన్నత విద్య -1, కార్మిక శాఖ -1, పౌర సరఫరా కార్పొరేషన్ -1, పశు సంవర్ధక శాఖ -1, వ్యవసాయ శాఖ -1, దేవాదాయ శాఖ -2, సమగ్ర శిక్ష -1, మొత్తం 423 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.





# ధ్వంసం చేసిన తోపుడుబండ్లకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి

- అలిపిరి వద్ద యథావిధిగా అదే స్థలాల్లో వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలి.
- జెసిబీలతో చిరు వ్యాపారుల బతుకులు ధ్వంసం -- మహిళ చేయి విరగగొట్టిన ఘటనను ఖండిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు భారీ ధర్నా

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

అలిపిరి ప్రాంతంలో దశాబ్దాలుగా తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న పేద చిరు వ్యాపారుల జీవనాధారంపై మున్సిపల్ అధికారులు, పోలీసు యంత్రాంగం కలిసి జెసిబీలతో దాడి చేయడం దారుణమని సిఐటియు తీవ్రంగా ఖండించింది. శనివారం ఉదయం వందలాది మంది పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పెషల్ ఫోర్స్, జెసిబిలు, ట్రాక్టర్లతో అలిపిరి వద్దకు చేరుకుని ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తోపుడుబండ్లను ధ్వంసం చేసి, బండ్లపై ఉన్న సామాగ్రిని చెల్లాచెదురుగా విసిరేసి, బలవంతంగా ట్రాక్టర్లలో తీసుకెళ్లడం అమానుష చర్య అని నాయకులు తెలిపారు. ఈ దౌర్జన్యాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన మహిళలు, వృద్ధులు అన్న తేడా లేకుండా తోసిపడేసి దాడి చేయడం, ఒక మహిళా చిరు వ్యాపారి చేయి విరిగేలా దాడి జరగడం తీవ్ర ఆందోళనకరమని నాయకులు పేర్కొన్నారు. పేదల జీవనాధారాన్ని కాపాడాల్సిన యంత్రాంగమే వారిపై దాడి చేయడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు నిరసనగా నేడు సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి. బాలసుబ్రమణ్యం, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఆర్. లక్ష్మి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం. మాధవ కృష్ణ, నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్ పాల్గొని ప్రసంగించారు. నాయకులు మాట్లాడుతూ అలిపిరి నుంచి జూపార్క్ వరకు గత 40 సంవత్సరాలుగా పేద చిరు వ్యాపారులు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు పసుపు, కుంకుమలు, పండ్లు, జ్యూస్, టిఫిన్లు, భోజనాలు అతి తక్కువ ధరలకు అందిస్తూ సేవ చేస్తున్నారని తెలిపారు. బయట హోటళ్లలో అధిక ధరలకు విక్రయించే ఆహారాన్ని రూ.20, రూ.30లకే తాజాగా, పరిశుభ్రంగా అందిస్తూ భక్తుల ఆకలి తీర్చే పనిని ఈ పేదలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వాలు ఉపాధి కల్పించకపోయినా, ఉద్యోగాలు కోల్పోయిన వారు, పేద కుటుంబాలకు చెందిన వారు వడ్డీలకు అప్పులు తెచ్చుకుని స్వయం శక్తితో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. అలాంటి పేదల జీవనాధారంపై జెసిబీలు నడపడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. తిరుపతి నగరంలో ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, రహదారులు పెద్ద ఆక్రమణలకు గురవుతున్నా మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. స్కూళ్లు, కాలేజీలు, పెద్ద హోటళ్లు, షాపింగ్ మాల్స్ ఆక్రమణలపై చర్యలు లేకుండా కేవలం పేద చిరు వ్యాపారులపై మాత్రమే చర్యలు తీసుకోవడం వివక్షపూరిత వైఖరికి నిదర్శనమని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఈట్ ఫుడ్ సెంటర్‌కు లాభాలు చేకూర్చేందుకు ఉద్దేశపూర్వకంగానే అలిపిరి చిరు వ్యాపారుల బండ్లపై జెసిబీలు నడిపారని నాయకులు ఆరోపించారు. ఈట్ ఫుడ్ వ్యాపారాల ప్రయోజనాల కోసం 40 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్న పేద కుటుంబాలను రోడ్డున పడేయడం ప్రజా వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. ధ్వంసం చేసిన తోపుడుబండ్లు వెంటనే అప్పగించాలని, బండ్లు మరియు సామాగ్రికి పూర్తి నష్టపరిహారం చెల్లించాలని, గతంలో మాదిరిగానే ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న అదే స్థలాల్లో యథావిధిగా వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో డీఆర్ఓకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు పి మునిరాజ పి రమేష్ ఆనంద్ మురళి సురేష్ విజయ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.






# పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) అన్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని గోదాదేవి మార్గం, గాంధీ భవన్, మంచినీళ్ళ కుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ జూన్ 22 వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఒక్కో వారం ఒక్కో అంశంతో పారిశుద్య పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని అన్ని కాలువలు, కుంటలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. మన ఇల్లే కాకుండా పరిసరాలతో పాటు నగరాన్ని శుభ్రంగా ఉంచుకునేందుకు అందరూ కంకణబద్దులు కావాలని అన్నారు. ప్రజలందరూ భాగస్వాములై స్వచ్ఛ తిరుపతి సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు పాల్గొన్నారు.





# నగరపాలక సంస్థకు 30వినతులు

## -ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 30 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా, 9 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా సంజీవయ్య నగర్ నందు రోడ్డును ఆక్రమించి టిఫిన్ దుకాణం నడుపుతున్నారు చర్యలు తీసుకోవాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, వాటర్ పన్ను ఎక్కువగా వస్తోంది పరిశీలించి పరిష్కరించాలని, ఐ ఎస్ మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియా ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు పరిష్కరించాలని, తెలుగుగంగ నీరు సక్రమంగా సరఫరా చేయాలని, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేయాలని, పాత అలిపిరి రోడ్డు నందు అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు తొలగించాలని, నగరంలో పుట్ పాత్ లు లేక ప్రజలు, భక్తులు ఇబ్బంది పడుతున్నారు పరిష్కరించాలని, జగన్మాత చర్చి వద్ద కాలువ నుండి మురుగునీరు బయటకు వస్తోంది పరిష్కరించాలని, అబ్బన్న కాలనిలో రోడ్డులో ర్యాంపులు ఏర్పాటు చేయడంతో ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, లీలామహల్ వద్ద గల చేపల మార్కెట్ వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.



# శ్రీకాళహస్తి రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ఆటోలు పార్కింగ్. ట్రాఫిక్ సమస్యతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ సమీపంలో రోడ్డుమధ్యలో నిర్లక్ష్యంగా నిలిపిన ఆటోలు కారణంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ ఉన్న రోడ్డుపై ఆటోలు అడ్డంగా నిలిపివేయడంతో బస్సులు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రమాదాలకు అవకాశం పెరుగుతోంది. స్థానిక ప్రజలు పలుమార్లు హెచ్చరించినప్పటికీ కొంతమంది డ్రైవర్లు రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయడం ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పోస్టాఫీస్ ప్రాంతం వద్ద ఎప్పుడూ రద్దీగా ఉండే కారణంగా చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు. కావున సంబంధిత ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై అడ్డంగా నిలిపిన వాహనాలపై చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.





# శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభం..!

## ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్న రంగంపేట గ్రామస్తులు...

ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలం, రంగంపేట పంచాయతీ పరిధిలోని కళ్యాణి డ్యామ్ బ్యాక్ వాటర్ సమీపంలో వెలసిన ప్రముఖ పురాతన ఆలయం శ్రీ అంకాలమ్మ తల్లి నూతన ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. దశాబ్దాల కాలంగా స్థానిక గ్రామస్తులకు ఇలవేల్పుగా, కులదైవంగా పూజలందుకుంటున్న అంకాలమ్మ తల్లికి ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు నూతన ఆలయాన్ని నిర్మించారు. పూర్వం ఇక్కడి పురాతన ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించేవారు. అయితే, కాలక్రమేణా ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని సంకల్పించిన గ్రామస్తులు, భక్తులు అందరూ ఒక్కటై, చొరవ తీసుకుని ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ నూతన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు.



భక్తజన సందోహం.. పొంగళ్ళ కోలాహలం.. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో, శుభ ముహూర్తాన అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత జరిగిన తొలి పూజా కార్యక్రమానికి రంగంపేట పంచాయతీతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయబద్ధంగా పొంగళ్ళు పెట్టి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు, హారతుల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత తమ ఇలవేల్పుకు నూతన ఆలయం నిర్మితం కావడం, తొలి పూజలు ఇంత వైభవంగా జరగడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారి కృపతో గ్రామాలన్నీ ఆయురారోగ్యాలు, గ్రామస్తులు ఆయురారోగ్య, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మొక్కులు చెల్లించుకున్నారు.



## హైవే రోడ్డుపై ఎగువ గూలూరు దళితులు రాస్తారోకో అడ్డుకున్న పోలీసులు న్యాయం చేస్తామన్న పుత్తూరు డిఎస్పి....



ప్రజా భూమి ప్రతినిధి పుత్తూరు.

పుత్తూరు మండలం తడుకు సిరుగురాజు పాలెం రింగ్ రోడ్డు ఎగువగులూరు దళితులు గత మూడు నెలలుగా రోడ్డు గురించి అధికారులకు అర్జీలు, పలుమార్లు ధర్నాలు చేయడంతో ఎమ్మెల్యే స్పందించి ఒక కోటి ముప్పై లక్షలు రోడ్డుకు మంజూరు చేయడమైనది. అయితే కాంట్రాక్టర్ రెండు నెలల నుంచి పనులు ప్రారంభించి జెసిబి లతో రోడ్డును త్రవ్వడమైనది. ఇరువైపులా గ్రావెల్ను తోలడం జరిగింది. అయితే కాంట్రాక్టర్ రోడ్డును పూర్తిగా తొవ్వేసి వదిలేయడం జరిగింది. దీంతో రెండు పంచాయతీ ప్రజలు జెసిబి తో త్రవ్విన కంకర రోడ్డు వలన 108, గ్యాస్ బండి గానీ, అంగన్వాడి సరుకులు, ఆ రోడ్డుపై రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా రెండు పంచాయతీ ప్రజలకు రాకపోకలు కూడా చాలా ఇబ్బంది కలిగినది. ఈ విషయమై మండల,జిల్లా అధికారుల దృష్టికి కూడా తీసుకుపోవడం జరిగింది. కానీ ఎలాంటి స్పందన లేదు. ఈరోజు దినమున 25/05/2026 వ తేదీన దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మరియు సిపిఎం పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వెంకటేష్ ఆధ్వర్యంలో ఎగువగూలూరు దళితులు తడుకు హైవే రోడ్డు నందు రోడ్డు సమస్య పైన రాస్తారోకో చేయడంతో పోలీస్ అధికారులు అడ్డుకొనీ, డీఎస్పీ ఆఫీసు వద్దకు తీసుకుపోవడం జరిగింది. డీఎస్పీ విచారించి రోడ్డు సమస్యను పరిష్కరిస్తానని పంచాయతీ రాజ్ ఎస్.ఈ మధుసూదన్ రెడ్డి తో మాట్లాడటం జరిగింది. స్పందించిన ఎస్.ఈ రేపు రోడ్డు పనులు ప్రారంభం చేస్తామని డిఎస్పీ రవికుమార్ కి హామీ ఇవ్వడమైనది. ఆ హామీ ఇవ్వడంతో దళితులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దళితులు జి. దొరస్వామి, టి.మన్నార్, టి.రవి భూపాల్, ఏ.రామయ్య,ఏ.లక్ష్మయ్య,శివన్న తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి మర్రి మాకుల చేను వద్ద వాహనాలు డి కొన్నాయి.



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి రూరల్.

శ్రీకాళహస్తి సమీపంలోని మర్రిమాకుల పల్లె వద్ద సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో ప్రమాదం జరిగింది . రెండు ట్రాన్స్ పోర్ట్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి వేగాన్ని అదుపు చేయలేక ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం ఘటనలో ఓ డ్రైవర్ కు గాయాలు కావడంతో హైవే పారా మెడికల్ సిబ్బంది అక్కడికక్కడే ప్రధమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బాధితుడిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## యర్రావారిపాలెం మండలంలో ఏనుగుల హల్చల్:



ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి :

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని యర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లి, నెరబైలు మడిచెరువు అటవీ ప్రాంత సమీపంలో ఏనుగుల గుంపు తీవ్రంగా సంచరిస్తోంది. అటవీ సమీపంలోని మామిడి తోటలు, టెంకాయ చెట్లు, వరి పంటలను ఏనుగుల గుంపు తొక్కి, తిని పూర్తిగా ధ్వంసం చేసింది.

చేతికందే సమయంలో తీరని నష్టం..

రైతులు మరికొద్ది రోజుల్లో (నేడో, రేపో) మామిడి కాయలను కోసి మండీలకు తరలించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఏనుగులు ఈ దాడికి పాల్పడి కోలుకోలేని నష్టాన్ని మిగిల్చాయి.

నాలుగు నెలలుగా తీవ్ర నష్టం: గడిచిన 4 నెలల కాలంలోనే ఈ ప్రాంతంలో సుమారు 60 శాతం వరకు అన్ని రకాల పంటలను ఏనుగులు పూర్తిగా నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల ఆవేదన: కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు ఇలా ఏనుగుల పాలవుతుంటే తమకు 'చావే శరణం' అంటూ స్థానిక రైతులు తీవ్ర కన్నీరుమున్నీరవుతున్నారు.

శాశ్వత పరిష్కారం కోసం వినతి: రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారం అందిస్తున్నప్పటికీ, అది పెట్టుబడికి కూడా సరిపోవడం లేదని.. అందువల్ల ఏనుగుల గుంపు తమ పొలాల్లోకి రాకుండా అటవీ శాఖ అధికారులు సోలార్ ఫెన్సింగ్ లేదా కందకాల వంటి ప్రత్యామ్నాయ శాశ్వత ఏర్పాట్లు చేసి తమను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

## ల్యాప్టాప్ బ్యాగ్ విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వ్యక్తికి అందజేసిన ఆర్టీసీ కంట్రోలర్ ఆర్.వి.చంద్ర..!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:

నియోజకవర్గం పరిధిలోని, పాకాల మండలం, పాకాల ఆర్టీసీ బస్టాండ్ లో ల్యాప్టాప్ బ్యాగ్,విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వెంకట్ అనే వ్యక్తికి సోమవారం ఉదయం పాకాల ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ ఆర్.వి.చంద్ర అంద జేశారు.ఇతను ఆర్.అండ్.బి శాఖలో డి.ఈ గా పని చేస్తున్నారు.ఇతను తిరుపతి నుండి పాకాల మీదుగా పుంగనూరుకు వెళుతుండగా ఈ సంఘటనచోటుచేసుకుంది. పాకాల ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్ ఆర్.వి.చంద్రకు వెంకట్ కృతజ్ఞతలు తెలియజేశారు.


## సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజా భూమి ప్రతినిధి: సూళ్లూరుపేట.

సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫామ్ నెంబర్ వన్ వద్ద సుమారు 54 ఏళ్ల గల గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో కనిపించాడు . ఆర్పీఎఫ్ సిబ్బంది 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు అతను మృతి చెందినట్లు నిర్ధారించారు . అనంతరం మృతదేహాన్ని మార్చురికి తరలించి సమాచారం గూడూరు జి పి ఆర్ ఎస్ కు అందించారు. మృతుడి వివరాల గుర్తింపు కోసం పోలీసులు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

## కందుకూరు నియోజకవర్గ టిడిపి పరిశీలకులుగా రాష్ట్ర పార్టీ కార్యదర్శి మట్టం.శ్రావణి రెడ్డి.



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి మహానాడు సన్నాహక కార్యక్రమాలు గురించి వివరాలు తెలుసుకున్న మట్టం. శ్రావణి రెడ్డి. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి,నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కి,మా శాసన సభ్యులు డాశ్రీశ్రీ పాశిశీ సునీల్ కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాను.

## సొత్రియం భూములు అమ్మకాన్ని ఆపండి - తాసిల్దార్ అని
# సిపిఐ ఆధ్వర్యంలో గిరిజనులు తాసిల్దార్ ఆఫీస్ ముట్టడి



ప్రజా భూమి ప్రతినిధి: సత్యవేడు..

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలంలోని పాదిరి కుప్పం రెవెన్యూ లోని సొత్రియం భూములను రెవెన్యూ అధికారుల అండదండలతో భూములు అమ్ముతున్నారని అమ్మకాలు ఆపాలని ఈరోజు వరదయ్యపాలెం తాసిల్దార్ ఆఫీస్ ను గిరిజనులు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ముట్టడించడం జరిగిందని ఈ సందర్భంగా సిపిఐ సత్తి వేడు నియోజకవర్గ కార్యదర్శిఏ.చిన్ని రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా గిరిజనులు తమ కాయ కష్టంతో తీర్చుకొని సాగు చేసుకుంటున్న భూములను రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా గిరిజనులను నానా ఇబ్బందులు పాలు చేసి పోలీస్ స్టేషన్లో తప్పులు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేసి ఆ భూములను పథకం ప్రకారం వీఆర్వోగా పనిచేస్తున్న చలపతి గతంలో పనిచేసిన విఆర్వోలు స్థానిక ఇతరులకు రాజకీయ పలుకుబడి కలిగిన వారికి ధనవంతులకు గిరిజనుల భూములు అమ్మకానికి శోధక శక్తిగా నిలిచి లక్షలాది రూపాయలు సంపాదించారని. చిన్ని రాజ్ గిరిజనులు ఆరోపించారు. ఇప్పుడున్న తాసిల్దార్ సుధీర్ రెడ్డిని అనేకసార్లు ధర్నా ఆందోళన పోరాట కార్యక్రమాలు చేసిన తరువాతట్రెంచ్ కొట్టడం జరిగిందని ఆ ట్రెంచ్ ను కొంతమంది రెవెన్యూ అధికారులను లోపర్చుకొని లక్షలాది రూపాయలు చేతులు మారి ఆ ట్రెంచ్ను జెసిబి లతో పూర్తి చేస్తుంటే ఈ విషయాన్ని గిరిజనులు తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్తే మీకేం పని పాట లేదా మాకు చాలా పనులు ఉన్నాయి వీకేఆర్వై కాలనీ ఒకటే కాదు అన్ని గిరిజనులను బెదిరించడం జరుగుతున్నది ఇంత దుర్మార్గంగా వ్యవహరించే తాసిల్దార్లను మేము చూడలేదని గిరిజనులు తీవ్రమైన ఆవేదన చెంది ఆఫీస్ వద్ద ఈరోజు టెంట్ వేసుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయడం జరిగింది . మధ్యాహ్నం సమయంలో కూడా ఆఫీస్ వద్ద భోజనాలు చేసి మాకు న్యాయం చేసే వరకు మేము ఇక్కడి నుంచి కదలమని అక్కడే కూర్చోవడం జరిగింది . అయితే తాసిల్దార్ విఆర్ఓ ఏమాత్రం గిరిజనులు వారి తరపున వచ్చిన సిపిఐ పార్టీ నాయకులు చెప్పిన మాటలు పరిష్కారం చూపకుండా మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని బాధ్యతగా వ్యవహరించకుండా నిర్లక్ష్యంగా మాట్లాడడం చాలా దుర్మార్గమని ప్రజలు ఇస్తున్న పన్నులతో జీతం తీసుకునే అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని పారదర్శకంగా ఉండాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు వరదయ్యపాలెం మండల తహసిల్దార్ ఆఫీసులో జరుగుతున్న అవినీతిపై ఉన్నత అధికారులు ఆరా తీయాలని అక్రమాలను అరికట్టి సొత్రియం భూములను కాపాడాలని మేము సాగు చేసుకుంటున్న భూములు మాకే ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా గిరిజనులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చంద్ర. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ట్రెజరర్ ధనుంజయ శెట్టి మండల నాయకులు ధనుంజయ నాయుడు గిరిజన నాయకులు చెల్లమ్మ వెంకటేశయ్య మారయ్య ఆజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై అప్రమత్తంగా ఉండాలి

**బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలి -ఎంపీ గురుమూర్తిని కలిసిన సత్యవేడు నాయకులకు దిశానిర్దేశం**





ప్రజాభూమి ప్రతినిధి: తిరుపతి

సత్యవేడు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తో కలిసి సోమవారం తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరగబోయే ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ఎంపీ గురుమూర్తి నాయకులకు దిశానిర్దేశం చర్చించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి బూత్ పరిధిలో బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, ఎలాంటి అక్రమ తొలగింపులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానం, ఫారంల దాఖలు, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన తదితర అంశాలపై ఎంపీ గురుమూర్తి నాయకులకు వివరించారు. ప్రతి బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని, ప్రజలకు ఎస్ఐఆర్పై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేకంగా యువ ఓటర్లు, మహిళలు, వృద్ధుల పేర్లు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితా నుంచి తొలగిపోకుండా పార్టీ శ్రేణులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీ గురుమూర్తి పిలుపునిచ్చారు.

# చిల్లకూరు మండలంలో ఎంఎస్ఎమ్ఈ పార్కు శంకుస్థాపన..

**వర్చువల్ గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు, శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు మండలం కడివేడు రెవెన్యూ పరిధిలో పట్రగుంట గ్రామం సమీపంలో, జాతీయ రహదారి పక్కన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎమ్ఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల) పార్కుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా శంకుస్థాపన చేయగా, పట్రగుంట వద్ద జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ.. 10 కోట్ల 50 లక్షల వ్యయంతో 44 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పార్కు ద్వారా దాదాపు వెయ్యి మందికి పైగా నిరుద్యోగులకు ఉపాధి లభించనుందని, ఇక్కడ 45 అంకణాల చొప్పున 145 ప్లాట్లను ఏర్పాటు చేసి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తాయని, అలాగే అర్హులైన బాధితులకు తప్పకుండా పరిహారం అందుతుందని స్పష్టం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ , జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ పి. శ్రీధర్, ఏపీఐఐసి మేనేజర్ బి.ఎల్. ఆచార్యులు, చిల్లకూరు తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఆర్ ఐ పూర్ణచంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షులు దువ్వూరు రాజశేఖరరెడ్డి , ఇంకా పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏర్పేడులో చట్టాన్ని చేతిలోని తీసుకొని వృద్ధురాలి పై దౌర్జన్యం చేసి దుర్భాషా లాడి బంకును తొలగించడం నేరం

**డాక్టర్ గానుగపెంట రమేష్..యువ సమాజ్ నిర్మాన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ -చైర్మన్., నేషనలిస్ట్ జనశక్తి పార్టీ తిరుపతి జిల్లా ఇంచార్జ్**





ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

ఏర్పేడు మండలం వెంకటగిరి రోడ్డు ఆమందూరు పంచాయతీ పరిధిలో గత 20 సంవత్సరాలకు పైగా పంచాయతీ స్థలంలో ఉన్న బంకును తోలగింపు చేసి బాధితురాలు అయిన సరస్వతమ్మ అనే వృద్ధురాలిపై ప్రక్కన ఉన్న సిమెంట్ వ్యాపారి రామ్మోహన్ రెడ్డి దాడి చేసి బెదిరించి గాయ పరిచమే కాకుండా తమ పెట్టుకున్న బంకును పగలకొట్టి నష్టం కలిగించడం చాలా బాధాకరం అని బాధితురాలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ గానుగపెంట రమేష్.. నేషనలిస్ట్ జనశక్తి పార్టీ ఇంచార్జి, యువ సమాజ్ నిర్మాన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఁ చైర్మన్ మాట్లాడుతూ వాళ్ళ కుటుంబానికి ఎలాంటి సమాచారం లేకుండా ఎలాంటి సంబంధిత అధికారులు లేకుండా తన సొంత లాభం కోసం ఆమెను అసహ్య పదజాలంతో తిట్టి వాళ్ళను ఆగవురా పరచడం చట్ట రీత్యా నేరం మొదటగా వాళ్ళ కుటుంబ సభ్యులు ఇంటిదగ్గర లేనప్పుడు ఇలా దాడి చేయడం పద్ధతి కాదని అందరూ ఉన్నప్పుడు సామరస్యం గా చెప్పి మాటలాడి చెయ్యకుండా అధికారులతో ముందస్తు ఇన్ఫర్మేషన్ లేకుండా ఇలా దుర్మార్గంగా చెయ్యడం మూమ్మటికి తప్పు తక్షణమే ఆమెకు జరిగిన అన్యాయానికి తగిన న్యాయం చెయ్యాలని సంబంధిత అధికారులు, నాయకులు తక్షణమే స్పందించి బాధితురాలకి న్యాయం చెయ్యాలని కోరుకుంటున్నాను.. సన్నకారు వ్యాపారస్థులు రోడ్ల పక్కన షెల్టర్ వేసుకుని జీవితము సాగిస్తారు గవర్నమెంట్ ఇంకా వాళ్లకు లోన్స్ కల్పిస్తూ ముందుకు తీసుకువేలతున్నారు ఇలా వాళ్ళు కడుపు కొట్టడం తప్పు తక్షణమే అధికారులు స్పందించి ఆమెకు న్యాయం చేయవల్సిందిగా కోరుకుంటున్నాము.స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దీనిపైన స్పందించి వారికి న్యాయం చెయ్యాలని కోరుకుంటున్నాను.

# ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని జిల్లా ఎస్పీ స్పష్టం

**సమస్యలపై తక్షణ స్పందన సుమారు 85 మంది ఫిర్యాదుదారుల వినతుల పరిశీలన.**



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

త్వరిత పరిష్కారానికి సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఐపీఎస్., ఆదేశాల మేరకు ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఐపీఎస్., స్వయంగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును ఓర్పుతో విని, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఫిర్యాదుదారులకు సమస్య పరిష్కార మార్గాలను వివరించి, వారికి ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో సుమారు 85 మంది ఫిర్యాదుదారులు వివిధ అంశాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులకు వెంటనే పంపించి, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆధనపు ఎస్పీలు రావిమనోహరచారి (శాంతి భద్రతలు) శ్రీనివాలుసులు ( క్రైమ్స్ )పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



# ఉన్నత చదువులు చదివి.. విలాసాలు, దురలవాట్ల కోసం చైన్ స్నాచర్లుగా మారిన ముగ్గురు అంతర్జిల్లా నిందితుల అరెస్ట్

- రూ.25 లక్షల విలువ చేసే సుమారు 130 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం.
- తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 9 చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడి.
- దురలవాట్లు, ఈజీ మనీ కోసం చైన్ స్నాచర్లుగా మారిన ఉన్నత విద్యావంతులు.





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి. తిరుపతి నగరంతో పాటు నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల అంతర్జిల్లా దొంగల ముఠాను తిరుపతి సీసీఎస్ మరియు వెస్ట్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఆర్ల శ్రీనివాసులు పత్రికాముఖంగా వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు ఇటీవల తిరుపతి లో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించేందుకు అడిషనల్ ఎస్పీ క్రైమ్స్ ఆర్ల శ్రీనివాసులు నేతృత్వంలో, డీఎస్పీ తిరుపతి ఈస్ట్ ఎం. భక్తవత్సలం పర్యవేక్షణలో, వెస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి. రామకృష్ణ మరియు క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎన్. శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ క్రమంలో మే 25వ తేదీ ఉదయం నమ్మకమైన సమాచారం మేరకు తిరుపతి అలిపిరి -- చెర్లోపల్లి రోడ్డులోని సైన్స్ సెంటర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, పలు చైన్ స్నాచింగ్ కేసుల్లో వారి ప్రమేయం బయటపడింది.

**– నిందితుల వివరాలు :**

శీలం నాగార్జున రెడ్డి (28), తూర్పు ఎర్రబల్లి గ్రామం, నెల్లూరు జిల్లా. బెంగళూరులోని ఆర్ ఏ ఐ టెక్నాలజీ యూనివర్సిటీ నుండి అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తి చేశాడు.

నల్లగొండ వెంకట మురళి (26), నల్లగొండ గ్రామం, వింజమూరు మండలం, నెల్లూరు జిల్లా. బీకాం కంప్యూటర్స్ గ్రాడ్యుయేట్.

లింగాలదిన్నె విష్ణువర్ధన్ రెడ్డి (28), పప్పుల వీధి, స్టోన్ హౌస్ పేట, నెల్లూరు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చదివి, బెంగళూరులోని బైజూస్ కంపెనీలో సిస్టమ్ ఇంజనీర్‌గా పనిచేశాడు.

**– స్వాధీనం చేసుకున్నవి :**

రూ.25 లక్షల విలువ చేసే సుమారు 130 గ్రాముల బంగారు ఆభరణాలు
యమహా ఎఫ్ జెడ్ మోటార్ సైకిల్ ( ఏపీ-26- బి ఎన్ -2618)
హోండా ఆక్టివా స్కూటీ ( ఏపీ-39- ఎఫ్ ఎక్స్ -8173)
మొబైల్ ఫోన్లు
హెల్మెట్లు, క్యాపులు, మాస్కులు.

**– నేరాల శైలి :**

నిందితులు ముగ్గురూ సన్నిహిత మిత్రులని, ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ వంటి దురలవాట్లకు బానిసలై ఉద్యోగాలు కోల్పోయి విలాసవంతమైన జీవనానికి అలవాటు పడటంతో ఈజీ మనీ కోసం చైన్ స్నాచర్లుగా మారినట్లు విచారణలో వెల్లడైంది. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో చైన్ స్నాచింగ్ ఎలా చేయాలి, పోలీసుల నుంచి ఎలా తప్పించుకోవాలి అనే అంశాలపై వీడియోలు వీక్షించి నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. బైక్‌ల నెంబర్ ప్లేట్లు తొలగించి, హెల్మెట్లు, మాస్కులు ధరించి తెల్లవారుజామున ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవారని విచారణలో తేలింది.

**– ఒప్పుకున్న నేరాలు :**

విచారణలో నిందితులు తిరుపతి, నెల్లూరు పరిసర ప్రాంతాల్లో మొత్తం 9 చైన్ స్నాచింగ్ కేసులకు పాల్పడినట్లు అంగీకరించారు.

**– చైన్ స్నాచింగ్ ఘటనల వివరాలు :**

నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంజీనగర్‌లో మహిళ మెడలోని బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటన.

నెల్లూరు వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏఎన్ఆర్ ఫంక్షన్ హాల్ జంక్షన్ వద్ద వృద్ధురాలి మెడలోని బంగారు చైన్ దొంగిలించిన ఘటన.

నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హరినాథపురంలో మహిళ ఇంటి ముందు వాకిలి కడుగుతుండగా బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటన

తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో బజారు వీధిలో ఆటో దిగిన మహిళ మెడలోని సుమారు 40 గ్రాముల బంగారు చైన్ తెంపిన ఘటన.

తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత రేణిగుంట రోడ్డులో స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో నుంచి సుమారు 10 గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లిన ఘటన.

**– తిరుపతిలో మరో చైన్ స్నాచింగ్ కుట్ర భగ్నం :**

దొంగిలించిన బంగారు ఆభరణాలను తిరుపతి లో విక్రయించి తిరిగి విలాసాల కోసం డబ్బు సమకూర్చుకునేందుకు మరో చైన్ స్నాచింగ్‌కు కుట్ర పన్నుతున్న సమయంలో పోలీసులు సకాలంలో స్పందించి నిందితులను అరెస్ట్ చేసి కుట్రను భగ్నం చేశారు.

**– అభినందించిన జిల్లా ఎస్పీ :**

ఈ కేసును అత్యంత వేగంగా, చాకచక్యంగా ఛేదించిన అడిషనల్ ఎస్పీ క్రైమ్స్ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ తిరుపతి ఈస్ట్ ఎం. భక్తవత్సలం నేతృత్వంలోని తిరుపతి వెస్ట్, క్రైమ్ పోలీస్ అధికారులను, ప్రత్యేక బృందాల సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

# వైదేహి కళ్యాణమండపంలో జాతీయస్థాయి కరాటే పోటీలు

### కరాటే విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు.





ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలోని వైదేహి కళ్యాణమండపంలో ఆదివారం రాత్రి జీకేఎంఐ ఓపెన్ ఛాంపియన్షిప్ జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు.సత్యవేడు కరాటే అకాడమీ ఆర్గనైజర్ భువనేశ్వర్ ఆధ్వర్యంలో టెక్నికల్ డైరెక్టర్ విల్సన్ రాబర్ట్ మిల్లర్ పర్యవేక్షణలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,తమిళనాడు రాష్ట్రాల నుంచి 400 మంది కరాటే వీరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా బిజెపి మండల అధ్యక్షుడు బాలాజీ, ఏఐఏపీఎల్ఎఫ్ మండల అధ్యక్షులు రాజశేఖర్,బిజెపి జనరల్ సెక్రెటరీ నరేంద్రబాబు,వైయస్ఆర్సీపీ నాయకుడు బెల్ట్ రమేష తదితరులు హాజరయ్యారు. కరాటే పోటీల్లో భాగంగా కరాటే కట్ట విభాగంలో 256 మంది,కరాటే కుముతెలో 156 మంది,టీంకట్టలో కుప్పం,తిరుపతి,సత్యవేడు,తమిళనాడు ఆరని ప్రాంతాల నుంచి 40 మంది బృందం పోటీపడ్డారు. ఈ నేపథ్యంలో కరాటే కట్ట విభాగంలో మొదటి స్థానంలో 64 మంది,రెండు మూడు,నాలుగవ సార్లు కూడా 64 మంది చొప్పున విజేతలుగా నిలిచారు.అలాగే కరాటే కుముతెలో ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాల్లో 39 మంది చొప్పున పోటీలలో విజేతగా నిలిచారు. టీంకట్ట కరాటే బాలికల విభాగ పోటీల్లో విజేతలైన జీవీ లక్ష్మిక, ప్రియ,నజియ భానుకు,బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన ఆరిఫ్, జస్వంత్,మోహిత్ తదితరులకు నాలుగు వేల రూపాయలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను బిజెపి మండల అధ్యక్షులు బాలాజీ అందించారు.వైఎస్ఆర్సీపి నాయకుడు బెల్ట్ రమేష్ కరాటే విజేతలకు నలుగురికి వెయ్యి రూపాయలు చొప్పున 4000 రూపాయలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలందరికీ 75 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైన కరాటే పోటీలు రాత్రి వరకు కొనసాగింది.

# సింహవాహన సేవలో దేదీప్యమానమైన శ్రీ గోవిందరాజస్వామి

### గోవింద నామస్మరణలతో మారుమోగిన బ్రహ్మోత్సవ వైభవం -రాత్రి ముత్యాల చల్లదనంలో భక్తులను ఆశీర్వదించనున్న గోవిందుడు







ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన సోమవారం ఉదయం శ్రీ గోవిందరాజస్వామివారు సింహవాహనంపై అభయహస్తంతో భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరిగిన ఈ దివ్య వాహనసేవలో మంగళవాయిద్యాలు, కోలాటాలు, వేదఘోషలు, గోవిందనామస్మరణలతో తిరుపతి మాడవీధులు ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడాయి. వాహనం ముందు రీవిగా సాగిన గజరాజులు సేవకు మరింత మహోత్సవ శోభను చేకూర్చాయి. అడుగడుగునా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. మృగరాజైన సింహం గాంభీర్యానికి, ధైర్యానికి, శక్తికి ప్రతీకగా భావించబడుతుంది. యోగశాస్త్రంలో సింహం వేగశక్తికి, ఆత్మవిశ్వాసానికి సంకేతం. భక్తునిలో సింహబలంలాంటి అచంచల భక్తి కలిగినప్పుడు భగవంతుని కృప ప్రసాదమవుతుందని ఆధ్యాత్మిక వాంగ్మయం తెలియజేస్తోంది. అనంతతేజోమూర్తి అయిన శ్రీనివాసుడు రాక్షసుల హృదయాల్లో సింహస్వరూపుడిగా ప్రత్యక్షమవుతాడని పురాణాలు కీర్తిస్తున్నాయి. అందుకే ధీరోదాత్తుడైన శ్రీహరి సింహవాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిస్తాడు. అనంతరం ఉదయం 10 నుండి 11 గంటల వరకు స్వామివారు, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు సమర్పించారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరగనుండగా, రాత్రి 7 నుండి 9 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై శ్రీ గోవిందరాజస్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రాత్రికి ముత్యపు పందిరి వాహనంపై స్వామివారు : నిత్యాలంకార ప్రియుడైన శ్రీనివాసుడు ప్రతిరోజూ విభిన్న వస్త్రాభరణాలలో దేదీప్యమానంగా వెలుగొందుతుంటాడు. ముత్యపుపందిరిపై వెలసే స్వామివారి రూపం భక్తులకు మనోల్లాసాన్ని, ఆధ్యాత్మిక ప్రశాంతతను ప్రసాదిస్తుంది. జ్యోతిషశాస్త్రంలో చంద్రునికి ప్రతీకగా భావించే ముత్యాలు చల్లదనానికి సంకేతం. సముద్రగర్భం ప్రసాదించిన అమూల్య రత్నమైన ముత్యాల కింద వెలసిన శ్రీనివాసుని దర్శనం భక్తుల తాపత్రయాలను తొలగించి, జీవితాల్లో శాంతి, చల్లదనాన్ని నింపుతుందనే విశ్వాసం భక్తుల్లో నెలకొంది. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఏవీఎస్వో ఆర్. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముదిగుబ్బలో మహానాడు సన్నాహక సమావేశం


### కార్యకర్తలంతా తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలి: టీడీపీ నాయకులు



ప్రజాభూమి, ముదిగుబ్బ :

తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కట్టుబడి పనిచేయాలని ముదిగుబ్బ మండల టీడీపీ నాయకులు సోమవారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... మహానాడు పార్టీకి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, దీనిని పండుగ వాతావరణంలో నిర్వహించి పార్టీ బలం, ఐక్యతను చాటాలని తుమ్మల మనోహర్ కోరారు. మహానాడు కార్యక్రమం సజావుగా జరిగేందుకు మండల పరిధిలో రెండు క్లస్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యకర్తలకు రాకపోకలు, సమావేశ నిర్వహణ, వేదికల వద్ద సౌకర్యాలు, పార్కింగ్, తాగునీరు వంటి ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. మండల కేంద్రంలోని బాలాజీ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన మహానాడు వేదికకు ఒక క్లస్టర్ కేటాయించినట్లు తెలిపారు. ఈ క్లస్టర్ పరిధిలో చిన్నకోట్ల, కొడవండ్లపల్లి, భూదనాంపల్లి, ఈదులపల్లి, మర్తాడు, దొరిగల్లు, ఏబీపల్లి తండా, గాండ్లవారిపల్లి, సంకేపల్లి, ఉప్పలపాడు, పిసిరేవు, ముదిగుబ్బ గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొననున్నట్లు చెప్పారు. గ్రామాల వారీగా నాయకులు బాధ్యతలు తీసుకొని కార్యకర్తలను సమీకరిస్తున్నట్లు వివరించారు. అలాగే రెండో క్లస్టర్ సమావేశం మలకవేముల క్రాస్‌లోని రాధాకృష్ణ స్కూల్ వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్లస్టర్ పరిధిలో ముక్తాపురం, జేకేపల్లి, గుంజేపల్లి, గుడ్డంపల్లి తండా, పోడరాళ్లపల్లి, మంగళమడక, సానేవారిపల్లి, ఆర్ఎస్ తాండా, వడ్డికింద తాండా, కొండగట్టుపల్లి, తప్పేటవారిపల్లి, మల్లేపల్లి గ్రామాల కార్యకర్తలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకొని భారీగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టీడీపీ నాయకుడు రమేష్ బాబు, తుమ్మల మనోహర్, ప్రభాకర్ మాట్లాడుతూ మహానాడు పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించే కీలక వేదిక అని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ పట్ల నిబద్ధతతో పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగేలా చూడాలని, యువత, మహిళలు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, గుత్తా నాయుడు, బాబి, ఆర్డీటీ నరసింహులు, జయప్రకాశ్, రామచంద్ర రెడ్డి, కాటమయ్య, గాండ్లవారిపల్లి బాలరాజు, డిష్ రామాంజనేయులు, నంద, గ్రామీణ ప్రాంతా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ అమరలింగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన మంగళ గౌరి సమేత అమర లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు జరిపించి, రంగురంగుల పూలమాలలతో నయనమనోహరంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో చుట్టుప్రక్కల గ్రామాల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నిత్యాన్నదాన పథకానికి రవితేజ దంపతులు లక్ష రూపాయలు విరాళం అందజేత



ప్రజాభూమి ప్రతినిధి:శ్రీకాళహస్తి టౌన్

హైదరాబాద్ వాస్తవ్యులు పసుపులేటి రవితేజ -భ్రమరీ దంపతులు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానముచే నిర్వహించబడుతున్న నిత్యాన్నదాన పథకమునకు రూ.1,00,000/- లు ఆలయ అధికారులకు విరాళంగా అందజేయడమైనది. ఆలయ అధికారులు వారికి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం ఏర్పాటుచేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు కార్యక్రమంలో ప్రోటోకాల్ మోహన్ ఏఈఓ. ఏపీ పి ఆర్ ఓ రవి అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యం

### -చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో మాల నేతలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మాలలందరూ ఐకమత్యంగా ముందుకు వెళ్ళినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని మాల నేతలు పేర్కొన్నారు. హిందూపురం నుండి ఇచ్చాపురం వరకు చేపట్టిన మాలల ఐక్యత చైతన్య యాత్రపై సోమవారం రాష్ట్ర మాల సంక్షేమ ఐక్యవేదిక అధ్యక్షులు కోట్ల గంగాధరప్ప ఆధ్వర్యంలో సాయి ఫంక్షన్ హాలులో మాల మహాసభ, మాల మహానాడు, మాల సంఘాల జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘాల ప్రతినిధులచే రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమాజ ఐక్యత, హక్కుల సాధన, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అనంతరం మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకట్రావు మాట్లాడుతూ, మాల సమాజం ఐక్యంగా ఉంటేనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మానవ హక్కుల కమిషన్ చైర్మన్, డీవీఎంసీ సభ్యులు డాక్టర్ చెరుకూరి గంగులయ్య, సత్యసాయి జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఎమ్.ఎన్. మూర్తి, హిందూపురం విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నందకుమార్, విశ్రాంత తహసిల్దార్ శివయ్య, గౌరవ అధ్యక్షులు బి.ఆర్. పాండురంగమూర్తి, మేవా ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, మాల మహాసభ జిల్లా అధ్యక్షులు నాగరాజు, రాయలసీమ కన్వీనర్ సుధాకర్, టీ.ఎన్. మూర్తి, పీఎం శంకర్, అనంతపురం జిల్లా మాల మహానాడు అధ్యక్షులు సుగమంచి శ్రీనివాసులు, జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షులు కోట్ల మల్లికార్జున, కోశాధికారి కురకుంట గోవిందు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామాంజనేయులు, జిల్లా కార్యక్రమాల నిర్వహణ సమన్వయకర్త నాగేంద్ర, రిటైర్డ్ కండక్టర్ నరసంబూది నరసింహమూర్తి, గుడిబండ మండలం మాల మహానాడు అధ్యక్షులు ఎమ్మార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఎండి రమేష్ వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన :మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు

శ్రీకాళహస్తి నియోజకవర్గం, తొట్టంబేడు మండలం, శివనాథ పురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ లీడర్ దామోదరం కుమారుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడు ఎం.డి రమేష్ ఆకస్మిక మృతి చెందారు. కావున నేడు వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు,కొగిలి సుబ్రమణ్యం,మాజీ సర్పంచ్ రాజప్రకాష్,గంధం శ్రీనివాసులు, గిరి,సుబ్బారెడ్డి,గిరి,చింతా రాజేంద్ర,శ్రీవారి సురేష్,మున్నా రాయల్,కంట ఉదయ్ కుమార్,పటాన్ ఫరీద్,ఆర్కార్డు శంకర్ తదితరులు ఉన్నారు.

## కడూరు సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వరదయ్య పాలెం మండలం పంటలు పండించి భారతదేశానికి వెన్నెముఖగా నిలిచే రైతన్నలకు అండగా నిలుస్తూ సబ్సిడీ అందించే మంచి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. సారథ్యశీలో వరదయ్య పాలెం రైతు అన్నలకు యూరియా అందిస్తున్న కడూరు సొసైటీ చైర్మన్ ఆణిముత్యం. నంద కిషోర్ రెడ్డి, వ్యవసాయ అధికారిణి గౌరీ, సొసైటీ డైరెక్టర్లు రవి రెడ్డి, రమేష్ చేతుల మీదుగాసుమారు 450 బస్తాలు పంపిణీ చేయడం అంతే కాకుండ రైతులకు సకాలంలో వ్యవసాయానికి కావలసిన ఋణ సహాయం కూడా సొసైటీ అందిస్తుంది కనుక రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ నంద కిషోర్ రెడ్డి తెలిపారు ..

## బి ఎన్ కండ్రిగ పరిధిలో రోడ్డు ప్రమాదం

### -: యువకుడికి కుడి కాలు ఫ్రాక్చర్



ప్రజా భూమి ప్రతినిధి బి ఎన్ కండ్రిగ.

బి ఎన్ కండ్రిగ మండల పరిధిలోని కాటూరు సమీపంలో గల పద్మావతిపురం గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానమానంబేడు గ్రామానికి చెందిన జ.బాలకృష్ణ (వయస్సు 30 సం//లు, తండ్రి: సి .గురవయ్య) తన స్కూటీపై బి ఎన్ కండ్రిగ నుండి శ్రీకాళహస్తి వైపు వెళ్తున్నారు. పద్మావతిపురం గ్రామం వద్దకు చేరుకోగానే, ఎదురుగా శ్రీకాళహస్తి నుండి గుమ్మడిపూడి వైపు వస్తున్న టిఎన్ 18 సి ఎక్స్ 1130 నంబరు గల లగేజ్ ఈచర్ వాహనం డ్రైవర్ ఆర్..నటరాజన్ (వయస్సు 55 సం//లు, తండ్రి: రాఘవన్, నివాసం: తమిళనాడు, తిరువల్లూరు జిల్లా) తన వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బాలకృష్ణ స్కూటీని బలంగా ఢీకొట్టాడు.ఈ ప్రమాదంలో బాలకృష్ణ కుడి మోకాలి కింద భాగం తీవ్రంగా విరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై బి ఎన్ కండ్రిగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బందరు పారిశ్రామిక ప్రగతికి శంకుస్థాపన

**మచిలీపట్నంలో ఎంఎస్ఎంఈ పార్కుతో కొత్త శకానికి నాంది**
**యువతకు ఉపాధి, బందరు అభివృద్ధికి ఇది కీలక అడుగు :మంత్రి కొల్లు రవీంద్ర**
**2026 డిసెంబర్ లేదా 2027 జనవరి నాటికి బందరు పోర్టు ప్రారంభమే లక్ష్యం**
**కౌశల్యం యాప్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం/రూరల్ ప్రజా భూమి ప్రతినిధి

మచిలీపట్నం పారిశ్రామిక రూపురేఖలను మార్చేలా, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు పడింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం మచిలీ పట్నం పోర్టుకు సమీపంలోని కరగ్రహారంలో రూపుదిద్దుకోనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, బండి రామకృష్ణ తో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నంలో కొత్త పారిశ్రామిక శకానికి నాంది పలుకుతున్నామని మంత్రి ప్రకటించారు.21 ఎకరాలు.. 82 పారిశ్రామిక ప్లాట్లుఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టుకు సమీపంలో సుమారు 20 నుంచి 21 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఇందులో దాదాపు 82 పారిశ్రామిక ప్లాట్లను అభివృద్ధి చేయనున్నారు. ఒక్కో ప్లాట్ 600 నుంచి 1000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది.పార్కుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ఎంఎస్ఎంఈ శాఖ ద్వారా యుద్ధప్రాతిపదికన కల్పిస్తామని స్పష్టం చేశారు.పోతేపల్లి ఆటోనగర్, గోల్డ్ కవరింగ్ ఇమిటేషన్ జ్యువెలరీ పార్కుల తరహాలోనే ఈ కొత్త పార్కు కూడా వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ ఈ ప్రాంత తలరాతను మారుస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామిక వేత్తలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.ముందే పారిశ్రామికీకరణ.. రానున్న షిప్ బిల్డింగ్ కంపెనీలు!2014-19 కాలంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూసేకరణ కోసం రూ.200 కోట్లు కేటాయించడం వల్లే బందరు పోర్టు పనులు వేగవంతం అయ్యాయి. 2026 డిసెంబర్ లేదా 2027 జనవరి నాటికి పోర్టును ప్రారంభించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉంది.

పోర్టు ప్రారం భానికి ముందే పరిసర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. మం త్రి కొల్లు రవీంద్ర రాష్ట్రవ్యాప్తంగా 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని, మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి తెలిపారు. ఇప్పటికే మూడు ప్రధాన కంపెనీలు ముందుకు వచ్చాయని, త్వరలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడిం చారు. అక్రమ తవ్వకా లపై ఉక్కుపాదంఅనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే యంత్రాలు, ట్రాక్టర్లను సీజ్ చేయడమే కాకుండా, సహకరించే అధికారులపై కూడా చర్యలు ఉంటాయన్నారు. చట్టబ ద్ధంగా అనుమతులు తీసుకుని పరిశ్రమలు ఏర్పా టు చేసుకోవాలని సూచించారు.2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం: కలెక్టర్ డీకే బాలాజీ ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పరిశ్రమలు రావడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, స్థానిక యువతకు ఉపాధితో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు.

త్వరలోనే ప్లాట్ల కేటాయింపు: శంకుస్థాపన అనంతరం లేఅవుట్ అభివృద్ధిని వేగవంతం చేసి, త్వరగా పరిశ్రమలు స్థాపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో మరిన్ని పరిశ్రమల స్థాపనకు సర్వే చేసి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపా రు. 'కౌశల్యం' కార్యక్రమాన్ని వాడుకోవాలి: యువత ఉద్యోగ అవకాశాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'కౌశల్యం' యాప్/కార్యక్రమంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నైపుణ్య పరీక్షల ద్వారా ఎంపికైన వారికి విజయవాడలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మచిలీపట్నం మహాదశ ప్రారంభమైంది: బండి రామకృష్ణజిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, పోర్టు, రైల్వే లైన్, సమీప ఎయిర్‌పోర్ట్ వంటి వసతులతో బందరు వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.

ఉద్యోగాల కోసం తిరిగే యువతే రేపు పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదుగుతారని ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.హాజరైన ప్రముఖులు: ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దీవెన్, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ,మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు లంకె శేషగిరిరావు, తలారి సోమశేఖర్, తిరుమల రావు, కే సుశీల, కాగిత గోపాలరావు మరియు స్థానిక గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలి

అవనిగడ్డ / ఘంటసాల ప్రజాభూమి ప్రతినిధి

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ తోట కనకదుర్గ, టిడిపి అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు సూచించారు.సోమవారం ఘంటసాల మండలంలోని కొడాలి రైతు సేవా కేంద్రంలో జీలుగ, జనుము, పిల్లి పెసర, పచ్చి రొట్ట విత్తనాలను 50% సబ్సిడీపై రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం కావలసినంత పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేస్తుందని రైతులు రైతు సేవ కేంద్రాలను సంప్రదించాలన్నారు ఇప్పటికే ఘంటసాల మండలానికి 150 క్వింటాలు జీలుగా, 75 క్వింటాలు జనుము, 79 క్వింటాలు పిల్లి పెసర, ఏపీ సీడ్స్ వాళ్లు ఆర్ఎస్కేలకు సరఫరా చేసినట్లు తెలిపారు.ఏడిఏ ఎస్.శ్యామల, ఏవో డి.అనూష, జనసేన పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్, టీడీపీ నేత కంఠమనేని రాజగోపాల్, కొడాలి విఏఏ జె.ఎన్.చక్రవర్తి, చిన్నకళ్ళేపల్లి వీఏఏ కుమార్ సోమేశ్వర్, చిట్టూర్పు విఏఏ కే.సుబ్రహ్మణ్యేశ్వరి, కొడాలి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## డా. అంబెడ్కర్ నేషనల్ మెరిట్ అవార్డు కు సెలెక్ట్ అయిన విజయ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని

అవనిగడ్డ / చల్లపల్లి ప్రజాభూమి ప్రతినిధి




2023-2024.వ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాలలో CEC. 2వ సంవత్సరం లో అత్యధిక మార్కులు సాధించిన విజయ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని ముదునూరి సహస్ర, తండ్రి. శ్రీనివాస రావు, కొత్తమాజేరు విద్యార్థినికి డా. అంబెడ్కర్ నేషనల్ మెరిట్ అవార్డు స్కీం ఫర్ మెరిటోరియస్ అఫ్ సీనియర్ ఇంటర్మీడియట్ - 2024 కు ఎంపిక అయినది అని తెలియచేయుటకు ఏంతో సంతోషిస్తున్నాము. ఈ అవార్డు కు గాను విద్యార్థిని ముదునూరి సహస్త్రకు రూ. 20,000/- ల నగదు బహుమతిని ఇవ్వటం జరుగుతుంది. ఈ సందర్భంగ విద్యార్థిని ని మరియు తన తల్లితండ్రులను కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్ గారు మరియు ఉపాధ్యాయిని ఉపధ్యాయులు అభినందించారు.

## మహానాడు ఏర్పాట్లపై తోటమాల తెలుగుదేశం పార్టీ ఆఫీసులో సభ నిర్వహించిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్

ప్రజాభూమి పెడన



మహానాడు ఏర్పాట్లపై పెడన తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల, టౌన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలతో సన్నాహక సమావేశంలో పెడన నియోజవర్గ పరిశీలకులు, స్టేట్ సెక్రటరీ షేక్ ఆషా తో కలిసి పాల్గున్న పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుమేరకు.. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ సారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించుకుంటున్నాం. మహానాడుకు భారీ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు పాల్గొనేలా చూడాలని, వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్రంగా చర్చించడం జరిగింది.

## ఆర్థిక సహాయం అందజేస్తున్న బుద్దా వెంకన్న మిత్ర బృందం

దర్శకరత్న దాసరి మిత్రుడుకి 25వేలు ఆర్థిక సహాయం



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ

పాయకాపురంతెలుగు సినీ దర్శకరత్న దాసరి నారాయణరావుకి మిత్రులుబుద్దావెంకన్న,శనగశెట్టి సుబ్బారావులు.వారిలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని బావజీపేటలోని దర్శకరత్న దాసరి నారాయణరావుకి మిత్రులు, రాధా రంగా మిత్ర మండలి సభ్యుడు శనగశెట్టి సుబ్బారావు( కండక్టర్ సుబ్బారావు) తన ఆర్థిక పరిస్థితి నిమిత్తం బుద్దా వెంకన్న మిత్ర బృందం ఆధ్వర్యంలో 25వేలు రూపాయిల నగదును ఆర్థిక సహాయంగాఅందజేశారు.శనగశెట్టి సుబ్బారావు నివాసం ఉంటున్న ఇంటికి బుద్దా వెంకన్న మిత్ర బృందం కళ్ళే నాగేశ్వర రావు,రాజనాల మాణిక్యాలరావు, కొప్పుల వెంకట్, చందన సురేష్(మామ),యాసం చిట్టిబాబులు సోమవారం వెళ్లి అతని యోగ క్షేమలు అడిగి తెలుసుకుని ఇరవై ఐదు వేల రూపాయల నగదును అందజేశారు.నరాలకు సంబంధించిన వ్యాధి ద్వారా పక్షవాతం వచ్చి మంచంపై ఉన్న సుబ్బారావు యొక్క ఆర్థిక స్థితికి విని చలించిన బుద్దా వెంకన్న తన మిత్ర బృందంతో ఇరవై ఐదువేల రూపాయల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

# కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు' నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**గోదావరిలో కలిసే కాలుష్య జలాలపై సమగ్ర ఆడిట్ చేపట్టాలి**
**ఆంధ్ర పేపర్ మిల్స్ వ్యర్థజలాల నిర్వహణకు వేగంగా ప్రత్యామ్నాయం అవసరం**
**శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థ జలాల నిర్వహణ జరగాలి**
**గోదావరి పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి తీర కాలుష్యాన్ని, పుష్కర పనులను స్వయంగా పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

రాజమహేంద్రవరం ప్రజాభూమి ప్రతినిధి

'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయాలి అని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమ హేంద్రవరం పర్యటనలో భాగంగా సోమ వారం ఉదయం 6 గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటి లింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయా ణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాల ని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సంద ర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాల ను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యా దులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి. గోదావరి పుష్కరాలకు ఖర్చు చేసే ప్రతి పైసాను ప్రజలకు ఉపయోగపడే, గోదావరి నది తీరాన్ని కాపాడే మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మొదట కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరగాలి.. తర్వాత దానిని ఎలా అధిగమించాలి



అనే అంశాల పట్ల దృష్టి సారించవచ్చు. కేవలం లెక్కలతో సరిపెట్టకుండా పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తో ముందు కు వెళ్దాం. కేంద్ర జల శక్తి ద్వారా ఎన్.ఆర్. సి. పి. నిధులు రూ. 416 కోట్లలో రూ. 95 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఈ నిధులతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాలి. పూర్తి స్థాయి లో మురుగు లేకుండా జలాలను గోదావరిలోకి విడిచిపెట్టి బాధ్యతను తీసుకోవాల"ని ఆదేశిం చారు. పేపర్ మిల్ కాలుష్యంపై ఆరాఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య జలాలు గోదావరిలోకి విడుదల మీద ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య నుంచి వివరాలు అడిగారు. ప్రస్తుతం పేపర్ మిల్లు ద్వారా బయటకు వచ్చే వ్యర్థాలను దూరంగా లంకల్లో విడిచి పెడుతున్నారని, దీనికి ప్రత్యామ్నాయంగా ఆ కంపెనీ మరో ప్రాంతంలో శుద్ధి చేసేందుకు ఆలోచిస్తుందని ఆయన తెలియజేశారు. ప్రత్యా మ్నాయ పనులు వేగంగా జరిగేలా చూడాలని, అప్పటివరకు మరో శుద్ధి ప్లాంట్ నిర్మించుకునేలా యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని ఉప ముఖ్య మంత్రి దిశానిర్దేశం చేశారు.





ఆసాంతం పరిశీలిస్తూ... బోటులో ప్రయాణి స్తున్న దగ్గర నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు గోదావరి కాలుష్య నివారణకు తీసుకోబోతున్న చర్యలను పవన్ కళ్యాణ్ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యం గా ప్రత్యక్షంగా ట్రీట్మెంట్ ప్లాంట్ వద్దకు వెళ్లి వేరు చేస్తున్న వ్యర్థాలను సైతం చూశారు. ఆ వ్యర్థాలను ఏం చేస్తారని అడిగి తెలుసుకున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి ప్రస్తుతం ఎలాంటి శాస్త్రీయ పద్ధతి ఉపయోగిస్తున్నారని వివరాలు అడిగారు. నూతన విధానాలు వస్తున్నా యని దానికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు అప్డేట్ కావాలని అధికారులు సూచించారు. అక్కడి నుంచి నేరుగా పుష్కరాల పనుల సమీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి పవన్ కళ్యాణ్ చేరుకున్నారు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ తోపాటు మం త్రులు నాదెండ్ల మనోహర్ , కందుల దుర్గేష్ , శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ , ఎమ్మెల్సీ సోము వీర్రాజు , ఎమ్మెల్యే లు ఆదిరెడ్డి వాసు , గోరంట్ల బుచ్చయ్య చౌదరి , బత్తుల బలరా మకృష్ణ , నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పోలీసు హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ , అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే , జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి , ఎస్పీ నరసింహ కిషోర్ , రాజమండ్రి నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా , తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

# రైతాంగ అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కొల్లు రవీంద్ర

**కూటమి ప్రభుత్వంలో 24 గంటల్లోనే ధాన్యం డబ్బుల జమ**
**సాగునీరు, డ్రైనేజీల మరమ్మతులకు భారీగా నిధుల మంజూరు**
**చిట్టిపాలెంలో కాలువ పూడికతీత పనులను బండి రామకృష్ణ తో కలిసి ప్రారంభించిన మంత్రి**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలను సక్రమంగా నడిపిస్తూ రోడ్ల అభివృద్ధి, సాగునీటి సదుపాయాల మెరుగుదల వంటి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం ఉదయం మచిలీ పట్నం మండలం అరిసెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చిట్టిపాలెం గ్రామంలో కాలువ పూడికతీ త పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడు తూ.. రైతాంగానికి అవసరమైన సాగునీటి వ్యవస్థలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంత్రివర్గ ఆమోదంతో 'ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్' కింద కాలువల మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం భారీగా నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఎండాకాలంలోనే కాలువల పనులను పూర్తి చేసి, సాగునీరు విడుదల చేసే సమయానికి సిద్ధంగా ఉంచేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. రూ.25 కోట్ల కేటాయింపులు.. లెక్కలివే!బందరు పరిధిలో మొత్తం రూ.25 కోట్లలో భాగంగా ఇరిగేషన్ పనుల కోసం రూ.5 కోట్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. నిధుల వివరాలను ఆయన ఇలా వివరించారు:సాగునీటి, మురుగునీటి కాలువల మరమ్మతులకు: రూ.1 కోటి 75 లక్షలుడ్రైనేజీల మరమ్మతులకు: రూ.1 కోటి 75 లక్షలు బందరు సెక్షన్ పరిధిలో (17 పనులు): రూ.99.36 లక్షలునైన్త్ ఛానల్ పరిధిలో (11 పనులు): రూ.75 లక్షలుమురుగునీటి కాలువల (32 పనులు): రూ.1 కోటి 75 లక్షలుజొన్నలవారి మోడి సైఫన్‌కు: రూ.1 కోటిసాధారణ మరమ్మతులకు: రూ.1 కోటి 50 లక్షలుడ్రైనేజ్ అవుట్ ఫాల్ స్లూయిస్ పనులకు (సముద్రపు నీరు రాకుండా): రూ.1 కోటిలంకపల్లి డ్రైన్ తవ్వకానికి: రూ.20 లక్షలుస్ట్రక్చర్ల మరమ్మతులకు: రూ.1 కోటి 30 లక్షలుఅరిసేపల్లి కాలువ పనులకు: రూ.6 లక్షలుఈ నిధులతో తాళ్లపాలెం డ్రైన్, శివగంగ డ్రైన్, పోతిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో అవసరాలను గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించినట్లు మంత్రి వివరించారు.24 గంటల్లోనే ధాన్యం డబ్బులు..గత ప్రభుత్వ హయాంలో ధాన్యం డబ్బుల కోసం రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం మన కూటమి ప్రభుత్వంలో పంట కోత అనంతరం కేవలం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం చెల్లింపులు జమ అవుతున్నాయి.రైతులకు పిలుపు.. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీపనుల నాణ్యత పర్యవేక్షణ కోసం రైతులు నీటి సంఘాలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ పనుల్లో భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే, యూరియా అధిక వినియోగం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున దాని వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రైతులకు అవసరమైన యూరియా, విత్తనాలను వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల ద్వారా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు రైతులకు ప్రభుత్వ రాయితీతో కూడిన జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలను మంత్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ,పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ అధికారులు, కూటమి నాయకులు లంకె శేషగిరిరావు, మధు, కాగిత గోపాలరావు తదితర నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

మంగళవారం 26, మే 2026

# ఎక్సైజ్ విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమీక్ష




- మద్యం విధానం, బీరు సరఫరాపై కీలక చర్చలు
- ఎక్సైజ్ రంగ సంస్కరణలపై లోతైన చర్చ

**ప్రజాభూమి ప్రతినిధి – అమరావతి**

రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖకు సంబంధించిన కీలక విధానాలు, ఆదాయ వృద్ధి చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సోమవారం మిశ్రిత విధానంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర , సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా, కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దూర మాధ్యమం ద్వారా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అమలులో ఉన్న ఎక్సైజ్ విక్రయ విధానం, దాని అమలు తీరుపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. లైసెన్స్ రుసుముల సవరణ, మద్యం దుకాణాల పునర్విభజన, వ్యాపారుల ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత పెంపు వంటి అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా విక్రయాలు, ఆదాయం, మార్కెట్ పరిస్థితులపై కూడా సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావం కారణంగా ముడి సరుకులు, రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో బీరు, మద్యం ధరల సవరణ అంశాన్ని కూడా సమావేశంలో పరిశీలించారు. ధరల మార్పులతో ప్రభుత్వ ఆదాయం, వ్యాపారులు, వినియోగదారులపై పడే ప్రభావంపై అధికారులు వివరించారు. రాష్ట్రంలో బీరు సరఫరా సామర్థ్యాన్ని పెంచేందుకు తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, ఎగుమతులకు అనుమతులు కల్పించడం, అధిక డిమాండ్ ఉన్న కాలాల్లో తాత్కాలిక చర్యలు చేపట్టడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. కొత్త పెట్టుబడులను ఆకర్షించే చర్యలపై అధికారులు వివరణ ఇచ్చారు. అదేవిధంగా విమానాశ్రయాల్లో మద్యం విక్రయ కేంద్రాల ఏర్పాటు, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతం, చలనం ఆధారిత గరిష్ఠ చిల్లర ధర ముద్రణ, అధిక శుద్ధి ఆల్కహాల్ తయారీకి ప్రత్యేక అనుమతి విధానం వంటి అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో పారదర్శకత పెంపు, ఆదాయ వృద్ధి, ఆధునికీకరణ, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా ఈ సంస్కరణలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

## అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసాగా సీఎం సహాయ నిధి : మంత్రి సుభాష్

**ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం**

రామచంద్రపురం నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 33 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.19.95 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,కూటమి పార్టీ సీనియర్‌నాయకులు వాసంశెట్టి సత్యం, ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, ముఖ్యంగా ఆరోగ్య పరిరక్షణ విషయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కష్టకాలంలో ఆదుకునే ఆపన్నహస్తమని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం గొప్ప భరోసానిచ్చే చర్యగా మంత్రి సుభాష్ అభివర్ణించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం సహాయనిధి అందేలా కృషి కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, గరికపాటి సూర్యనారాయణ, దడాల నాగార్జున, వయిట్ల గజలక్ష్మి, కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్ల పైన, షాపులు ముందు ఇష్టానుసారం చెత్తను వేసేవారిపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి

**నిర్ణీత దూరంలో ప్రతి ఇల్లు కవరు అయ్యేలా డస్ట్ బిన్లు ఏర్పాటు చెయ్యాలి : కలెక్టరు కె.వెట్రిసెల్వి**





**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

కైకలూరు నియోజకవర్గం పర్యటనలో భాగంగా సోమవారం బైపాస్ రోడ్డు గంగానమ్మ గుడివద్ద రోడ్లమీద చెత్త ఉండడం చూసి వెంటనే కారుదిగి ఇంటింటికి వెళ్ళి రోడ్లమీద చెత్తఎవ్వరూ వేశారని, ఇలా వెయ్యడం వలన పరిసరాలు పరిశుభ్రత లేకపోతే మనకు అంటు రోగాలు వస్తాయని జిల్లా కలెక్టరు హితవు పలికారు. నిర్ణీత దూరంలో చెత్త డస్ట్ బిన్లు ఏర్పాట్లు చెయ్యాలని అధికారులకు ఆదేశాలు, తడి,పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని ప్రజలకు జిల్లా కలెక్టరు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రోడ్డులు మీద, దుకాణాలు వద్ద ఇష్టానుసారంగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పారవేయడం వలన పరిసరాలు కాలుష్యానికి గురై ప్రజలు ఆరోగ్యంపై తీవ్రప్రభావం పడుతుందని అన్నారు. ఇంటి వద్ద, దుకాణాలలో ఏర్పడే చెత్తను ఒకేచోట సేకరించి, గ్రామ పంచాయతీ సిబ్బందికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లపై, ఇంటి బయట చెత్తవేయడం వలన ఈగలు, దోమలు పెరిగి దుర్వాసన వ్యాపిస్తుందని, తద్వారా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పట్టణ, గ్రామ పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి కుటుంబ, ప్రతి వ్యాపారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే మొదటి తప్పుగా వారికి నచ్చజెప్పి అవగాహన కల్పించాలని అన్నారు. రెండవసారి పునరావృతం అయితే అపరాధ రుసుములు విధించాలని అన్నారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టరు స్పష్టం చేశారు. ఈ సందర్భంలో ఇన్చార్జి ఆర్డీవో ఐ.కిషోరు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విఆర్ పురం మండలంలో ముగిసిన జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాలు





**ప్రజాభూమి ప్రతినిధి – వి.ఆర్.పురం.**

పోలవరం జిల్లా కలెక్టర్, పి.ఓ, ఐ.టి.డి.ఏ చింతూరు వారి ఆదేశాల మేరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాలు వి.ఆర్.పురం మండలంలోని 12 గ్రామాలలో 18-05-2026 నుండి 25-05-2026 వరకు విజయవంతంగా నిర్వహించబడ్డాయని ఎంపీడీవో ఇమ్మానియేల్ అన్నారు. ఉన్నత అధికారులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం చివరి రోజైన సోమవారం వి.ఆర్.పురం మండలంలోని టేకులూరు, బూరుగువాడ, అన్నవరం, తోటపల్లి, దారపల్లి గ్రామాలలో జన్ భాగీదారి కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ, "జన్ భాగీదారి అంటే ప్రజల భాగస్వామ్యం. ప్రభుత్వ కార్యక్రమాలలో, ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను ప్రజలకు తెలియపరచి, వారిని భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. సంబంధిత అధికారులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జన్ భాగీదారి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా గ్రామ సమస్యలను కూడా అధికారులు గుర్తించడం, ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, హెల్త్ డిపార్ట్‌మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, పిసా ఉపాధ్యక్షులు, పిసా కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి : జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ



**ప్రజా భూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతీ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ హాలులో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు అభిషేక్ గౌడ నిర్వహించారు. జాయింట్ కలెక్టరుతో పాటు ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం. ముక్కంటిలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అందిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంగాలో పరిష్కరించాలన్నారు. సోమవారం పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో 274 అర్జీలు అందాయని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని జేసీ హెచ్చరించారు. ప్రజల నుండి అందిన అర్జీలకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని జెసి ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే బండారు



- నియోజకవర్గంలో కొత్తగా 69 ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు
- అధిక ఉష్ణోగ్రతలతో డిమాండ్ పెరిగి విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయి
- విద్యుత్ వాడకంలో వినియోగదారులు అధికారుల సూచనలు పాటించాలి
- వచ్చే బుధవారానికి అందుబాటులోకి ఏనుగుల మహల్ సబ్ స్టేషన్ – కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ప్రజాభూమి ప్రతినిధి – కొత్తపేట**

గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిన వేసవి అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా అధిక లోడ్ పెరిగి ఈ మధ్య విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులు తగ్గించడానికి, వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి విద్యుత్ సిబ్బంది ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పెరిగిన విద్యుత్తు డిమాండ్, విద్యుత్ సరఫరాలో సమస్యలకు సంబంధించి రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు కొత్తపేట డీఈఈ డి. చిట్టిరాజు, మండపేట డి ఈ ఈ సి.హెచ్. శ్రీధర్, రావులపాలెం ఏఈ పి.నరేష్, ఆలమూరు ఏఈ డి. ఎం. కె.దుర్గాప్రసాద్ లతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యువ నాయకులు బండారు సంజీవ్ సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నూతనంగా 69 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరిగిపోయి ట్రాన్స్ఫార్మర్లు ఫెయిలవ్వడం, కాలిపోవడం జరుగుతుందన్నారు. ఎక్కడ ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన వెంటనే మరమ్మత్తు చేయడానికి 50 ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో మంజూరుతో సంబంధం లేకుండా సత్వరం ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోమని అధికారులకు తెలియజేస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు ఎక్కువగా ఏసీలు ఉపయోగించడం వల్ల లోడ్ అధికంగా అవుతుందన్నారు. వినియోగదారులు సహృదయంతో అర్థం చేసుకొని విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు. ఎక్కడ విద్యుత్ సమస్య తలెత్తిన వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన తర్వాత మరలా సరఫరా ప్రారంభమైన వెంటనే ఏసీలు ఆన్ చేయడం వల్ల లో వోల్టేజ్ వచ్చి కాలిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే ఏసీలు ఆఫ్ చేయడం, తిరిగి సరఫరా ప్రారంభమైన అరగంట తరువాత ఏసీలు ఆన్ చేయడం వల్ల విద్యుత్ పరికరాలు, సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. బుధవారానికల్లా ఏనుగుల మహల్ సబ్ స్టేషన్ అందుబాటులోకి వస్తుందన్నారు. 33/11 నర్సిపూడి సబ్ స్టేషన్ సాంక్షన్ అయ్యిందన్నారు. ఆత్రేయపురం, రావులపాలెం మండలం పరిధిలో ఎక్కడైనా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో విద్యుత్ ఇబ్బందులు తలెత్తకుండా, లో వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

## మంత్రి సుభాష్‌ని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



**ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం**

రామచంద్రపురంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైన విషయంపై కోర్టు ఏర్పాటుకు భవనం ఏర్పాటు విషయమై రామచంద్రాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు రాష్ట్ర కార్మిక ఫ్యాక్టరీలు బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ను సోమవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో కలిశారు. ప్రెసిడెంట్ కోటిపల్లి లోవరాజు మాట్లాడుతూ కోర్టుల ప్రాంగణంలో ఉన్న పాత మండల రెవెన్యూ కార్యాలయాన్ని అదనపు సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పాటుకు అనుమతిని మంజూరు చేయించాలని కోరారు.కక్షిదారుల సౌకర్యార్థం కోర్టు ఏర్పాటుకు సహకరించాలని పలువురు సీనియర్ న్యాయవాదులు కోరారు.దీనితో మంత్రి సుభాష్ మాట్లాడుతూ తప్పకుండా కోర్టు ఏర్పాటుకు పాత మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ టిడిపి సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్‌రాయ్, సీనియర్ న్యాయవాదులు పద్మనాభ రాజు, కముజు సూర్యనారాయణ, చిప్పాడ గోవిందాచార్యులు, వెలగల నరేందర్‌రెడ్డి, బి.తారకేశ్వరరావు, ఆనాల గంగాభవాని, పిల్లా పృథ్వి, సూదంశెట్టి వవిత, శాఖ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## జనగణన, గృహ జాబితా లెక్కింపు త్వరితగతిన పూర్తిచెయ్యాలి

**జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి**



**ప్రజా భూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

కైకలూరు-2 స్వర్ణగ్రామ సచివాలయంను సోమవారం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు చేశారు. హాజరు పట్టి, మూమెంటు రిజిస్టరును పరిశీలించి, ఎంతమంది పనిచేస్తున్నారు. ఎంతమంది వచ్చారని జిల్లా కలెక్టరు ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జనగణన గృహ జాబితా లెక్కింపు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచెయ్యాలని ఆదేశించారు. జిల్లా స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సచివాలయాలు ప్రజలకు సంతృప్తికరమైన సేవలు అందించి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న జనగణన గృహ జాబితా లెక్కింపు కార్యక్రమాన్ని పారదర్శంగా నిర్వహించి, నిర్ణీత సమయంలోగా పూర్తిచెయ్యాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు, సిబ్బంది ప్రజలు పట్ల స్నేహపూరిత వాతావరణంలో విధులు నిర్వహించాలని అన్నారు. ఇంటింటికి వెళ్ళి సేకరిస్తున్న వివరాలు, నమోదు విధానం, ప్రజలు స్పందన తదితర అంశాలుపై జిల్లా కలెక్టరు ఆరా తీశారు. గృహాలు వివరాలు నమోదు చేసే సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జనగణన ప్రక్రియ దేశాభివృద్ధి ప్రణాళికలకు ఎంతో కీలకమని, ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని తెలిపారు. గృహ జాబితా లెక్కింపు కార్యక్రమాన్ని నిర్ణీత సమయంలోగా పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజలకు మర్యాదపూర్వకంగా వ్యవహరించి, అవసరమైన సమాచారాన్ని సక్రమంగా నమోదు చెయ్యాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని జిల్లా కలెక్టరు కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఆర్డీవో ఐ.కిషోరు, జిల్లా వ్యవసాయ శాఖ జెడి యస్.కె.హబీబ్ భాషా, తహశీల్దారు రామకృష్ణ, యంపిడివో ఆర్.రాజబాబు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## జలధార- జలహారతి కార్యక్రమాల్లో అధికారులు సమన్వయంగా విధులు నిర్వహించాలి



**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**

జిల్లాలో జలధార-జలహారతి కార్యక్రమంలో ఇరిగేషన్, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో సోమవారం జిల్లాలో జరుగుతున్న జలధార-జలహారతి కార్యక్రమంలో చేపట్టిన పనుల ప్రగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిలాల్లో జలధార – జలహారతి కార్యక్రమంలో 82. 22 కోట్ల రూపాయలతో 1929 పనులు మంజూరు కాగా, ఇంతవరకు 380 పనులు పూర్తి అయ్యాయని, 821 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రారంభమైన పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జలధార-జలహారతి కార్యక్రమంలో చేపట్టిన పనులు రైతులకు, ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. కురిసిన ప్రతీ వర్షపు నీటిని పరిరక్షించేందుకు జలధార-జలహారతి పనులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కాలువలలో డీసిల్టింగ్ పనులను ఇరిగేషన్ శాఖ నిర్దేశించిన ప్రమాణాల మేరకు చేయాలన్నారు. కాలువలు, చెరువులలో డీసిల్టింగ్ అనంతరం ఆ మేరకు నీటినిల్వ సామర్థ్యం పెరగాలన్నారు. జలధార కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే కూలీలకు పనిచేసే ప్రదేశంలో త్రాగునీరు, మజ్జిగ, నీడ ప్రదేశం ఏర్పాటుచేయాలన్నారు. జలధార-జలహారతి కార్యక్రమంలో చేపట్టిన పనులను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 100 రోజులలోగా పూర్తిచేయాలన్నారు. మంజూరు చేసిన పనులను చేపట్టక ముందు – చేపట్టిన తరవాత ఫోటోలను ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు. చేపట్టిన పనులు తప్పనిసరిగా నాణ్యతతో ఉండాలన్నారు. నాణ్యతా లోపం గుర్తిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డ్వామా పీడీ సుబ్బారావు, అదనపు పీడీ రాజశేఖర్, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఎంపిడిఓ లు, డ్వామా ఏపిడి లు, ప్రభృతులు పాల్గొన్నారు.

## నూజివీడులో మహానాడు విజయవంతానికి సమన్వయం అవసరం

**ప్రజా భూమి ప్రతినిధి-నూజివీడు**

నూజివీడు నియోజకవర్గంలో ఈనెల 27, 28 తేదీలలో జరిగే మహానాడు కార్యక్రమాలను విజయవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్ర మంత్రి కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జీలు, నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలుగుదేశం పార్టీ పేద ప్రజల అభ్యున్నతికి ఏర్పడిన పార్టీ అని పేర్కొంటూ, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల బియ్యం, పక్కా ఇళ్ల వంటి పథకాలను గుర్తు చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు హయాంలో టెక్నాలజీ, విద్య, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. నారా లోకేష్ కృషితో విద్య, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు.మహానాడుకు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని, త్రాగునీరు, భోజనం, రవాణా వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

## రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువుల కొరత లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి

-దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్.



**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

రానున్న ఖరీఫ్ సీజన్లో  దెందులూరు నియోజకవర్గంలోని రైతాంగానికి ఎరువులు, విత్తనాలకు ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని దెందులూరు  ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్‌ని కలిసి దెందులూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ స్పందించి ఎమ్మెల్యే తెలియజేసిన సమస్యలపై వెంటనే పరిష్కార చర్యలను సంబంధిత శాఖల అధికారులను జేసీ ఆదేశించారు.


## గంగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి



**ప్రజా భూమి ప్రతినిధి-పులివెందుల**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుడి పల్లెలో నివాసముంటున్న బూచుపల్లి రమణా రెడ్డి, బూచుపల్లి విశ్వనాథ్ రెడ్డి, ల తండ్రి బూచుపల్లి గంగిరెడ్డి ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చా ర్జిలు వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంతు రెడ్డిలు సోమవారం వారి నివాసానికి వెళ్లి గంగిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లూయిస్ జెంట్స్ వేరును ప్రారంభించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి



**ప్రజా భూమి ప్రతినిధి-పులివెందుల**

పులివెందుల పట్టణంలోని మెయిన్ బజార్ సత్రం స్కూల్ సమీపంలో లూయిస్ జెంట్స్ వేర్ షాప్ ను సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ వైకాపా ఇన్చార్జిలు వైయస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డిలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు దుకాణ యజమానులు పవన్ కుమార్, జస్వంత్ తో మాట్లాడుతూ దుకా ణానికి వచ్చే వినియోగ దారులతో మర్యాదపూర్వ కంగా మాట్లాడడం వల్ల వ్యాపార అభివృద్ధి చెందు తుందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బట్టలను అందజేయాలన్నారు. వ్యాపారం దినదిన అభివృద్ధి చెందే విధంగా చూసుకోవాలన్నారు. అంతకుముందుగా వారిని దుకాణ యజమానులు బాణా సంచాలు పేలుస్తూ ఘన స్వాగతం పలికా రు.అనంతరం దుశాలవాలతో,పూలహారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు వరప్రసాద్, రసూల్, సర్వోత్తమ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి,పట్టణ ఉపాధ్య క్షుడు పార్నపల్లి కిషోర్, తదితరు వైకాపా నాయకు లు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుగునాథరెడ్డిని పరామర్శించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**ప్రజా భూమి ప్రతినిధి-పులివెందుల**



యు సి ఐ ఎల్ ఉద్యోగి యూనియన్ నాయకుడు సుగునాధ రెడ్డి పై గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాడ్లతో విచక్షణ రహితంగాదాడి చేసి గాయపరిచారు. ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మున్సిపాలిటీ పరిధిలోని చిన్న రంగాపురం గ్రామం లో ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న సుగునాథరెడ్డిని సోమవారం ఆయన నివాసానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా బాగా విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకోవాలని, దాడికి గల కారణాలను ఆయనను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బంగారు కుటుంబం కార్యక్రమంపై సమీక్ష సమావేశం

### ఆగిరిపల్లిలో 93 కుటుంబాలకు ఉపాధి, ఆర్థిక సహాయం





**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పి-4 (బంగారు కుటుంబం) కార్యక్రమానికి సంబంధించిన ఆగిరిపల్లి గ్రామ కమిటీ సమీక్ష సమావేశం ఎంపీడీవో అబ్దుల్ సలాం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మండవ ఫౌండేషన్ సిఎస్ఆర్ సలహాదారు డి.వి.రావు, బెల్లం సుబ్బారావు, మండవ వెంకటేశ్వరరావు, నరేంద్ర, విశ్రాంత ఉపాధ్యాయులు రాజు, పాల్ రమేష్, సుందర్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో పి-4 కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల పరిస్థితి, అందించిన సహాయాన్ని వారు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారన్న అంశాలపై కూలంకషంగా చర్చించారు. అలాగే లబ్ధిదారులకు ఇంకా అవసరమైన సహాయంపై అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటివరకు ఆగిరిపల్లి గ్రామంలో 112 మంది లబ్ధిదారుల్లో 93 కుటుంబాలకు వివిధ రూపాల్లో సహాయం అందించినట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు.

కార్యక్రమం ద్వారా 29 గేదెలు, 4 కుట్టు యంత్రాలు, 1 పిండి యంత్రం, 4 మెకానికల్ యూనిట్లు, 8 మేకలు-గొర్రెల యూనిట్లు, 13 ఆటోలు, 5 వస్త్ర వ్యాపార యూనిట్లు, 1 చిన్న దుకాణం, 7 కిరాణా దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు 8 మందికి పాఠశాల, కళాశాల ఫీజులు అందించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 16 మందికి డ్రైవింగ్ శిక్షణ ఇచ్చి లైసెన్సులు ఇప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని సమావేశంలో వెల్లడించారు. అలాగే ఆగిరిపల్లి గ్రామంలోని బంగారు కుటుంబ సభ్యులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్న మండవ ఫౌండేషన్, నూజివీడు సీడ్స్ అధినేత మండవ ప్రభాకర్ రావు, ఆశాప్రియ దంపతులకు సమావేశంలో ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షిస్తూ సమావేశాన్ని ముగించి నట్లు డివి రావు తెలిపారు.

# స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో మంత్రి నిమ్మల శ్రమదానం

### లంకలకోడేరు, భగ్గేశ్వరం స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు





**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో స్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో  రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు  శ్రమదానం చేశారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరం, లంకలకోడేరు గ్రామాల్లో రూ 65 లక్షలతో స్మశాన వాటికల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లంకలకోడేరు లో  స్మశాన వాటిక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి గ్రామస్తులతో కలిసి శ్రమదాన పనుల్లో పాల్గొన్నారు. అపరిశుభ్రంగా ఉన్న  స్మశాన వాటిక ప్రదేశాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు, వృక్షాలను, చెత్తాచెదారంను తొలగించారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గం లో అన్ని స్మశాన వాటికలను  దశలవారీగా ఆరోగ్యకర సుందరీకరణ ప్రదేశాలుగా  తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు పట్టణంలోని  హిందూ స్మశాన వాటికను ఆహ్లాదకర, ఆరోగ్యకరమైన కైలాస వనంను పార్క్  తరహాలో తీర్చిదిద్దామని తెలిపారు. కూటమి  ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అయిదు నెలల క్రితం స్మశాన వాటికలను అభివృద్ధి పరచాలని, అందులో భాగంగా కొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి మనిషికి పుట్టుక ఎంత ముఖ్యమో చనిపోయిన తర్వాత చివరి మజిలీ కూడా అంతేనన్నారు.గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. స్మశాన వాటికలను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని, ఇదే సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా  పలు సంస్థలు ఏజెన్సీల నుంచి  సి ఎస్ ఆర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పరుస్తున్నామన్నారు.  ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గొడ్డలి పార్టీ భూతాన్ని భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.సేవతో ముడిపడి ఉన్న రాజకీయాల్లో కొనసాగటానికి  వైకాపా గొడ్డలి పార్టీకి  అర్హత లేదన్నారు.ఐదేళ్ల వైకాపా అరాచక పాలనలో.. రాష్ట్రం అధోగతి పాలు అయి ప్రగతి పాతికేళ్లు  వెనక్కి పోయిందన్నారు.గత పాలనలో సంపద సృష్టి లేకపోగా ఉన్న సంపద ఆవిరి అయిపోయి రాష్ట్ర అప్పుల పాలైపోయిందన్నారు.ప్రభుత్వాస్తులు తాకట్టు పెట్టి ప్రైవేట్ ఆస్తులు లాగేసుకోవడమే గత పాలన విధానమని మంత్రి నిమ్మల తెలిపారు. టన్నుల టన్నుల అబద్ధాలు  తమ అవినీతి కరపత్రికలో అచ్చోసి గొడ్డలి పార్టీ  కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలని ప్రయత్నిస్తోందన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు ఫలించవని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ కోడి విజయ భాస్కర్, మాజీ సర్పంచ్ చొప్పల రజిని పాముల రజిని కుమార్ , స్పెషల్ ఆఫీసర్ శర్మ, సెక్రటరీ రాజేష్  పెనుమాత్స శ్రీనివాస రాజు, కుక్కల సత్యనారాయణ, కాసా కోటి వీరభద్రరావు, దొంగ బాబాయి, , పెనుమత్స సత్యనారాయణ రాజు , ఆకుల బ్రహ్మాజీ, , తదితరు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల మీకోసం అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ
- సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశం
- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు: కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ

**ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటిని సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, డీఆర్ఓ కే చంద్రశేఖరరావు, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, డీఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓర్పుగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అర్జీని బాధ్యతగా పరిగణించి, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆయన స్పష్టం చేశారు.'మీకోసం' లో వెల్లువెత్తిన ప్రధాన సమస్యలు ఇవే.. రోడ్డు పనులు పూర్తి చేయండి - సుల్తానగరం గ్రామస్థుల వినతి మచిలీపట్నం మండలం సుల్తానగరం నుండి కంకటావ, ముక్కొల్లు మీదుగా జోకిపర్రుకు వెళ్ళే ఆర్ అండ్ బి రహదారి మరమ్మతుల పనులు 2026 జనవరిలో ప్రారంభమయ్యాయి. అయితే ఉన్న రోడ్డును తొలగించి, పనులు పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కంకర రాళ్లు



పైకిలేచి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ బస్సు సైతం గ్రామానికి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఆలయ ప్రవేశం కల్పించాలి - కుమ్మరిపాలెం దళితుల విన్నపం కోడూరు మండలం కుమ్మరిపాలెం దళితవాడలో ఉన్న లంకమ్మ తల్లి ఆలయంలోకి ఎన్నో సంవత్సరాలుగా దళితులకు ప్రవేశం నిరాకరిస్తున్నారని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కొంతమంది అగ్రకుల పెత్తందారులు ఉద్దేశపూర్వకంగా ప్రవేశాన్ని అడ్డుకుంటున్నారని, దీనిపై తగిన విచారణ జరిపి తమకు ఆలయ ప్రవేశం కల్పించి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.దారి ఆక్రమణలు తొలగించండి - పెద్దతుమ్మిడి గ్రామస్థుల ఫిర్యాదుబంటుమిల్లి మండలం పెద్దతుమ్మిడి శివారు మల్లపరాజుగుడెం గ్రామంలోని ఆర్.ఏ స్.నెం 189లో ఉన్న పాత హరిజనవాడ రహదారిని కొంతమంది ఆక్రమించుకుని షెడ్డు నిర్మించారని డివివి సత్యనారాయణ తదితరులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. దీనిపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, తక్షణమే ఆక్రమణలను తొలగించి రహదారి ఇబ్బందులను తీర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రబాబుది తడిగుడ్డల రాజకీయం.. వై నాట్ 'మేనిఫెస్టో' ధైర్యం?

### పేర్ని నాని తీవ్ర ధ్వజం

**ప్రజాభూమి ప్రతినిధి-విజయవాడ**



మాది గొడ్డలి పార్టీ అయితే.. మీది తడిగుడ్డల పార్టీనా చంద్రబాబు నాడు మోడీని తిట్టి, నేడు కాళ్ళు పట్టుకున్న నీకు మాట మీద నిలకడ ఉందా? జగన్ అంటే ఎందుకంత భయం? అంటూ మాజీ మంత్రి పేర్ని నాని నిప్పులు చెరిగారు.కూటమి ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరిపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బందరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ సరళిని, స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎండగట్టారు. ఆయన మాట్లాడిన ముఖ్యాంశాలు 'ప్రజా భూమి' పాఠకుల కోసం ప్రత్యేకంగా..

**మాట మీద నిలకడ లేని వ్యక్తి చంద్రబాబు**

2004లో నరేంద్ర మోడీ దేశానికి దరిద్రం అని, బీజేపీతో అనవసరంగా పొత్తు పెట్టుకున్నామని మాట్లాడిన చంద్రబాబు.. ఈరోజు ఏ ముఖం పెట్టుకుని ఆ పార్టీతో జతకట్టారని పేర్ని నాని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఎలక్షన్ల ముందు ఒకలా, ఎలక్షన్లు అయిపోయిన తర్వాత మరొకలా మాట్లాడటం వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు.గొడ్డలి రాజకీయంపై సవాల్ మాది గొడ్డలి పార్టీ అని విమర్శిస్తున్నారు కదా.. మరి జగన్ మోహన్ రెడ్డి నిజంగానే వాళ్ల బాబాయ్‌ని గొడ్డలితో నరికిస్తే, ఇప్పుడు అధికారం మీ చేతిలోనే ఉందిగా? ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? ఎందుకు చేతగానితనం ప్రదర్శిస్తున్నారు? అని నిలదీశారు.మేనిఫెస్టో ధైర్యం ఉందా? వైఎస్సార్‌సీపీ హయాంలో ఇచ్చిన మేనిఫెస్టోను ప్రతి సచివాలయం నోటీస్ బోర్డులో పెట్టామని, ఇప్పుడు కూటమి ఇచ్చిన మేనిఫెస్టోను కనీసం తమ పార్టీ కార్యాలయంలో కూడా పెట్టుకునే దమ్ము చంద్రబాబుకు ఉందా అని సవాల్ విసిరారు.

జనాల్లో మార్పు: ఈరోజు ప్రజానికం చాలా తెలివిగా ఉన్నారు. రాజకీయ నాయకుల అబద్ధపు మాటలు వినే పరిస్థితిలో జనం లేరు. ప్రజలకు ఇంధన పొదుపు కోసం సైకిల్ తొక్కాలని ఉచిత సలహాలు ఇస్తున్న చంద్రబాబు.. మరి తానెందుకు విమానాల్లో తిరుగుతున్నారో సమాధానం చెప్పాలి" అన్నారు.

**బందరు ఎమ్మెల్యే అరాచకాలు.. పవన్ కళ్యాణ్ ఎక్కడ?**

బందరు నియోజకవర్గంలో జరుగుతున్న భూకబ్జాలు, దౌర్జన్యాలపై పేర్ని నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషన్ ఇవ్వనందుకు బందరులో స్వయంగా జనసేన పార్టీ నాయకుడి ఇల్లే నేలమట్టం చేశారని సంచలన ఆరోపణ చేశారు.ఉపముఖ్యమంత్రి మౌనం 'ప్రశ్నిస్తా' అని వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.. తన సొంత కార్యకర్తకు అన్యాయం జరిగి ఇల్లు కూల్చేస్తుంటే ఎందుకు వచ్చి ప్రశ్నించలేదు?ఎంపీ నాటకాలు ఇల్లంతా సర్వనాశనం అయిపోయిన తర్వాత.. ఎప్పటికో ఎంపీ గారు వచ్చి కమిషనర్‌పై కసుబుస్సులాడుతూ ప్రజాకోర్టులో డ్రామాలు ఆడుతున్నారు.ఎమ్మెల్యే రాజభవనం ఒకరి దగ్గర నుంచి బలవంతంగా భూమి లాక్కుని ఎమ్మెల్యే కడుతున్న రాజభవనానికి పర్మిషన్లు ఎక్కడి నుండి వచ్చాయి? అసలు ఉన్నాయా లేదా?ప్రజలు అన్నీ గమనిస్తున్నారు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అరాచకాలను, బందరులో సాగుతున్న బలవంతపు వసూళ్లను, కబ్జాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్ని నాని హెచ్చరించారు. అధికార గర్వంతో విర్రవీగితే ప్రజలే బుద్ధి చెబుతారని, ఇప్పటికైనా చంద్రబాబు మార్చుకోవాల్సింది తన వైఖరిని అని నాని స్పష్టం చేశారు.